

నేతాజీ సుభాష్ చంద్రబోస్
రూ:70/-
పేజీలు:68
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన బుక్ హౌస్



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM



ట్రంప్ 'సుంకాల బెదిరింపు' ప్రపంచానికి ముప్పు

చిన్నారులకు పోషకాహారం అందిస్తే... ఉజ్వల భవిష్యత్తు

జిడిపి వృద్ధిలో నేలచూపుల అంచనాలు

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 42 | గురువారం | 09-01-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00




మే 1 నుంచి..

## కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు

టిజిపిఎస్‌సి చైర్మన్ బుర్రా వెంకటేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ శాఖలలో మే 1నుంచి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్‌ను జారీ చేస్తామని టిజిపిఎస్‌సి చైర్మన్ బుర్రా వెంకటేశం వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారమే ఫలితాలు విడుదలయ్యేలా చూస్తామని, ఈ నెల 10లోపు 'గ్రూప్ 2కీ' రెండు రోజుల్లో విడుదల చేస్తామని, త్వరలోనే ఫలితాలను వెల్లడిస్తామని తెలిపారు. ప్రభుత్వ శాఖలలో మార్చి31లోపల ఖాళీల జాబితా తరువాయి 12లో



## రాష్ట్రంలో త్వరలో 'స్థానిక' ఎన్నికలు

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా చర్యలు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

గాంధీభవన్‌లో టిపిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నామని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ శ్రేణులు మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం బుధవారం గాంధీభవన్‌లో జరిగింది. సమావేశానికి ఎఐసిసిసి తెలంగాణ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ అధ్యక్షతన వహించగా, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, సిఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు 23 మంది సభ్యులు పాల్గొన్నారు. మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి కి సంతాప సూచకంగా సమావేశం మౌనం పాటించి నివాళి అర్పించింది. సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నామని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జనవరి 26 నుంచి రైతు భరోసాను, భూమి వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.12వేలు అందించనున్నట్లు పునరుద్ఘాటించారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నామని, మొదటి ఏడాదిలోనే 55,143 ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేశామని, రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, ఏడాదిలో రూ.54 వేల కోట్లు రైతుల సంక్షేమం కోసం ఖర్చు చేశామని, రూ.500లకే సిలిండర్ ఇస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని, ఇప్పటి వరకు రూ.4000 కోట్లు ప్రభుత్వం ఆర్‌టిసికి చెల్లించిందన్నారు. ఈ కార్యక్రమాలన్నింటినీ కాంగ్రెస్ శ్రేణులు ప్రజలకు వివరించాలని, తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని సిఎం అన్నారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తరువాయి 2లో

ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి పనులకు

# రూ.2.08 లక్షల కోట్లు

ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

2030లోగా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి లక్ష్యమని వెల్లడి



**విశాఖపట్నం :** ఆంధ్రప్రదేశ్‌కు అన్ని రంగాల్లో మద్దతుగా నిలుస్తున్నామని, రాష్ట్రంతో భుజం భుజం కలిపి నడుస్తామని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఆధునిక ఆంధ్రప్రదేశ్ ను ఆవిష్కరిస్తామని, ప్రజల ఆశలకు మద్దతు అందిస్తూ రాష్ట్రాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ప్రకటించారు. మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. ఈ క్రమంలో బుధవారం విశాఖపట్నం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల తరువాయి 2లో



## తిరుపతిలో తోపులాట

ఆరుగురు మృతి

**తిరుపతి:** వైకుంఠ ద్వార సర్వదర్శనం టోకెన్ల జారీ నేపథ్యంలో తిరుపతిలో అపశ్రుతి చోటు చేసుకుంది. టోకెన్ల కోసం ఊహించని రీతిలో భక్తులు రావడంతో తీవ్ర తోపులాట జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు భక్తులు మృతి చెందారు. మృతుల్లో ఐదుగురు మహిళలు ఉన్నట్లు గుర్తించారు. అస్వస్థతకు గురైన వారిని అంబులెన్స్‌ల్లో తిరుపతిలోని ఆసుపత్రులకు తరలించారు. రుయా ఆసుపత్రిలో 20 మంది, స్విమ్స్‌లో 9 మంది చికిత్స పొందుతున్నారు. రుయా ఆస్పత్రికి కలెక్టర్ వెంకటేశ్వర్, టిటిడి ఇఒ శ్యామలరావు చేరుకుని వైద్య సేవలను పర్యవేక్షించారు. తిరుపతిలోని శ్రీనివాసం, సత్యనారాయణపురం బైరాగిపట్టెడ రామానాయుడు స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాల్లో భక్తుల మధ్య తోపులాట జరిగింది. గురువారం ఉదయం 5 గంటల నుంచి తిరుపతిలోని తొమ్మిది కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 94 కౌంటర్ల ద్వారా వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లు జారీ చేయాలని టిటిడి నిర్ణయించింది. అయితే, టోకెన్ల కోసం బుధవారం సాయంత్రమే భక్తులు భారీగా తరలివచ్చారు. తొక్కిసలాటలో గాయపడిన బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. తోపులాట జరిగిన ప్రాంతాలకు విజిలెన్స్, అదనపు పోలీసు బలగాలు భారీగా చేరుకున్నాయి. మరోవైపు, ఘటనా స్థలం వద్ద పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు నగర పాలక కమిషనర్ తెలిపారు.

తొక్కిసలాటకు కారణమిదే..

టోకెన్ల కోసం వచ్చిన భక్తులు రోడ్లపై గుమిగూడకుండా బైరాగిపట్టెడ వద్ద ఉన్న పద్మావతి పార్కులో ఉంచారు. అయితే, తరువాయి 2లో



గ్రూప్ -3 పరీక్ష

## ప్రాథమిక 'కీ' విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రూప్3 పరీక్ష ప్రాథమిక కీని టిజిపిఎస్‌సి బుధవారం విడుదల చేసింది. అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్లలో ప్రాథమిక కీ అందుబాటులో ఉంటుందని టిజిపిఎస్‌సి తెలిపింది. ఈనెల జనవరి 12 వరకు గ్రూప్ 3 ప్రాథమిక కీ అందుబాటులో ఉంటుందని, దీనిపైన ఏమైనా సందేహాలు ఉంటే ఈనెల 12న సాయంత్రం 5 వరకు స్వీకరిస్తామని టిజిపిఎస్‌సి పేర్కొంది. అభ్యంతరాలను ఇంగ్లీష్‌లో తెలపాలని, అభ్యర్థులు లేవనెత్తిన తరువాయి 2లో

## కెటిఆర్‌తో లాయర్ ఉండొచ్చు

దర్యాప్తు చేసే సమయంలో లాయర్ కనిపించే విధంగా ఎసిబి ఏర్పాట్లు చేయాలి

ఆడియో, వీడియో రికార్డింగ్‌కు నిరాకరణ

కెటిఆర్ లంచ్‌మోషన్ పిటిషన్‌లో హైకోర్టు ఆదేశాలు

ప్రజాపక్షం / హైదరాబాద్

ఫార్ములా–ఈ కార్ రేస్ పేరిట అక్రమాలు జరిగాయంటూ ఎసిబి దాఖలు చేసిన కేసు దర్యాప్తునకు తొలి నిందితుడు మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు (కెటిఆర్) తన వెంట న్యాయవాదిని తీసుకువెళ్లవచ్చునని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం జరిగే విచారణకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని, ఈ దశలో తన వెంట లాయర్‌ను తీసుకువెళ్లేందుకు పోలీసులు అనుమతించాలని కోరుతూ కెటిఆర్ దాఖలు చేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌ను బుధవారం హైకోర్టు విచారించింది. లాయర్‌ను వెంట తీసుకువెళ్లేందుకు కెటిఆర్‌కు అనుమతి ఇచ్చింది. అయితే, ఆ లాయర్ విచారణలో జోక్యం చేసుకోవడంగానీ, ఎసిబి దర్యాప్తు చేసే గదిలోకి వెళ్లడంగానీ చేయరాదని, ఎసిబి కెటిఆర్‌ను దర్యాప్తు చేసేప్పుడు లాయర్‌కు కనబడే విధంగా ఏసీబీ ఏర్పాట్లు చేయాలని ఆదేశాలను జారీ చేసింది. ఉదయం విచారణసమయంలో లంచ్‌మోషన్ పిటిషన్‌ను విచారణ చేపట్టాలని కేటీఆర్ తరపు సీనియర్ అడ్వొకేట్ ప్రభాకర్‌రావు కోరారు. అందుకు న్యాయమూర్తి అనుమతిచ్చి మధ్యాహ్నం 2.15 గంటలకు విచారణ చేపట్టారు. లాయర్‌ను అనుమతిస్తే దర్యాప్తు సీన్ కనబడే విధంగా ఎసిబి ఆఫీసులో వసతుల గురించి తెలుసుకుని చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. తిరిగి సాయంత్రం 4 గంటలకు విచారణ చేపట్టారు. కేటీఆర్ న్యాయవాది వాదిస్తూ, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్, ఎపి ఎంపి అవినాష్‌రెడ్డి కేసులో ఇదే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు కెటిఆర్‌ను ఎసిబి దర్యాప్తు చేసేప్పుడు లాయర్‌ను అనుమతించాలని కోరారు. న్యాయవాదిని అనుమతించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం తరపు అదనపు ఏజీ తరువాయి 2లో




## నేడు ఎసిబి విచారణ



అరవింద్‌కుమార్, బిఎల్‌ఎన్‌రెడ్డిలను విచారించిన ఎసిబి, ఇడి

ఫార్ములా ఇకార్ రేస్ కేసులో విచారణకు అడ్డంకులు తొలగిపోవడంతో ఎట్టకేలకు ఈ కేసులో ఎ1 నిందితుడిగా ఉన్న బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్‌ను గురువారం ఎసిబి అధికారులు విచారించనున్నారు. ఈ మేరకు బంజారాహిల్స్‌లోని ఎసిబి కార్యాలయం వద్ద ముందు జాగ్రత్త చర్యగా తరువాయి 2లో



తెలంగాణలో నిలిచిన

## యుబిఎల్ బీర్ల సరఫరా

ధరలు పెంచాలని కంపెనీల డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలోని మద్యం ప్రియులకు ఇది బ్యాడ్ న్యూస్. తెలంగాణలో పలు బీర్ల సరఫరాను నిలిపివేస్తూ యునైటెడ్ బ్రెవరైజెస్ లిమిటెడ్(యుబిఎల్) నిర్ణయం తీసుకుంది. ఎక్సైజ్ శాఖకు కింగ్ ఫిషర్, హీనెకెన్ బీర్ల సరఫరాను నిలిపివేస్తూ యుబిఎల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో 2019 నుంచి ధరలను తరువాయి 2లో



జమిలి ఎన్నికల ప్రతిపాదన

## రాజ్యాంగ విలువల అవహేళన

ఈ బిల్లులు సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకమన్న ప్రతిపక్షాలు

జెపిసి మొదటి సమావేశంలో వాడీవేడిగా భిన్నవాదనలు

ఎంపిలందరికీ 18,000 పేజీల నివేదికల ప్రతులిచ్చిన కమిటీ

**న్యూఢిల్లీ :** జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులను పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జె పి సి) తొలి సమావేశంలో బుధవారంనాడు అధికార–ప్రతిపక్ష ఎంపీలమధ్య వాడీవేడిగా అనుకూల ప్రతికూల వాదనలు జరిగాయి. ఈ బిల్లులపై ప్రతిపక్ష ఎంపీలు అనేక ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల ఖర్చు తగ్గుతుందన్న ప్రభుత్వ వాదనను కమిటీలో నిలదీశారు. రాజ్యాంగ మౌలిక నిర్మాణంపైన, సమాఖ్య వ్యవస్థపై దాడి చేసే ఉద్దేశంతోనే దేశంలో అన్నిస్థాయిలలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచన తీసుకువచ్చారని ప్రతిపక్ష ఎంపీలు తప్పుపట్టారు. అనేక రాష్ట్రాలలో అసెంబ్లీలను గడువుకు ముందుగానే రద్దుచేయడం, లోక్‌సభ పదవీ కాలంతో అన్ని అసెంబ్లీల పదవీకాలాలనూ తరువాయి 2లో




మహిళల శరీరంపై వ్యాఖ్యలు చేసినా..

## లైంగిక వేధింపే అవుతుంది

కేరళ హైకోర్టు

**కొచ్చి:** మహిళల శరీరం నిర్మాణంపై ఎటువంటి వ్యాఖ్యలు చేసినా.. అది లైంగిక వేధింపు అవుతుందని కేరళ హైకోర్టు పేర్కొన్నది. ఈ మేరకు జస్టిస్ ఎ బదరుద్దీన్ తీర్పును ఇచ్చారు. కేరళ విద్యుత్తు శాఖకు చెందిన ఓ మహిళా ఉద్యోగినిపై మరో ఉద్యోగి కామెంట్ చేశారు. దీంతో ఆమె లైంగిక వేధింపుల కేసు నమోదు చేసింది. ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆ ఉద్యోగి కోర్టును తరువాయి 12లో




## షా రాజీనామా చేయాల్సిందే..

ఏప్రిల్ 14 నుంచి దేశ వ్యాప్త ఉద్యమం ప్రారంభం

కేంద్ర హోంమంత్రి దిగిపోయేంతవరకూ పోరాటం కొనసాగిస్తాం

ఎఐడిఆర్‌ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి నిర్మల్ కుమార్

ప్రజాపక్షం/హైదరాబాద్

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బి.ఆర్.అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాల్సిందేనని అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం జాతీయ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.నిర్మల్ కుమార్ డిమాండ్ చేశారు. అమిత్‌షా తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వ తేదీ నుంచి దేశ వ్యాప్త ఉద్యమం ప్రారంభించనున్నామని, ఆయన రాజీనామా చేసేంత వరకు తమ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల నరసింహ్మా, ఎఐడిఆర్‌ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి నిర్మల్ కుమార్, జాతీయ కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసు రత్నం, ఉపాధ్యక్షుడు కె.సహదేవ్, కోశాధికారి ఆరుట్ల రాజ్ కుమార్‌లు తరువాయి 12లో



## దావాగ్ని బీభత్సంలో 'లాస్'ఏంజెల్స్

5 లో

ఇళ్ళు–కార్లు వదిలి సెలబ్రిటీల పరుగులు

హాలీవుడ్ షూటింగ్‌ను తలపించిన వాస్తవ దృశ్యాలు

స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ : 30వేలమంది తరలింపు



ఇప్టా 90 వసంతాల వేడుకల్లో నల్లూరి వెంకటేశ్వర్లు, కందిమల్ల ప్రతాప్‌రెడ్డి, ఏటుకూరి ప్రసాద్‌లకు సన్మానం

12

# గ్రీన్‌లాండ్, పనామా స్వాధీనానికి అవసరమైతే సైనికచర్య!

## గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరు మార్చేస్తాం: ట్రంప్ వీరంగం




**ఫ్లోరిడా :** అమెరికా ఆర్థిక–జాతీయ భద్రతకు గ్రీన్‌లాండ్‌ను, పనామాను స్వాధీనం చేసుకుంటామని కాబోయే అమెరికా అధ్యక్షుడు డోనాల్‌ట్రంప్ స్పష్టం చేశారు. అధికారం చేపట్టకముందే తన వరుస ప్రకటనలతో అందిలోనూ గుబులు పుట్టిస్తున్నారు. అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా చేరిపోవాలని అడుగున్న ట్రంప్ పొరుగున ఉన్న గ్రీన్‌లాండ్, పనామాలపై కూడా తన వైఖరి ఏమిటో మరోసారి తెలియజేశారు. బుధవారంనాడు ఫ్లోరిడాలోని తన మార్–ఎ–లాగో ఎస్టేట్‌లో ట్రంప్ పాత్రికేయులతో మాట్లాడారు. ఈనెల 20న ప్రమాణ స్వీకారం సందర్భంగా విస్తారమైన అనేక విషయాలపై పాత్రికేయుల ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. తన కుమారుడు జూనియర్ డోనాల్డ్ ట్రంప్ జూనియర్ గ్రీన్‌లాండ్ పర్యటన సందర్భంగా ఒక ప్రశ్నకు ట్రంప్ పైవిధంగా స్పందించారు. ''వీటి స్వాధీనానికి మీరు సైనికబలాన్ని ఉపయోగిస్తారా? లేక ఆర్థికశక్తిని ఉపయోగిస్తారా?'' అని పాత్రికేయులు ట్రంప్‌ను ప్రశ్నించినప్పుడు, ఈ రెండింటిలో దేనినీ తోసిపుచ్చే అవకాశం లేదని, అలా జరగదని తాను చెప్పలేనని స్పష్టం చేశారు. ''కానీ నేనొకటి చెప్పగలను, అమెరికా ఆర్థిక భద్రత దృష్ట్యా ఈ రెండింటి అవసరం (గ్రీన్‌లాండ్, పనామా) మాకు ఉంది'' అని ట్రంప్ ప్రకటించారు. ఇక కెనడా–అమెరికా మధ్య 1700 సంవత్సరంలో జరిగిన చర్చల సందర్భంగా సరిహద్దులను నిర్దేశించారు. ప్రపంచంలోనే ఎక్కడాలేనివిధంగా అమెరికా–కెనడామధ్య అతి సుదీర్ఘమైన సరిహద్దు ప్రాంతం ఉంది. కెనడా సరిహద్దుల ఆక్రమణకు ఆర్థికాస్త్రాన్ని ప్రయోగిస్తానని కూడా పాత్రికేయుతో ట్రంప్ అన్నారు. కెనడా రక్షణకోసం బిలియన్ డాలర్లు అమెరికా ఖర్చుచేస్తోందనీ, అందువల్ల అమెరికాలో ఒక రాష్ట్రంగా కెనడా ఉండిపోవాలన్నారు. గల్ఫ్ ఆఫ్ మెక్సికోకు ఇకమీద 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా నామకరణం చేస్తామని కూడా ప్రకటించారు. సైన్యాన్ని ఉపయోగించి బలప్రయోగం ద్వారా గ్రీన్‌లాండ్, పనామాల స్వాధీనాన్ని ఆయన తోసిపుచ్చలేదు. పనామా కాలువద్వారా ప్రయాణించేటప్పుడు విధించే టోల్ వసూళ్ళు అమెరికాకు పెను భారంగా మారిపోయాయని, ఇది పెద్ద సమస్యగా ఉందని, అందువల్ల పనామాను తమ అధీనంలోకి తీసుకోవాల్సిందేననీ ట్రంప్ ఎప్పటినుండో వాదిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఆయన ఈ విషయంలో మరింత దూకుడుగా ప్రకటనలు గుప్పిస్తున్నారు. అదేవిధంగా నాటో దేశాలు తమ జిడిపిలో ఐదూశాతాన్ని నాటోకు కేటాయించాలని కూడా అన్నారు.

**గ్రీన్‌లాండ్ అమ్మకానికి సిద్ధంగా లేదు**

గ్రీన్‌లాండ్ దేశమేమీ అమ్మకానికి సిద్ధంగా లేదని డెన్మార్క్ ప్రధానమంత్రి మెట్టే ఫ్రెడరిక్‌సెన్ వ్యాఖ్యానించారు. ట్రంప్ పత్రికాగోష్ఠి అనంతరం డేనిష్ టీవీకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, గ్రీన్‌లాండ్ ఒక స్వతంత్ర దేశమనీ, ఆ దేశ భవిష్యత్తును ఆ దేశవాసులే నిర్ణయించుకుంటారనీ అన్నారు. ఐతే నాటో కూటమితో, అమెరికాతో తాము సన్నిహిత సంబంధాలు కోరుకుంటున్నామని కూడా ఆమె ఈ సందర్భంగా అన్నారు. ఆర్కిటిక్–అట్లాంటిక్ మహాసముద్రాలమధ్యన ఉన్న ప్రపంచంలోన అతిపెద్ద దీవి గ్రీన్‌లాండ్ 1979లో డెన్మార్క్ నుండి స్వాతంత్ర్యం పొందింది. ఆర్కిటిక్ రీజియన్‌లో భాగంగా ఉన్న గ్రీన్‌లాండ్‌లో కేవలం 57,000 మంది మాత్రమే జనాభా ఉన్నారు. ఇక సెంట్రల్ అమెరికా దక్షిణాగ్రాన ఉన్న రిపబ్లిక్ ఆఫ్ పనామాకు ప్రధానంగా పనామా కాలువద్వారా ఆదాయం లభిస్తుంది. పనామాను స్వాధీనం చేసుకుంటామన్న ట్రంప్ ప్రకటనను ఆ దేశాధ్యక్షుడు తీవ్రంగా వ్యతిరేకించారు. ట్రంప్ హెచ్చరికలకు భయపడేది లేదని కెనడా ప్రధానమంత్రి (తాత్కాలిక) జస్టిన్ ట్రూడో కూడా అన్నారు. అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా చేసే అవకాశాలు లేవని అన్నారు.రెండు దేశాలమధ్య భారీస్థాయిలో వాణిజ్యం జరుగుతోందనీ, ఒక భద్రతాభాగస్వామిగా కూడా కెనడా ఉందని, ఈ రెండు దేశాలు లబ్ధిపొందుతూనే ఉన్నాయన్నారు. గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ ప్రకటనలో ఐరోపా దేశాలు కూడా స్పందించాయి. ఐరోపాదేశాల సార్వభౌమాధికారం జోలికొస్తే సహించబోమని ఫ్రాన్స్ విదేశాంగమంత్రి జియోన్ నోయల్ బార్రోట్ హెచ్చరించారు.

# భూకంప శిథిలాల్లోంచి సురక్షితంగా బయటపడిన 400 మంది





## న్యూస్ కవరేజ్‌పై కఠిన ఆంక్షలు



**గ్జిజాంగ్ :** చైనాలోని టిబెట్ (గ్జిజాంగ్) ప్రాంతంలో భూకంప శిథిలాల నుండి ఇప్పటివరకూ 400 మందిని సహాయ బృందాలు రక్షించాయి. వారంతా సురక్షితంగా బయటపడ్డారు. బుధవారంనాడు కూడా ఇంకా శిథిలాలలో సజీవంగా ఉన్నవారి కోసం సహాయబృందాలు అన్వేషణ చేస్తున్నాయి. 14,000 మంది సహాయ కార్యకర్తలు శిథిలాలలో చురుగ్గా అన్వేషణలు కొనసాగిస్తున్నారు. వారి కృషి ఫలితంగా అనేకమంది ప్రాణాలు పోగొట్టుకోకుండా సజీవంగా బయటకు వస్తున్నారు. ఎవరెస్టు శిఖర ఆరంభప్రాంతానికి 50 మైళ్ళ దూరంలో ఈ భూకంపం సంభవించింది. దీనివల్ల వందల ఇళ్ళు నేలమట్టం అయ్యాయి. హిమాలయ ప్రాంతంలో చైనీయులు గ్జిజాంగ్ అని పిలిచే టిబెట్ భూభాగంలో ఉన్న గ్జిజాంగ్ నగర డింగ్రీ కౌంటీని రిచ్‌టర్ స్కేలుపై 7.1 తీవ్రతతో ఈ భారీ భూకంపం కుదిపేసింది. ఈ భూకంపంలో 126 మంది మరణించగా మరో 200 మంది గాయపడ్డారు. చైనా గ్జిజాంగ్ మిలిటరీ కమాండ్ గ్జిగేజ్ మిలిటరీ సబ్ కమాండ్ సమాచారం ప్రకారం, డింగ్రీ కౌంటీలోకి పెద్ద సంఖ్యలో సహాయ బృందాలు రంగప్రవేశం చేసి ప్రజలకు సహాయం చేస్తున్నాయి. బాధితులకోసం భారీ ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికపై చేశారు. చైనా ఉపప్రధానమంత్రి ఝూంగ్ గుయా క్వింగ్ ఘటనాస్థలానికి వెళ్ళి స్వయంగా సహాయ కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఈ ప్రాంతానికి పాత్రికేయులను అనుమతించడంలేదు. పాత్రికేయుల ప్రవేశంపై చైనా ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది.

ప్రపంచం

# సూడాన్ ఆర్ఎస్ఎఫ్‌పై అమెరికా ఆంక్షలు



**వాషింగ్టన్ :** అంతర్యుద్ధంలో నలిగిపోతున్న ఆఫ్రికాదేశం సూడాన్‌లో సామూహిక హత్యాకాండకు పాల్పడుతున్న ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్)పై అమెరికా ఆంక్షలు విధించింది. అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఈ ప్రకటన చేశారు. సూడాన్ ప్రజలపై ఆర్ఎస్ఎఫ్ ప్రత్యక్ష దాడులకు పాల్పడుతోందని ఆయన విమర్శించారు. ఆర్ఎస్ఎఫ్ సైనికులు ఆ దేశంలో మహిళలు, బాలికలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు. దీనికి బాధ్యులైనవారిపై అమెరికా తగిన చర్యలు తీసుకుంటుందని కూడా ఆయన అన్నారు. గడచిన 18 నెలలుగా సూడాన్‌లో రెండు ప్రత్యర్థి సైనిక గ్రూపులమధ్య అధికారంకోసం అంతర్యుద్ధం జరుగుతోంది. ఈ అంతర్యుద్ధంవల్ల దేశం కరువుకాటకాల బారిన పడింది. కోటీ పది లక్షలమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. సూడాన్‌పై ఇటీవల ఐక్యరాజ్యసమితి కూడా ఒక నివేదిక విడుదల చేసింది. సూడాన్‌దేశం కరువుబారిన పడిందని, మూడుకోట్లమంది ప్రజలకు తక్షణ ఆహార సహాయం కావాలని ఆ నివేదికలో ఐక్యరాజ్యసమితి ప్రకటించింది.

# 20లోపు బందీలను అప్పగించకపోతే అతలాకుతలమే

## ట్రంప్ హెచ్చరిక




**వాషింగ్టన్ :** తాను ప్రమాణస్వీకారం చేసే జనవరి 20 నాటికి ఇజ్రాయెల్ బందీలను స్వాధీనం చేయకపోతే మధ్యప్రాచ్యంలో అతలాకుతల పరిస్థితులు తలెత్తుతాయని డోనాల్డ్ ట్రంప్ హమాస్‌కు హెచ్చరిక చేశారు. ఐతే ఎలాంటి అంతలాకుతల, విధ్వంసకర పరిస్థితులు తలెత్తుతాయనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. ఇంతకుముందు కూడా ట్రంప్ హమాస్‌కు ఇదేవిధమైన హెచ్చరిక చేశారు. ఆ హెచ్చరికకు కట్టుబడి ఉన్నట్లు బుధవారంనాడు తాజా ప్రకటన ద్వారా ఆయన మరోసారి స్పష్టం చేశారు. ఇప్పటికే హమాస్ ప్రతినిధులు, ఇజ్రాయెల్ తో మధ్యవర్తుల ద్వారా చర్చలు జరుపుతున్నారు. 34 మంది బందీలను విడుదల చేసేందుకు హమాస్ సిద్ధంగా ఉందన్న వార్తలు వెలువడ్డాయి. అందుకు సంబంధించిన ఒక జాబితాను కూడా ప్రకటించింది. అమెరికన్లతో సహా 100 మంది గాజాలో హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు.

## లాయర్ ఉండొచ్చు (మొదటి పేజీ తరువాయి)

రజనీకాంత్‌రెడ్డి చెప్పారు. లాయర్‌ను కేటీఆర్ వెంట అనుమతిస్తే అభ్యంతరం ఏముంటుందని, దర్యాప్తు జరిగే గదిలోకి లాయర్ వెళ్లడానికి వీల్లేనప్పుడు, దర్యాప్తు జరిగే సన్నివేశాన్ని చూసేందుకు మాత్రమే అనుమతి ఇస్తున్నప్పుడు అభ్యంతరం ఎందుకని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఏసీబీ ఆఫీసులో దర్యాప్తు జరిగే రూమ్ పక్కనే మరో గది ఉందని రెడ్డి చెప్పారు. దర్యాప్తు జరిగే గది పక్కన ఉండే మరో గదిలోకి న్యాయవాదిని అనుమతించాలని న్యాయమూర్తి ఆదేశించారు. విచారణ ముగిసే దశలో కేటీఆర్ లాయర్ కల్పించుకుని, కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు దర్యాప్తు చేసేప్పుడు ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలని, ఈ మేరకు ఏసీబీకి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఆడియో, వీడియో రికార్డింగ్ కావాలో లేక న్యాయవాది వెంట ఉండేలా కావాలో ఏదో ఒకటే చెప్పాలని న్యాయమూర్తి అన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డిని వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ విచారణ చేసేప్పుడు ఆడియో, వీడియో చిత్రీకరణకు ఇదే హైకోర్టు పర్మిషన్ ఇచ్చిందని న్యాయవాది చెప్పారు. అవినాష్‌రెడ్డి స్టేట్‌మెంట్‌లో సీబీఐ అధికారి మార్పులు చేర్పులు చేస్తున్నారనే అభియోగాల కారణంగా ఆ తరహా ఉత్తర్వులు ఇచ్చామని న్యాయమూర్తి చెప్పారు. ఈ నెల 9న గురువారం జరిగే విచారణకు కెటిఆర్ హాజరయ్యాక ఏమైనా అనుమానాలు ఉంటే అప్పుడు కోర్టుకు రావచ్చునని చెప్పారు. విచారణను ఈ నెల 20కి వాయిదా వేశారు.

## తోపులాట (మొదటి పేజీ తరువాయి)

టోకెన్ల జారీ కేంద్రంలో సిబ్బంది ఒకరు అస్వస్థతగురి కావడంతో అతన్ని ఆసుపత్రికి తరలించేందుకు క్యూలైన్ తెరిచారు. టోకెన్ల జారీ చేసేందుకు క్యూలైన్ ఓపెన్ చేశారని భావించిన భక్తులు ఒక్కసారిగా దూసుకొచ్చారు. ఈక్రమంలోనే తొక్కిసలాట జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. క్యూలైన్ల వద్ద సరైన భద్రత ఏర్పాటు చేయలేదని మరి కొందరు ఆరోపిస్తున్నారు. టోకెన్ల కోసం ఎంత మంది భక్తులు వచ్చారు, ప్రత్యామ్నాయ ఏర్పాపై స్థానిక సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించలేదని తెలుస్తోంది. ఈ నెల 10, 11, 12 తేదీల్లో వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి మొదటి మూడు రోజులకు 1.20 లక్షల టోకెన్లను గురువారం ఉదయం జారీ చేయాల్సి ఉంది. మిగిలిన రోజులకు సంబంధించి ఆయా తేదీల్లో తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్‌లలో ఇవ్వనున్నట్టు టిటిడి తెలిపింది. అయితే, భక్తుల రద్దీ కారణంగా బుధవారం రాత్రి నుంచే టోకెన్లు జారీ చేస్తున్నట్టు ఇఒ శ్యామలరావు తెలిపారు.

**ఎపి సిఎం చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి:** వైకుంఠ ద్వార సర్వదర్శనం టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన తనను ఎంతో కలచివేసిందన్నారు. అస్వస్థతకు గురైన బాధితులకు అందుతున్న వైద్య చికిత్సపై అధికారులతో సిఎం మాట్లాడారు. జిల్లా కలెక్టర్, టిటిడి అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు పర్యవేక్షించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. మరోవైపు గురువారం ఉదయం సిఎం చంద్రబాబు తిరుపతి వెళ్లనున్నారు. ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించనున్నారు. తిరుపతిలో జరిగిన తోపులాట ఘటనలపై చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ ఘటన జరిగిందన్నారు. తోపులాట ఘటనల్లో ఆరుగురు చనిపోయినట్లు తెలిపారు. ఇలాంటివి మరోసారి జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. డిజిపి, టిటిడి ఇఒ, కలెక్టర్, ఎస్‌పితో సిఎం మాట్లాడారు. భక్తులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర బాధాకరమన్నారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో విఫలమైన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల రద్దీ మేరకు ఎందుకు ఏర్పాట్లు చేయలేదని అధికారులను ప్రశ్నించారు. ఇలాంటి చోట్ల విధుల్లో అత్యంత అప్రమత్తంగా, బాధ్యతగా ఉండాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. తిరుపతిలో జరిగిన ఈ ఘటన తనకు తీవ్ర బాధ కలిగించిందని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం క్షతగాత్రులకు అందుతున్న వైద్యంపై తిరుపతి జిల్లా అధికారులు వివరించారు. మృతుల సంఖ్య పెరగకుండా బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. టిటిడి టోకెన్లు ఇచ్చే కౌంటర్ల నిర్వహణ, భద్రతను పునఃసమీక్షించాలని సిఎం చంద్రబాబు సూచించారు.

## రూ.2.8 లక్షల కోట్లు (మొదటి పేజీ తరువాయి)

మైదానంలో జరిగిన బహిరంగ సభలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర వికాసానికి తోడ్పడతాయని వెల్లడించారు. దీంతోపాటు ఐటీ, టెక్నాలజీకి ఏపీ ప్రధాన కేంద్రం కానుందని ప్రధాని మోదీ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు ఏపీ అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు చేరుస్తాయని ప్రధాని మోదీ అన్నారు. 2030లోగా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయడమే మా లక్ష్యమని ప్రధాని తెలిపారు. నవయుగ పట్టణీకరణకు ఏపీ సాక్ష్యంగా మారబోతోందని ఈ సందర్భంగా మోదీ చెప్పారు. విశాఖ ప్రత్యేక రైల్వే జోన్ డిమాండ్ చాలా కాలంగా ఉందని, చిరకాల కోరిక ఈరోజు నెరవేరిందన్నారు. రైల్వే జోన్ రాకతో వ్యవసాయంతోపాటు అనేక వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. ఏపీ అభివృద్ధి మా విజన్ అని మరోసారి గుర్తు చేశారు ప్రధాని మోదీ. దేశంలో రెండు గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు వస్తుంటే , అందులో ఒకటి విశాఖకు కేటాయించాం. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా ఎంతోమందికి ఉపాధి లభిస్తుంది. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన చేశాం. 3 రాష్ట్రాల్లోనే ఇలాంటి బల్క్ డ్రగ్ పార్కులు వస్తున్నాయి. చెన్నైబెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో క్రిస్ సిటీ భాగం అవుతుంది. ఇప్పటికే శ్రీసిటీ ద్వారా ఏపీలో తయారీరంగం ఊపందుకుంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు పునాదిరాయి వేశాం. రాష్ట్ర అభివృద్ధిలో రైల్వే జోన్ కీలకం కానుంది. రైల్వే జోన్ ద్వారా రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుంది. రైల్వే జోన్ వల్ల వ్యవసాయ, పర్యాటక రంగాలు ఊపందుకుంటాయి.' అని ప్రధాని మోదీ అన్నారు. ఏపీలో మౌలిక సదుపాయాల కల్పన విప్లవం రానుంది అన్నారు. మత్స్యకారులకు తోడ్పాటు అందిస్తున్నామని వారికి కిసాన్ క్రెడిట్ కార్డులు కూడా అందించామని మోదీ తెలియజేశారు. అంతకు ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ప్రపంచం మెచ్చే ఏకైక నాయకుడు ప్రధాని మోదీ అని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ తో కలిసి సీఎం చంద్రబాబు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఏపీలో ఎన్డీఏ కూటమి 93 శాతం స్ట్రైక్ రేట్ తో ఘన విజయం సాధించిందన్నారు. భవిష్యత్తులోనూ ఈ కాంబినేషన్ కొనసాగుతుందన్నారు, దేశ రాజకీయాల్లో మోదీ ప్రధానిగా ఉంటారన్నారు. దిల్లీ ఎన్నికల్లోనూ ఎన్డీఏ గెలుస్తుందని, రాసి పెట్టుకోండి అంటూ చంద్రబాబు జోష్యం చెప్పారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మోదీ కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలు, సుపరిపాలన, దేశాన్ని బలమైన ఆర్థిక శక్తిగా మార్చేందుకు మేకిన్ ఇండియా తెచ్చారన్నారు. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, గతిశక్తి తెచ్చారని, దేశానికి ఆర్థిక రాజధానిగా ముంబయి ఎలా ఉందో ,ఏపీకి విశాఖ అలాంటి ఆర్థిక నగరం అని చంద్రబాబు వివరించారు. ఈ సభలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ, మంత్రులు నారా లోకేశ్, అనిత, టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, సత్య కుమార్ యాదవ్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీలు పురందరేశ్వరి, సీఎం రమేష్, శ్రీ భరత్ , ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విలువల అవహేళన (మొదటి పేజీ తరువాయి)

ముడిపెట్టడం ద్వారా 'ఒకేదేశం–ఒకే ఎన్నికలు' ప్రతిపాదన రాజ్యాంగ విలువలను అవహేళన చేస్తోందని విమర్శించారు. బిజెపి ఎంపీలు ఈ వాదనకు అడ్డంపడి ఈ రెండు బిల్లులపై ప్రశంసలు కురిపించారు. కాంగ్రెస్, డిఎంకె, తృణమూల్ కాంగ్రెస్‌పార్టీలకు చెందిన ఎంపీలు ప్రభుత్వ తరపు ఎంపీల వాదనలను తీవ్రంగా ప్రతిఘటించారు. ఈ బిల్లులు సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమైనవని పునరుద్ఘాటించారు. ఈ రెండు బిల్లులనూ క్షుణ్ణంగా పరిశీలించడానికి, వివిధ కోణాలలో అభిప్రాయాలను నమోదు చేయడానికి కనీసం ఏడాది గడువు ఉండాలని కొన్ని ప్రతిపక్షాలకు చెందిన ఎంపీలు జెపిసి ఛైర్మన్, కేంద్ర మాజీ మంత్రి పి.పి చౌధురిని డిమాండ్ చేశారు. మొదట్లో జమిలి ఎన్నికల బిల్లులను రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఎదుట సమర్థించిన వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీకి చెందిన ఎంపి వి.విజయసాయి రెడ్డి కూడా ఈ సమావేశంలో అనేక ప్రశ్నలు అడిగారు. పోలింగ్ కేంద్రాలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల స్థానంలో బ్యాలట్ పత్రాలను పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. జమిలి ఎన్నికలు ప్రాంతీయపార్టీల ప్రాధాన్యతను తగ్గించేస్తాయని, వాటిని పక్కకు నెట్టేస్తాయని, ప్రాంతీయ పార్టీలు నామ మాత్రంగా మిగిలిపోతాయని తీవ్ర ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల పార్లమెంటులో బహుళ పార్టీల ప్రాతినిధ్యానికి గండిపడుతుందని, స్థానిక సమస్యలు చర్చకు రాకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు ఓటర్లతో అనుబంధం కొనసాగించే ఆవశ్యకతను ఈ జమిలి ఎన్నికల విధానం పలుచన చేస్తుందని, రెండు లేదా మూడు జాతీయపార్టీలు మాత్రమే చట్టసభల్లో ప్రాతినిధ్యం వహిస్తే చట్టసభ సభ్యులకు, ఓటర్లకు మధ్య ఈ అనుబంధం తెగిపోతుందని ఆయన అన్నారు. ప్రతిపక్షాలకు చెందిన ఎంపీలు ఈ మొదటి సమావేశంలో రాజ్యాంగ సవరణ బిల్లు (129వ సవరణ), కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు రెండింటినీ తీవ్రంగా విమర్శించారు. బిల్లులో ఉన్న పలు లోపాలను వారు ఎత్తిచూపారు. ఈ జమిలి ఎన్నికల బిల్లును పరిశీలన నిమిత్తం పార్లమెంటరీ కమిటీకి అప్పగించాలని ఇటీవల శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టిన సందర్భంగా నిర్ణయించారు. ఆ మేరకు ఈ బిల్లులు పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు వచ్చాయి. ఈ పార్లమెంటరీ కమిటీలో ప్రస్తుతం లోక్‌సభ నుండి 27 మంది, రాజ్యసభ నుండి 12 మంది ఎంపీలు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీలో సభ్యులుగా ఉన్న ఎంపీలందరికీ 18,000 పేజీలతో కూడిన నివేదికల ప్రతులను అందజేశారు. వీటిల్లో ఒకటి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదిక తాలూకూ హిందీ,ఇంగ్లీషు ప్రతులు కాగా, మరో 21 అనుబంధ పత్రాలు ఉన్నాయి. వీటితోపాటు సాఫ్ట్ కాపీలను కూడా ఎంపీలకు సమకూర్చారు. ఈ సమావేశంలో కేంద్ర న్యాయ,శాసన మంత్రిత్వశాఖ ముందుగా ఈ రెండు బిల్లులకు సంబంధించిన ప్రధానాంశంఆలను, వాటి వెనుక ప్రభుత్వ ఉద్దేశాలను వివరించింది. దీనిపై ప్రతిపక్ష ఎంపీలు అనేక ప్రశ్నలు వేశారు. ఈ బిల్లులు రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంవల్ల ప్రభుత్వ ఖర్చు గణనీయంగా తగ్గుతుందని చేస్తున్న మంత్రిత్వశాఖల వాదనలపై జెపిసి సభ్యులుగా ఉన్న కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా సహా ఆ పార్టీ ఎంపీలు పలు ప్రశ్నలు అడిగారు. మొదటిసారి 543 నియోజకవర్గాలలో ఇవిఎంలు ఉపయోగించడం ప్రారంభించాక 2004లో లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎన్నికల ఖర్చుపై ఏమైనా అంచనాలు వేశారా? అని ప్రశ్నించారు. ఆ మేరకు ఏమైనా ఖర్చులు తగ్గాయా? పెరిగాయా? అని కాంగ్రెస్ ఎంపీలు ప్రశ్నించారు. ఎన్నికలవ్యయాన్ని పొదుపు చేయడంకంటే ప్రధానంగా ప్రజల ప్రజాస్వామ్య హక్కులను సమున్నతస్థానంలో నిలబెట్టడమే అతి ముఖ్యమైన విషయమని టిఎంసి ఎంపి ఒకరు అన్నారు.

## బీర్ల సరఫరా (మొదటి పేజీ తరువాయి)

సవరించకపోవడం, సుమారు రూ.650 కోట్ల బిసిఎల్ బకాయిలు చెల్లించకపోవడంతో తమకు భారీ నష్టాలు వస్తున్నాయని, గత్యంతరం లేక బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్టు యునైటెడ్ బ్రివరీస్ లిమిటెడ్ తెలంగాణ ఎక్సైజ్ శాఖకు ఇచ్చిన నోటీసులో పేర్కొంది. ఈ నిర్ణయంతో ఇక తెలంగాణలో కింగ్ ఫిషర్ బీర్లు లేనట్టేనా అని మద్యం ప్రియులు వాపోతున్నారు. ఏది ఏమైనా రానున్న సంక్రాంతి పండగ నేపథ్యంలో మందుబాబులకు భారీ షాక్ తగిలిందనే చెప్పాలి. తెలంగాణలో బీర్ల అమ్మకాల్లో 75 శాతం యుబిఎల్ కంపెనీకి చెందిన బీర్లు కావడంతో మద్యం ప్రియులు ఇబ్బంది పడక తప్పదు. అయితే ప్రతి రెండు సంవత్సరాలకు ధరలను నిర్ణయించేందుకు బీర్ తయారీ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోవాల్సి ఉంది. అయితే వైన్ తయారీ కంపెనీలకు మాత్రం ధరలను నిబంధనల ప్రకారం పెంచారు. అయితే బీర్ తయారీ కంపెనీలతో మాత్రం ప్రభుత్వం ఇంత వరకు చర్చలు జరపలేదు.

**రేట్లు పెంచనందుకే: ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు**

యుబిఎల్ తీసుకున్న నిర్ణయంపై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. బుధవారం రాత్రి సచివాలయం మీడియా పాయింట్ వద్ద తెలంగాణ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ చెవ్వూరు హరి కిరణ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. బీర్ తయారీ కంపెనీలు 33 శాతం పెంచమని అడుగుతున్నారని, ఇలా పెంచితే ఇప్పుడు 150 రూపాయ లు ఉన్న బీర్ 250 రూపాయలకు పెరుగుతుందన్నా రు. బేవరేజ్ సంస్థ అడిగినట్లు రేట్లు పెంచితే ప్రజల పై భా రం పడుతుందన్నారు. రెట్లు పెంచే సిస్టం కోసం రిటైర్డ్ జడ్జి తో ఇప్పటికే కమిటి వేశామని గుర్తు చేశారు. కమిటీ నివేదిక వచ్చాక రెట్ల పెంపు పై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. బేవరేజ్ సంస్థ గుత్తాధిపత్యం గా ప్రవర్తిస్తుంది... ఆ సంస్థ డిమాండ్ ను ఇప్పుడు తిరస్కరించింది. బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని, నష్టాల్లో సంస్థ ఉందని ఆ సంస్థ చెప్తుందన్నారు. గత ప్రభుత్వం పెట్టిన బాకీలు కొన్ని ఉన్నాయి. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత రూ.11 వందల కోట్లు చెల్లించిందని ఇప్పుడు 650 కోట్లు పెండింగ్ ఉందన్నారు. ఎక్సైజ్ డిపార్ట్మెంట్ లో 2500 కోట్లు గత ప్రభుత్వం బకాయిలు పెట్టిందని తెలిపారు.14లక్షల కేసులు ప్రస్తుతం స్టాక్ ఉంది..ఇతర రాష్ట్రాలతో పోల్చితే కొంత తక్కుగానే ఉందన్నారు.కర్ణాటక 190, ఎపిలో 180 రూపాయలు బీరు రేటు ఉంటే.. తెలంగాణలో 150 లో బీరు రేటు ఉంది. ఒత్తిళ్లకు మా ప్రభుత్వం లొంగ దు...మేము వచ్చాక ఒక్క పైసా కూడా టాక్స్ పెంచలేదు.

## ఎన్నికలు (మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని, ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజల నుంచి మంచి స్పందన ఉందన్నారు. ప్రియాంక గాంధీపై బిజెపి నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ నిరసనలు వ్యక్తం చేశారన్నారు. అంబేద్కర్ విషయంలో అమిత్ షా చేసిన అవమానకర మాటలు దేశ వ్యాప్తంగా నిరసన వ్యక్తమైందని, తెలంగాణ లో అన్ని ప్రాంతాలలో ఉద్యమాలు చేశారన్నారు.

## ప్రాథమిక కీ విడుదల (మొదటి పేజీ తరువాయి)

అంశాలకు సంబంధించిన ఆధారాల కాపీలను ఆన్‌లైన్ లోనే పంపాలని టిజిపిఎస్‌సి సూచించింది. ఈమెయిల్, వ్యక్తిగతంగా వెళ్లి సమర్పించడాన్ని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని కమిషన్ స్పష్టంచేసింది. కాగా రాష్ట్ర వ్యాప్తంగా 1401 కేంద్రాలలో గత ఏడాది నవంబర్ 17,18న గ్రూప్ 3 పరీక్షలను నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5.36 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, 2,69,483 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు.

## విచారణ (మొదటి పేజీ తరువాయి)

పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎసిబి జాయింట్ డైరెక్టర్ (ఎస్‌పి) మహిళా ఐపిఎస్ అధికారి రితిరాజ్, డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌విఎన్ శివరామ్ (ఎఎస్‌పి)లు కెటిఆర్‌ను విచారించనున్నారు. ఈ మేరకు వారు ఏఏ విషయాలపై అడగాలనే విషయంపై ప్రశ్నలను సిద్దం చేసుకున్నారు.ఫార్ములా ఇకార్ రేస్ (10వ) కోసం నిబంధనలకు విరుద్దంగా హెచ్‌ఎండి రూ.55 కోట్ల నిధులను దారి మళ్లించిందని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర గవర్నర్ అనుమతితో ఎసిబి గత నెల 19న ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసింది. కేసులో ఎ1గా కెటిఆర్, ఎ2గా అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్, ఎ3గా హెచ్‌ఎండిఎ చీఫ్ ఇంజనీర్ (రిటైర్డ్) బిఎల్‌ఎన్ రెడ్డిల పేర్లను చేర్చింది. అయితే ఈ కార్ రేస్‌పై నిర్వాహకులతో ప్రభుత్వం అసలు ఒప్పదమే చేసుకోలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై కూడా కెటిఆర్ నుంచి స్పష్టమైన సమాదానం రాబట్టే అవకాశాలు ఉన్నాయి. ఒప్పందమే జరగని పక్షంలో నిధులు ఎందుకు బదిలీ చేశారనే అంశం ఇక్కడ కీలకంగా మారింది.

**కెటిఆర్ చెబితేనే నిధులు విడుదల చేశాం:ఎసిబి, ఇడిలకు నిందితుల వాంగ్మూలం..?**

ఫార్ములా ఇకార్ రేస్ కేసులో అటు ఎసిబి, ఇటు ఇడి అధికారులు నిందితులను బుధవారం విచారించారు. ఈ కేసులో ఎ2,ఎ3 నిందితులుగా ఉన్న ఐఎఎస్ అధికారి, బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన అరవింద్‌కుమార్, హెచ్‌ఎండిఎ మాజీ చీఫ్ ఇంజీర్ బిఎల్‌ఎన్ రెడ్డిలను విచారించారు. వీరిద్దరిని గురువారం కూడా విచారించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన విచారణ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు వీరిద్దరు జవాబులు దాటవేశారు. ఫార్ములా ఇకార్ రేసులో అసలు జరిగిన కుంభకోణంపై అధికారులు ఆరా తీశారు. ఎవరు ఆదేశిస్తే హెచ్‌ఎండిఎ నుంచి నిధులు విడుదల చేశారనే అంశంపై కూలంకుశంగా ఎసిబి, ఇడి అధికారులు వేరు వేరుగా విచారించారు. వీరి విచారణలో నిందితులు ఇద్దరు కూడా తాము కెటిఆర్ చెబితేనే నిధులు విడుదల చేశామని అధికారులకు వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. అలాగే ఫార్ములా నిర్వాహకులైన గ్రీన్‌కో కంపెనీని యాజమాన్యాన్ని కెటిఆర్‌కు ఎవరు కలిపించారు, అందులో ఎవరెవరి పాత్ర ఉంది, రూ.45.71 కోట్లు ఈ విదేశీ సంస్థకు బదిలీ చేయడంలో ప్రత్యుత్తరాలు ఏమైనా ఉన్నాయనే విషయాలపై అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. అయితే వీరిద్దరి వాంగ్మూలాలను ఎసిబి, ఇడి అధికారులు రికార్డు చేసింది.

# 1000 మెగావాట్ల ఉత్పత్తి

## స్వయం సహాయక సంఘాల ద్వారా..

''త్వరలో టెండర్లు ఖరారు చేస్తాం''

4వేల ఎకరాలను సేకరించాలి

జిల్లా కలెక్టర్లను ఆదేశించిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్ : మహిళా సంఘాల భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు విద్యుత్ శాఖ రెడ్‌కో ద్వారా టెండర్లను ఆహ్వానించిందని, త్వరలోనే టెండర్లను ఖరారు చేస్తారని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మహిళా సంఘాలను గుర్తించి,లబ్ధిదారులను నిర్ధారించాలని, భూ సేకరణ, బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం వంటి పనులను గ్రామీణ అభివృద్ధి శాఖ, జిల్లా కలెక్టర్లు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేసి 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటికే ఇంధన శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖల ఒప్పందం కుదిరిన నేపథ్యంలో జిల్లాలవారీగా ప్రగతిని హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, కొండ సురేఖలతో కలిసి భట్టి విక్రమార్క బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడతాయన్నారు. కొత్త విద్యుత్ పాలసీ, ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గత సంవత్సరం నవంబర్ 19న కుదిరిన ఒప్పందాన్ని జిల్లా కలెక్టర్లు ఉపయోగించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఐదు సంవత్సరాల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిద్దాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ క్రమంలో మహిళలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు అందుబాటులోకి తెస్తున్నామని, పెద్ద మొత్తంలో డబ్బులు మహిళా సంఘాల చేతుల్లోకి వస్తున్న క్రమంలో వారు వివిధ వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసి,అందుకు అవసరమైన వసతులను కల్పించాలని భట్టి విక్రమార్క చెప్పారు. మహిళా సంఘాలు సోలార్ పవర్ ప్లాంట్‌ల ఏర్పాటుకు వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. మహిళా సంఘాలు ప్లాంట్ల ఏర్పాట్లులో ఆర్థిక సహాయం కోసం బ్యాంకు అధికారులతో సమన్వయం చేయాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో స్మాల్, మైక్రో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నాలుగు నుంచి ఐదు ఎకరాలు భూమి అవసరమని, చిన్నపాటి ఇండస్ట్రియల్ ఏరియాల ఏర్పాటుకు అధికారులు భూములు సేకరించాలని ఆదేశించారు. అటవీ హక్కుల ద్వారా లభించిన భూముల్లో అవకాడో వంటి పంటలు సాగు చేస్తే అటవీ సంపద పెరగడంతో పాటు గిరిజనులు ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు. రాష్ట్రంలో గిరిజనులకు ఇప్పటి వరకు 6.67లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేస్తే, ఆ భూముల్లో లాభసాటి పంటల సాగు జరగడంలేదని డిప్యూటీ సిఎం భట్టి తెలిపారు. ఇకనుంచి ఆ భూముల్లో ఉపాధి హామీ, గిరిజన శాఖ, స్వయం సహాయక సంఘాల ద్వారా వచ్చే పథకాలు అన్నింటినీ సమన్వయం చేసుకుని ఆర్థికంగా ప్రయోజనం కలిగించేలా పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో భారీ భవంతులపైన సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని డిప్యూటీ సిఎం అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో గుట్టలతో విస్తరించిన భూములు అత్యధికంగా ఉన్నాయని, వీటిపైన సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసే ఆలోచన చేయాలని ఇంధన శాఖ అధికారులను భట్టి ఆదేశించారు. ప్రధానమంత్రి పిఎం కుసుం పథకంలో భాగంగా రైతులు రెండు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఏర్పడిందని, ఆ దిశగా రైతులను చైతన్యం చేయాలని జిల్లా కలెక్టర్లను సూచించారు. టిజిరెడ్‌కో పోర్టల్ ద్వారా రైతులు సోలార్ పవర్ ఉత్పత్తికి దరఖాస్తులు చేసుకోవాలని, తద్వారా తక్కువ ధరకు విద్యుత్‌ను అందుబాటులోకి రావడంత పాటు కాలుష్య రహిత విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఏర్పడుతుందని వివరించారు.

**ప్రతి జిల్లాల్లో 150 ఎకరాలు తగ్గకుండా మొత్తం నాలుగు వేల ఎకరాలు సేకరించాలి**

ఒక మెగావాట్ ఉత్పత్తికి నాలుగు ఎకరాల స్థలం అవసరమని, ప్రతి జిల్లాలో 150 ఎకరాలకు తగ్గకుండా రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగువేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని కలెక్టర్లకు భట్టి విక్రమార్క తెలిపారు. దేవాదాయ, ఇరిగేషన్ శాఖల పరిధిలోని భూములను గుర్తించాలని.. కేంద్ర అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు భూమి అభివృద్ధి చేసుకునే అవకాశం ఏర్పడిందన్నారు. అటవీ ప్రాంతాల్లో భూములపై హక్కులు ఏర్పడినప్పటికీ స్తంభాలు వేసి విద్యుత్ లైన్‌ల ద్వారా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసే క్రమంలో అటవీ శాఖ అధికారులతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో ఆయా భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తే ఎవరికి ఇబ్బంది ఉండదన్నారు. సోలార్ విద్యుత్ అందుబాటులోకి వస్తే అటవీ ప్రాంతాల్లోని రైతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పెద్ద ఎత్తున పంటలు సాగు చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. గిరిజనులకు ఆదాయం తక్కువగా ఉంటుందని, భూమి లభ్యత ఎక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో అచ్చంపేట నుంచి ఆదిలాబాద్ వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో భూములపై అధికారులు దృష్టిపెడితే, గిరిజనులకు ప్రయోజనం జరుగుతుందని మంత్రి సీతక్క సూచించారు. ఈసమావేశంలో ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి లోకేష్, సర్ఫ్ సిఇఒ దివ్య దేవరాజన్‌వ, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, జిల్లా కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెలాఖరుకు..

# నీటిపారుదల శాఖలో పదోన్నతులు



అదే క్రమంలో బదిలీల ప్రక్రియ మొదలు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్ : నీటిపారుదల శాఖలో జనవరి చివరి నాటికి పదోన్నతులతో పాటు బదిలీల ప్రక్రియను మొదలు పెట్టనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యదాస్‌నాథ్, ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇఎన్‌సి (జనరల్) అనిల్‌కుమార్, ఇఎన్‌సి (ఒఎం విజయభాస్కర్ రెడ్డిలతో వేసిన ఐదుగురు సభ్యుల కమిటీ సిఫార్సుల మేరకే ఈ ప్రక్రియ ఉంటుందని మంత్రి వెల్లడించారు. ఇంతకాలంగా న్యాయపరమైన అడ్డంకులు ఉన్నందునే జాప్యం జరిగిందని, వాటిని అధిగమించేందుకు ఐదుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. ఎర్రమంజిల్ కాలనీలోని జలసౌధలో బుధవారం తెలంగాణ ఎఇఇల అసోసియేషన్ రూపొందించిన 2025 డైరీని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇ ఎన్‌సిలు అనిల్‌కుమార్, హరేరామ్, డిప్యూటీ ఇఎన్‌సి కె. శ్రీనివాస్‌లతో పాటు అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, కార్యదర్శి సత్యనారాయణ, సంఘం నేతలు బండి శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దశాబ్ధ కాలంగా నీటిపారుదల రంగం గాడి తప్పిందని, గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యానికిగాను నీటిపారుదల శాఖ సంవత్సరానికి అప్పులకు, వడ్డీలకే రూ.11 వేల కోట్లు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఇప్పుడు పరిస్థితిని గాడిలో పెడుతున్నామని చెప్పారు. గడిచిన ప్రభుత్వం ఎక్కువ ఖర్చుచేసి తక్కువ ప్రయోజనం పొందిందని, ఆ ఫలితం ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా పరిణమించిందని, ఇప్పుడు తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం పొందేలా ప్రణాళికలు రూపొందించామని ఆయన తెలిపారు. మానవ వనరులు, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సంవత్సరం వ్యవధిలో 700 ఎఇఇలను నియమించడంతోపాటు 1800 మంది లష్కర్‌లను నియమించామని మంత్రి తెలిపారు. మరో 1300 ఉద్యోగాల నియామకాలకు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు అనుమతిచ్చామన్నారు. ఆధునిక దేవాలయాలుగా భాసిల్లిన నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, శ్రీశైలం వంటి ప్రాజెక్ట్‌లను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉదహరించారు. విధి నిర్వహణలో సిన్సియారిటీ, నిబద్ధత, పారదర్శకత కనిపించాలని, అటువంటప్పుడే ఉన్నత స్థానానికి ఎదుగుతారని ఆయన చెప్పారు.

## 2025ను సైబర్ విజిలెన్స్..

# 'సేఫ్టీ సంవత్సరం'గా మార్చుకుందాం

టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్



ప్రజాపక్షం/హైదరాబాద్ : రోజు రోజుకూ కుప్పలుతెప్పలుగా పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) నడుం బిగించింది. ఈ మేరకు కాలనీలు, బస్తీలలోకి వెళ్లి ప్రజలను చైతన్యపర్చడమే ఏకైక మార్గంగా ఎంచుకున్న టిజిసిఎస్‌బి 'సైబర్ జాగృతి–2025' పేరుతో కార్యాచరణ సిద్ధం చేసిందని బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 2025ను సైబర్ విజిలెన్స్, సేఫ్టీ సంవత్సరంగా మార్చుకుందాం అని శిఖాగోయల్ పిలుపునిచ్చారు. టిజిసిఎస్‌బి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సమాజంలోని అన్నివర్గాలను కవర్ చేస్తూ 394 సమావేశాలు, 23 అవగాహన ర్యాలీలను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో 35700 మంది పాల్గొన్నారని శిఖాగోయల్ తెలిపారు. సైబర్ రంగంలో అవగాహన పెంచడానికి, ప్రజా భద్రతను పెంపొందించడానికి జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) 2025 కొత్త సంవత్సరాన్ని 'సైబర్ జాగృతి దివస్'తో ప్రారంభించింది. జనవరి 2025 అంతటా, టిజిసిఎస్‌బి తెలంగాణ అంతటా సమాజంలోని అన్ని వర్గాలకు చేరుకోవడానికి రూపొందించిన అవగాహన ర్యాలీలు, సమావేశాలు, కమ్యూనిటీ ఔట్రీచ్ కార్యక్రమాల ద్వారా డిజిటల్ అరెస్టు కుంభకోణాలను పరిష్కరించడంపై దృష్టి పెడుతుంది. డిజిటల్ అరెస్ట్ స్కామ్ భయం, అనుమానాస్పద వ్యక్తుల నుండి డబ్బు వసూలు చేయడానికి అత్యవసరతను ప్రేరేపిస్తుంది. మోసగాళ్లు లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల వేషధారణలో ఉన్నారు. లక్ష్యం దర్యాప్తులో ఉందని లేదా పెండింగ్ అరెస్టు వారెంట్ ఉందని పేర్కొన్నారు. ఆర్‌టిజిఎస్ లేదా నెఫ్ట్ ద్వారా డబ్బులు చెల్లించకపోతే వెంటనే అరెస్టు చేస్తామని బాధితులను బెదిరిస్తున్నారు. స్కామర్లు ప్రామాణికంగా కనిపించడానికి నకిలీ పత్రాలు, నకిలీ వీడియో కాల్స్ లేదా స్పూఫ్ చేసిన కాలర్ ఐడిలను ఉపయోగించవచ్చు. ఫోన్ కాల్, వీడియో కాల్, స్కైప్ కాల్ లేదా ఏ ప్రభుత్వ అధికారి లేదా ఏజెన్సీకి ఏదైనా కారణంతో డబ్బు బదిలీ చేయమని డిమాండ్ చేయడం ద్వారా ఏ పోలీసు అధికారి లేదా చట్ట అమలు సంస్థ దర్యాప్తు నిర్వహించదని టిజిసిఎస్‌బి ప్రజలకు గుర్తుచేస్తుంది. చట్టబద్ధమైన అధికారులు వారెంట్లను రద్దు చేయడానికి లేదా కేసులను పరిష్కరించడానికి చెల్లింపును ఎన్నడూ డిజిటల్ అరెస్ట్ కుంభకోణాల గురించి వారికి అవగాహన కల్పించడం. ఈ సంఘటనలు సైబర్ పరిశుభ్రత, జాగ్రత్తగా ఆన్‌లైన్ ప్రవర్తన, అపరిచితులతో వ్యక్తిగత లేదా ఆర్థిక సమాచారాన్ని పంచుకోవడం వల్ల కలిగే ప్రమాదాలను నొక్కి చెబుతాయి.

**ఈ జాగ్రత్తలు పాటించాలి**

తక్షణ చెల్లింపు లేదా సున్నితమైన సమాచారాన్ని అభ్యర్థించే చట్ట అమలు లేదా ప్రభుత్వ సంస్థల నుండి వచ్చిన కాల్స్, సందేశాలు లేదా ఇమెయిల్స్ పట్ల సందేహించండి. ఏ చట్ట అమలు సంస్థ లేదా పోలీసు అధికారులు ఫోన్ లేదా వీడియో కాల్స్ ద్వారా కేసులను దర్యాప్తు చేయరు, లేదా అరెస్టును నివారించడానికి వారు డబ్బును డిమాండ్ చేయరు. మీరు అధికారిక మార్గాల ద్వారా కాలర్ గుర్తింపును ధృవీకరించకపోతే ఫోన్ ద్వారా వ్యక్తిగత లేదా ఆర్థిక సమాచారాన్ని పంచుకోవద్దు. ఆర్టీజీఎస్ లేదా నెఫ్ట్ ద్వారా అపరిచితులకు చెల్లింపులు చేయవద్దు. మీరు చట్ట అమలు నుండి అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలను అందుకున్నట్లయితే, వెంటనే డిస్ కనెక్ట్ చేయండి మరియు సంఘటనను 1930 లేదా cybercrime.gov.inకు నివేదించండి. సత్వర చర్యలు మరింత మోసాన్ని నిరోధించగలవు. అనుమానాస్పద సంభాషణలను డాక్యుమెంట్ చేయండి మరియు సంబంధిత అధికారులకు రిపోర్ట్ చేయండి.

ఏదైనా సందేహం ఉంటే సహాయం కోసం 19304 వద్ద టిజిసిఎస్‌బి హెల్ప్‌లైన్‌ను సంప్రదించండి. సైబర్ క్రైమ్‌పై వివరణాత్మక వనరులు మరియు నవీకరణల కోసం, atwww.tgcsb.tspolice.gov.in వెబ్ సైట్‌ను సందర్శించాలి.

## జైళ్లల్లో మాదకద్రవ్యాల కేసులోనే..

# అత్యధికంగా 6,311 మంది నిందితులు

ఏడాదిలో జైలుకు వచ్చిన నిందితుల్లో పురుషులు 38,239, మహిళలు 2875

2024 వార్షిక నివేదిక వెల్లడించిన జైళ్ల శాఖ డిజి సౌమ్యమిశ్రా



ప్రజాపక్షం/హైదరాబాద్ : వివిధ కేసుల్లో 2024లో జైలుకు వచ్చిన వారిలో అత్యధికంగా 6,311 మంది మాదక ద్రవ్యాల కేసులోనే వచ్చారని జైళ్ల శాఖ డిజి సౌమ్యమిశ్రా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపడం వల్లనే వీరి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. బుధవారం చంచల్‌గూడలోని జైళ్ల శాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జైళ్ల శాఖ 2024 వార్షిక నివేదికను సౌమ్యమిశ్రా విడుదల చేశారు. ఈ సందర్భంగా సౌమ్యమిశ్రా మాట్లాడుతూ..వివిధ కేసులలో జైలుకు వచ్చే ఖైదీల సంఖ్య ఈసారి పెరిగిందన్నారు. ఏడాది కాలంలో 38,239 మంది పురుషులు, 2875 మహిళలు వివిధ కేసుల్లో వచ్చారని తెలిపారు. జైల్ అదాలత్ ద్వారా 483 మంది ఖైదీలను విడుదలచేశామన్నారు. రాష్ట్రంలోని ఆయా జైళ్లలో ఉన్న శిక్షపడిన 2650 మంది ఖైదీలు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ట్రైనింగ్ తీసుకుంటున్నారని తెలిపారు. సత్ప్రవర్తన కలిగిన 213 మంది ఖైదీలను విడుదల చేశామన్నారు. 2024లో 8 మంది ఖైదీలకు బ్యాంక్ లోన్స్ ఇప్పించామని, అలాగే సత్ప్రవర్తన కలిగిన 303 ఖైదీలను పెరోల్‌పై విడుదల చేశామన్నారు. వీరితో పాటు మరో 247 మందిని ఫర్లాపై అవకాశం కల్పించామన్నారు. జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలలో 750 మంది డిగ్రీ పూర్తిచేశారన్నారు. 225 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ పట్టా పొందారని తెలిపారు.

జైల్లో ఉన్న ఖైదీల ద్వారా ఇంటికి అవసరమైన పరికరాలను ఖైదీలతో తయారు చేయించామన్నారు. ఖైదీల నుండి టైలరింగ్, ప్రింటింగ్ ప్రెస్ బేకరి యూనిటీ, పౌల్ట్రీ వంటి పరిశ్రమలు ఏర్పాటు చేశామని, జైల్లో ఉన్న ఖైదీలకు ఉపాధి కల్పనకు అవసరమైన జాతీయ చమురు కంపెనీలతో 29 అవుట్ లే అవుట్‌లెట్ల (పెట్రోల్ బంక్)ను ఏర్పాటు చేశామన్నారు. అలాగే జైళ్ల శాఖలో 123 మందిని కొత్తగా రిక్రూట్ చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జైళ్ల శాఖలో 58 మందికి పదోన్నతులను కల్పించామని తెలిపారు. త్వరలో మధిరలో సబ్ జైల్ వస్తుందని, కొత్తగా వచ్చిన క్రిమినల్ చట్టాల బుక్‌ను తెలంగాణ జైళ్ల శాఖ నల్సార్ యూనివర్సిటీ సహకారంతో సిద్ధం చేశామని తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్‌లో జైళ్ల శాఖ స్టాల్ ఏర్పాటు చేశామని, గతంలో తమ స్టాల్‌కి తెలంగాణ ప్రభుత్వం అవార్డు ఇచ్చారని తెలిపారు. జైల్లో ప్లాస్టిక్ రహిత జైల్‌గా చేస్తున్నామని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్ బానిసైన వారికి జైళ్లలో ప్రత్యేక సెంటర్లు చేసిందన్నారు. హైదరాబాద్, చర్లపల్లి, సంగారెడ్డి, నిజామాబాద్ త్వరలోనే ఈ సెంటర్లు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఈ సెంటర్లలో వారికి కౌన్సిలింగ్‌తోపాటు వారిలో మంచి పరివర్తన వచ్చే విధంగా ప్రత్యేక కౌన్సిలర్లతో కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. త్వరలోనే రాష్ట్రంలో ఉన్న జైళ్లను మరమ్మతులు చేయడానికి ప్రభుత్వం సన్నద్ధం అవుతుందని తెలిపారు. ఖైదీల సమాచారాన్ని భద్రపర్చేందుకు ఆధార్ అనుసంధానం చేస్తున్నామని పేర్కొన్నారు. జైలుకు వచ్చే సామాన్యుల నుంచి వివిపిల వరకు అందరికీ ఒకే రకమైన నిబంధనలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జైళ్ల శాఖ ఐజిలు మురళీబాబు, రాజేష్, డిఐజిలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, సూపరింటెండెంట్లు శివకుమార్‌గౌడ్, రామచంద్రం, వెంకటలక్ష్మిలతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# సమసమాజమే కమ్యూనిస్టు పార్టీ లక్ష్యం




* వందేళ్ల చరిత్ర కలిగిన సిపిఐ బలోపేతం దిశగా పార్టీ శ్రేణులు ముందుకు రావాలి

* సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం / కరీంనగర్ ప్రతినిధి : మార్క్సిజం సిద్ధాంత పునాదులపై వర్గ దోపిడీకి వ్యతిరేకంగా అంతరాలు లేని సమసమాజమే కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని, వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐని మరింత బలోపేతం చేయడానికి పార్టీ శ్రేణులు ముందుకు కదలాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ శాసన సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం చిగురుమామిడి మండల కేంద్రంలోని మండల పార్టీ కార్యాలయం ముస్కు రాజిరెడ్డి స్మారక భవన్‌లో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శులు, ముఖ్యుల సమావేశం మాజీ మండల కార్యదర్శి ఎలగందుల రాజయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన సిపిఐ పార్టీ వందేళ్ల ఉద్యమ చరిత్రలో ఎన్నో విజయాలు సాధించడం జరిగిందని, నిరంతరం వర్గ దోపిడీకి వ్యతిరేకంగా పెట్టుబడిదారుల ఆగడాలను ఎదిరిస్తూ శ్రమదోపిడీని ప్రశ్నిస్తూ కార్మిక, కర్షక ప్రజా ప్రయోజకనాల కోసం పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. సిపిఐ ఆవిర్భవించిన సంవత్సరంలోనే ఈ దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించిందని, ఏనాడూ ఆర్‌ఎస్‌ఎస్ పేదలపక్షాన పోరాటాలు నిర్వహించలేదని, భూమికోసం, భుక్తి కోసం దోపిడీదారుల నుండి విముక్తి కోసం ఆర్‌ఎస్‌ఎస్ ఏమాత్రం కూడా కృషి చేయలేదని, హిందుత్వ ఎజెండాతో మనువాద సిద్ధాంతానికి అనుకూలంగా వ్యవహరిస్తుండేదని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిపిఐ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఉమ్మడి జిల్లాలో కమ్యూనిస్టు మండలంగా చిగురుమామిడికి పేరుండేదని అన్నారు.

దానిని తిరిగి పూర్వ వైభవం తీసుకురావడం కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎక్కువ సంఖ్యలో సర్పంచులు, ఎంపిటిసి స్థానాలు, జెడ్పీటిసి గెలుపొంది తిరిగి మండలాన్ని కైవసం చేసుకోవడం కోసం కృషి చేయాలని వెంకట్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, మండల కార్యదర్శి నాగేల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్న స్వామి, ముద్రకోల రాజయ్య, ఎలగందుల రాజయ్య, బూడిద సదాశివ, దోనికెన అనిల్, మాజీ మండల కార్యదర్శి తేరాల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ భూములను పరిరక్షించండి

మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వ భూములను పరిరక్షించాలని తహసీల్దార్లను రవాణ శాఖ, హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను జీరో స్థాయికి తగ్గించేందుకు బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, ప్రమాద రహిత చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలను, ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా సందర్శించారు. శిశు సంరక్షణ సంస్థలలో ఆశ్రయం పొందుతున్న పిల్లలకు హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధ్రువీకరణ (సర్టిఫికెట్లను) పత్రాలను హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కార్పొరేటర్ విజయారెడ్డి, యూనిసెఫ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమీర్‌పేట్ సిహెచ్‌సి (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)ను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో ఉన్న డాక్టర్లు, రోగులు, రోగుల బంధువులతో మంత్రి పొన్నం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గైనకాలాజీ విభాగాన్ని పరిశీలించారు. అలాగే చిన్న పిల్లలకు మందులు ఇచ్చే గది ఫార్మా రూమును, ల్యాబ్‌లు, మెడికల్ ఓపిని కూడా ఆయన పరిశీలించారు. ప్రభుత్వ హాస్పిటల్‌కి వచ్చే రోగులకు విశ్వాసం కల్పించేలా సేవలను అందించాలని పొన్నం ప్రభాకర్ వైద్యులకు సూచించారు. అనంతరం బయో మెడికల్ వేస్టేజ్ ప్రాంతాన్ని పరిశీలించారు. హాస్పిటల్‌లో పనిచేసే శానిటేషన్ సిబ్బంది తమకు కొద్ది నెలలుగా జీతాలు రావడంలేదని వారు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే వైద్య శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. అమీర్‌పేట్‌లో 50 పడకల ఆసుపత్రిని సందర్శించారు. జాతీయ రహదారుల భద్రత మాసోత్సవంలో భాగంగా ఎస్‌ఆర్ నగర్‌లోని ఐపిఎస్ ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను మంత్రి పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలకు గల కారణాలను ఆయన స్థానికంగా ఉన్న పోలీస్, ట్రాఫిక్, రవాణా శాఖ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు.

# అక్రమకేసుపై ఆలోచించాల్సిన అవసరం లేదు

రానున్న సంవత్సరంలో నూతన కమిటీలు, సభ్యత్వ నమోదు : కెటిఆర్




ప్రజాపక్షం/హైదరాబాద్ : రానున్న సంవత్సర కాలంలో రైతుల సమస్యలు, కాంగ్రెస్ ఇచ్చిన హామీలపైనే మాట్లాడాలని, తనపై నమోదు చేసిన అక్రమ కేసుపైన ఆలోచించాల్సిన అవసరం లేదని పార్టీ శ్రేణులకు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు సూచించారు. తనపైన నమోదు చేసిన అక్రమ కేసులపైన చట్ట ప్రకారం పోరాడుతానని, తప్పు చేయనప్పుడు ఎవ్వరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. రానున్న సంవత్సర కాలంలో నూతన కమిటీలు, సభ్యత్వ నమోదు, పార్టీ అధ్యక్షుని ఎన్నిక వంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 'బిఆర్‌ఎస్ డైరీ–2025' కెటిఆర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహమద్ మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్, వి.శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, ఎంఎల్‌ఎలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ముఠాగోపాల్, పాడికౌశిక్‌రెడ్డి, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ ఇబ్బందుల్లో ఉన్నామని పార్టీ శ్రేణులు అనుకోవద్దని, రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజల్లో ఎండగట్టాలన్నారు. అక్రమ కేసులకు ఎవ్వరూ భయపడాల్సిన అవసరంలేదన్నారు. ఈ సంవత్సరాన్ని పోరాట నామ సంవత్సరంగా ప్రభుత్వంపైన పోరాటం చేయాలని సూచించారు. కాంగ్రెస్ చేస్తున్న అప్పుల తప్పులు, సాగునీటి ప్రాజెక్టులపైన చేస్తున్న దుష్ప్రచారంపైన మాట్లాడాలన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతూ ఏ ఒక్కరిపై ఈగ వాలినా పార్టీ శ్రేణులు ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. ప్రతి నాయకునికి, కార్యకర్తకు ఆపదొస్తే బిఆర్‌ఎస్ ఎలా నిలబడుతుందో, పార్టీ మొత్తం కెటిఆర్ వెంట ఉంటుందని తెలిపారు. కెటిఆర్‌పైన నమోదు చేసిన కేసు ఒక ప్రశ్నించే గొంతుక, ఒక ఉద్యమకారునిపైన నమోదు చేసినట్టేనని అన్నారు.

# భద్రాద్రిలో ముక్కోటికి రెడీ

నేటి నుండి 11 వరకు 'రివర్ ఫెస్టివల్'



ప్రజాపక్షం/భద్రాచలం : శ్రీ సీతారామచంద్ర స్వామి కొలువై ఉన్న భద్రగిరి ముక్కోటికి ముస్తాబైంది. ఇందు కోసం రామాలయం ఆధ్వర్యంలో రూ.1.20 కోట్లతో చేపట్టిన పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఆలయ పరిసరాలు పండుగ శోభను సంతరించుకోగా, శ్రీరాముడు కొలువై ఉన్న కోవెల విద్యుత్ దీప కాంతులను వెదజల్లుతోంది. ఈసారి వేడుకకు రాష్ట్రం నలు మూలల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకుతగిన ఏర్పాట్లు చేశారు. రామాలయం ఆధ్వర్యంలో భద్రాద్రిలో అత్యంత వైభవంగా జరిగే మరో వేడుక ముక్కోటి ఏకాదశి ఉత్సవం. ఈ వేడుకలో భాగంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారు నేడు నదీవిహారం చేయనున్నారు. ఇందు కోసం గోదావరి తీరంలో ప్రత్యేక హంస వాహనాన్ని సిద్ధం చేశారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఇఇ, సర్కిల్–30, బేగంపేట్, సికింద్రాబాద్ జోన్.

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

NIT No. 25/EE-30/SDZ/GHMC/2024-25, తేది: 08.01.2025న 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో ప్రచురించబడినది. వివరాలు https://tender.eprocurement.gov.inలో లాగిన్ అయి చూడవచ్చు. ఈవెంట్ల తేదీల వివరాలు క్రింది విధముగా :

| NIT No. | పని పేరు | అంచనా విలువ (లక్షల లో) | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం / బిడ్ దాఖలుకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా సెల్ నెం. |
|---|---|---|---|---|
| NIT No. 25/EE-30/SDZ/GHMC/2024-25, తేది: 08.01.2025 | 1. జిహెచ్‌ఎంసి, బేగంపేట్, వార్డ్ నెం.149లో సికింద్రాబాద్, పరేడ్ గ్రౌండ్ వద్ద జనవరి 26, 2025న గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు. 2 పనులు | 11.95 | 09.01.205 12.00PM<br>17.01.2025 10.30PM | ఇఇ, సర్కిల్-30, బేగంపేట్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి. సెల్ నెం. 7331181426 / 9849906750 |

అధికారి చిరునామా: శ్రీ సుదర్శన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-30, బేగంపేట్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసిలో సంప్రదించవచ్చు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-30, బేగంపేట్.

DIPR R.O. No. : 8856-PP/CL/ADVT/1/2024-25, Date: 08-01-2025

ప్రజాపక్షం
గురువారం, జనవరి 09

## కెనడాలో ఏం జరుగుతోంది?

కెనడా తీవ్రమైన రాజకీయ అస్థిరతలో ఉంది. అమెరికా అధ్యక్ష పీఠం అధిరోహించబోతున్న మితవాద నాయకుడు డోనాల్డ్ ట్రంప్ కెనడాను తమ 51వ రాష్ట్రంగా మార్చుతానని, యుఎస్‌ఎ, మెక్సికో, కెనడా మధ్యనున్న త్రైపాక్షిక ఒప్పందాన్ని కెనడా జాతీయ ప్రయోజనాలకు పూర్తి వ్యతిరేకంగా మార్పుచేస్తానని హెచ్చరికలు చేస్తున్నాడు. అగ్నికి ఆజ్యం తోడైనట్టు ట్రంప్ సలహాదారుగా చేరిన ప్రపంచ కుబేరుడు ఇలోన్ మస్క్ తన సోషల్ మీడియా వేదిక ఎక్స్ (ఇంతకుమునుపు ట్విట్టర్)ను దుర్వినియోగం చేస్తూ కెనడాలోని లిబరల్స్‌కు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నాడు. ఒక్క కెనడా అనే కాదు, బ్రిటన్ లేబర్‌పార్టీ ప్రధాని కీర్ స్టార్మర్‌కు వ్యతిరేకంగా అతడు దుమ్మెత్తిపోశాడు. ముస్లింలు, వలస ప్రజలకు వ్యతిరేకంగా మతోద్రేకాలు రగిల్చాడు. మస్క్ ఆరోపణలను స్టార్మర్ తీవ్రంగా ఖండించాడు. అయినా బ్రిటీష్ సమాజానికి జరగాల్సిన చేటు అప్పటికే జరిగిపోయింది.

ఒకప్పుడు సిఐఎ, అమెరికా ప్రభుత్వం లాటిన్ అమెరికాలో, అనేక ప్రపంచ దేశాల్లో ప్రభుత్వాలను మార్చేందుకు సైనిక తిరుగుబాటును ప్రోత్సహిస్తుండేవి. ఇప్పుడు ట్రంప్–మస్క్‌లది కొత్త తరహా 'ప్రజాస్వామ్య' పద్ధతి. యూరప్, లాటిన్ అమెరికాల్లో బలహీనంగా ఉన్న సెంటర్‌రైట్ లేదా సెంట్రిస్ట్ ప్రభుత్వాలను మార్చటానికి కొత్త తరహా తప్పుడు విధానాలు అనుసరిస్తున్నారు. తప్పుడు సమాచారం వ్యాప్తిలో పెట్టటం, పచ్చి మితవాదులను చేరదీయటం అందులో ఒకటి. వారు శక్తిమంతుల జోలికి వెళ్లరు. మెక్సికోలో బలమైన వామపక్ష సంకీర్ణం–మొరెనా – ప్రభుత్వం ఉంది. ట్రంప్ మెక్సికో నుంచి వలసలను నిరోధిస్తామని అన్నారుగాని మెక్సికన్ అధ్యక్షునిపై పరుషమైన మాటలు ఉపయోగించలేదు. ఏమైనా ఇలోన్ మస్క్ నయా ఫాసిస్టు తరహా, ఇతర దేశాల్లో జోక్యందారీ పద్ధతులను మొగ్గలోనే ప్రతిఘటించకపోతే అతడు ప్రపంచానికి ప్రమాదకరమైన శక్తిగా ఎదిగే అవకాశం త్రోసిపుచ్చలేనిది.

> అక్టోబర్‌లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో లిబరల్ పార్టీ ఓటమి ఖాయమన్న ప్రజాభిప్రాయ పోల్స్ నేపథ్యంలో పాలక లిబరల్ పార్టీలో అంతర్గత తగాదాలు బయలుదేరాయి. సెప్టెంబర్‌లో సంకీర్ణ భాగస్వామి ఎన్‌డిపి ప్రభుత్వానికి తోడ్పాటు ఉపసంహరించుకుంది. శక్తిమంతురాలైన ఉప ప్రధాన మంత్రి, ఆర్థికమంత్రి క్రిస్టియా ఫ్రీలాండ్ డిసెంబర్ 20న రాజీనామా చేశారు.

కెనడాలో ఉన్నది బలహీనమైన లిబరల్‌పార్టీ మైనారిటీ ప్రభుత్వం. ప్రధాని జస్టిన్ ట్రూడో సిక్కు తీవ్రవాది హత్య విషయంలో భారత ప్రభుత్వాన్ని నిందించి శతృత్వం కొనితెచ్చుకున్నారు. కొన్ని నెలల తర్వాత తన పొరపాటును గ్రహించి క్షమాపణ చెప్పినా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కెనడాలో భారతీయులు ముఖ్యంగా అనాదిగా సిక్కుసంతతి పెద్దసంఖ్యలో ఉన్నారు. అక్టోబర్‌లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో లిబరల్ పార్టీ ఓటమి ఖాయమన్న ప్రజాభిప్రాయ పోల్స్ నేపథ్యంలో పాలక లిబరల్ పార్టీలో అంతర్గత తగాయిదాలు బయలుదేరాయి. సెప్టెంబర్‌లో సంకీర్ణ భాగస్వామి ఎన్‌డిపి, ప్రభుత్వానికి తోడ్పాటు ఉపసంహరించుకుంది. శక్తిమంతురాలైన ఉప ప్రధానమంత్రి, ఆర్థికమంత్రి క్రిస్టియా ఫ్రీలాండ్ డిసెంబర్ 20న రాజీనామా చేశారు. అధ్యక్షునిగా ట్రంప్ విజయం తర్వాత ట్రూడో ట్రంప్ నివాస ప్రాసాదం మారా లోగోకు వెళ్లి దర్శనం చేసుకున్నారు. అయితే అవమానమే ఎదురైంది. ట్రంప్ శిబిరం అప్పటికే తన ప్రభుత్వంలోని కొందరు సీనియర్లతో సంబంధం ఏర్పరుచుకున్నట్లు ట్రూడోకు తెలుసు. అధికారంలో కొనసాగితే మరిన్ని అవమానాలు తప్పవనుకున్నాడో ఏమో, ట్రూడో జనవరి 6న లిబరల్ పార్టీ నేతగా, ప్రధానమంత్రిగా వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. పార్లమెంటును మార్చి 24వరకు ప్రోరోగ్ చేశాడు. ఈ లోపు పార్టీ కొత్త నాయకుణ్ణి ఎన్నుకోవచ్చు.

ప్రతిపక్ష కన్సర్వేటివ్ పార్టీ, డోనాల్డ్ ట్రంప్ సుంకాల విధింపు బెదిరింపులను ఎదుర్కొనేందుకు ఆల్‌పార్టీ యునైటెడ్ ఫ్రంట్ కోరుతున్న కెనడా వ్యాపార వర్గాలు, సంస్థలు కుషీగా ఉన్నాయి. తక్షణం ఎన్నికలు కోరుతున్నాయి. జనవరి 27కు బదులు మార్చి 24 వరకు ప్రధాని పార్లమెంటును ప్రోరోగ్ చేసినందున – ఈ అదనపు రెండు మాసాల వ్యవధిలో కల్లోలిత జలాల్లోని తమ నావను కాపాడుకోవచ్చని, కొత్త నాయకుణ్ణి ఎన్నుకోవచ్చని, ఎన్నికల్లో గట్టిగా పోరాడే బలాన్ని కూడగట్టుకోవచ్చని ట్రూడో, లిబరల్ పార్టీ నాయకులు ఆశిస్తున్నారు.

కెనడాలోని బలమైన కార్మికవర్గం ఒక్కటై తమ అవసరాలను రాజకీయ ఎజెండాగా దేశం ముందు ఉంచేందుకు ఈ వ్యవధిని ఉపయోగించుకోవచ్చు. కెనడా ప్రజలు మితవాదులకు, ట్రంప్ బెదిరింపులకు లొంగిపోతారా లేక మధ్యేమార్గ విధానాలతో ప్రతిఘటిస్తారా – వేచిచూదాం!

# ట్రంప్ 'సుంకాల బెదిరింపు' ప్రపంచానికి ముప్పు

ప్రభాత్ పట్నాయక్

సుంకాలను ఇతర దేశాలకు వ్యతిరేకంగా ఆయుధంగా చేసుకుంటానని డొనాల్డ్ ట్రంప్ బెదిరిస్తున్నారు. ఇప్పటికే ఆయన మూడు బెదిరింపు ప్రకటనలు చేశారు. అందులో మొదటిది, బ్రిక్స్ దేశాలు డాలర్‌కు ప్రత్యామ్నాయం చూసుకునే సాహసం చేస్తే, ఆ దేశాలు అమెరికా మార్కెట్‌లో వంద శాతం సుంకాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రెండవది, యూరోపియన్ యూనియన్ (ఇయు) తమ వ్యాపార మిగులు కోసం అమెరికా నుంచి చమురు, సహజవాయువును మరింతగా కొనుగోలు చేయడాన్ని తగ్గిస్తే (2023లో సరుకు వ్యాపారంపై మిగులు 208.7 అమెరికన్ డాలర్లు), అమెరికా మార్కెట్‌లో అధిక సుంకాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఇయు దేశాలను హెచ్చరించారు. మూడవది, అమెరికాలో అంతర్జాతీయ దిగుమతులపై 10 శాతం సుంకాలు ఎలాగూ ఉంటాయని, చైనా సరుకులపై 60 శాతం సుంకం ఉంటుందని ప్రకటించారు. (2023లో అమెరికాతో పరస్పర సరుకుల వ్యాపారంలో చైనాకు లభించిన మిగులు 279.4 బిలియన్ డాలర్‌లు. ఇది గతంలో అంటే 2018లో 418 బిలియన్ డాలర్‌ల మిగులు కంటే తక్కువ. అయినప్పటికీ గణనీయంగానే ఉంది).

ఈ ప్రతిపాదిత చర్యల్లో ప్రతిఒక్కదానికీ ముఖ్యమైన ఆర్థిక చిక్కులు ఉంటాయి. ఉదాహరణకు సహజవాయువు కోసం రష్యాపై ఆధారపడే బదులుగా అమెరికా నుంచి యూరోపియన్ యూనియన్ వాటిని కొనుగోలు చేయాల్సి వస్తే, ఇయులో గ్యాస్ ధరలు పెరగడమే కాకుండా, అమెరికాలో కూడా 30 శాతం వరకు ధరలు పెరిగే అవకాశం ఉందని అంచనా. దీనిపై ట్రంప్ స్పందిస్తూ పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా అమెరికా సహజవాయువు ఉత్పత్తిని పెంచుకుంటుందన్నారు. కానీ, గ్యాస్ ఉత్పత్తిని పెంచుకునేందుకు పెట్టుబడులు అవసరం. అమెరికాలో అయితే ప్రైవేటు పెట్టుబడే ఆధారం. ఇలా ఆదేశాలివ్వగానే అలా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉండదు. ఇదే కాకుండా చమురు, సహజవాయువులతో పర్యావరణ హానికి ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. కాబట్టి వాటి వినియోగం తగ్గించాలనే సాధారణ నిబద్ధత దృష్ట్యా వాటిపై పెట్టుబడులు వాస్తవ రూపం దాల్చవు. ఒకవేళ వచ్చినా పర్యావరణ ఆందోళనలు మరింత తీవ్రమవుతాయి. అలాగే, బ్రిక్స్ దేశాలపై 100 శాతం సుంకాలను పెంచితే, ఆ దేశాలు తప్పక ప్రతి చర్యలు తీసుకుంటాయి. ఆ ప్రభావం అమెరికా ఎగుమతులపై తీవ్రంగానే ఉంటుంది.

ఇవన్నీ కూడా కేవలం అమలయ్యే అవకాశం ఉందనే భావన పరిధిలో ఉన్నాయి. ఇతర దేశాలనుంచి దిగుమతులపై 10 శాతం పన్ను, చైనా నుంచి దిగుమతులపై 60 శాతం పన్ను మాత్రం తప్పనిసరిగా అమలు అవుతాయి. వీటి ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పడే ఒక స్పష్టమైన ప్రభావం గురించి నేను చర్చించదలిచాను. ఇలాంటి సుంకాలు ఇతర దేశాల నుంచి ఎలాంటి ప్రతిచర్యకు దారి తీయవని అనుకుందాం (ఒకవేళ అలా జరిగినా, కింద వెలుబుచ్చిన వాదనలో మార్పు ఉంటుందే తప్ప, ముఖ్యాంశాలను తిరస్కరించలేము). వారు అమెరికాలో అమెరికన్ సరుకుల డిమాండ్ స్థాయిని పెంచుతారు. తద్వారా ఆ దేశంలోనే ఉత్పత్తి, ఉపాధి స్థాయిలో పెరుగుదల ఉంటుంది. వాస్తవానికి అమెరికన్‌లు పెద్ద ఎత్తున ఐరోపా కార్లను కొనుగోలు చేస్తుంటారని ట్రంప్ ఫిర్యాదు చేస్తుంటారు. దానిని తలకిందులు చేసేందుకు ఐరోపా కార్లపై సుంకాలు విధిస్తే, అమెరికాలో అమెరికన్ కార్లకు డిమాండ్ పెరుగుతుందని, వాటి ఉత్పత్తి (ఆ పరిశ్రమలో ఉద్యోగాల)లో పెరుగుదల ఉంటుందనేది మాత్రం నిజం కాదు. ఇందుకు భిన్నంగా సరుకుల దిగుమతిపై సుంకాల కారణంగా జీవన వ్యయం పెరగడమే కాకుండా వినియోగదారుల కొనుగోలు శక్తి తరిగిపోతుంది. ఈ ప్రభావం ఉద్యోగాలు–కాంట్రాక్టింగ్‌పై ఉంటుంది. ధరల పెరుగుదల నియంత్రణ కోసం ఒకవేళ ట్రంప్ అధికార యంత్రాంగం ద్రవ్యోల్బణ వ్యతిరేక 'పొదుపు' చర్యలు తీసుకుంటే ఆ ప్రభావం మరింత స్పష్టంగా కనపడుతుంది. అది, జరిగే అవకాశం ఉంటుందని భావించుదాం. ట్రంప్ సుంకాల చర్యల కారణంగా అమెరికాలో ఉద్యోగాలు, ఉత్పత్తిలో నికరపెరుగుదల అనుకుందాం.

అమెరికన్ మార్కెట్‌లో కలిగే నష్టాన్ని పూడ్చుకునేందుకు మిగతా ప్రపంచదేశాలు ప్రతిగా డిమాండ్‌ను పెంచుకునే చర్యలు తీసుకోనట్లయితే ఆయా దేశాలలో ఉద్యోగాలు తగ్గిపోతాయి. అంటే అమెరికా సులువుగా తన నిరుద్యోగాన్ని ఇతర ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసినట్లే. తన సుంకాల చర్యల ద్వారా ఇతర దేశాల ఎడల 'పొరుగువారిని యాచకులుగా' మార్చే విధానం అవలంభించినట్లే అవుతుంది. అయితే ద్రవ్య విధానాన్ని విస్తరించడం ద్వారా దేశీయ డిమాండ్‌ను పెంచుకుంటే ఇతర దేశాలపై ప్రతికూల ప్రభావం ఉండబోదు (ద్రవ్య విధాన విస్తరణ అనేది మొద్దుబారిన పరికరం). కానీ, చైనా మినహా ఇతర ఆర్థిక వ్యవస్థలలో ఇది సాధ్యం కాదు.

అటువంటి విస్తరణతో కూడిన ద్రవ్యవిధానం భారీ ద్రవ్య లోటు బాటను లేదా తమ ఆదాయాలలో భారీ మొత్తాలను ఆదా చేసుకునే


పనామా కెనాల్‌ను స్వాధీనం చేసుకుంటాం – ట్రంప్

పెట్టుబడిదారులు, ధనికులపై భారీ పన్నుల రూపంలో తీసుకోవాలి. అలాగే తమ ఆదాయంలో ఎక్కువ భాగాన్ని వినిమయానికి వెచ్చించే శ్రామిక పన్నులు ఎలాగూ ఉండనే ఉంటాయి. ఈ పన్నులన్నిటితో ప్రభుత్వ వ్యయాన్ని భారీగా పెంచడం ద్వారా మొత్తం డిమాండ్ కూర్పులో మార్పు (పనిచేసే ప్రజల వినిమయం తగ్గి, ప్రభుత్వ వ్యయం అధికమవడం) జరుగుతుందే తప్ప పరిమాణంలో కాదు. కానీ, ఇలాంటి ద్రవ్య చర్యల ద్వారా వాస్తవానికి మొత్తం డిమాండ్ పరిమాణం పెరుగుతుంది. దీనిని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి వ్యతిరేకిస్తుంది. ద్రవ్యలోటు నిర్ణీత (సాధారణంగా జిడిపిలో 3 శాతం)పరిమితిని దాటడాన్ని అది వ్యతిరేకిస్తుంది. అంతేకాకుండా ధనికులపై పన్నులను కచ్చితంగా వ్యతిరేకిస్తుంది. ఎందుకుంటే ఇలాంటి పన్నులు సహజంగానే ద్రవ్య పెట్టుబడిదారులపైనే భారీగా పడతాయి. డిమాండ్ ను ప్రోత్సహించే చర్యలను అమలు చేసే ఆర్థిక వ్యవస్థలు పెట్టుబడి తరలింపు బాధితులై, చివరకు అస్థిరంగా మారుతాయి. అందుకే అంతర్జాతీయాకరణ జరిగిన ద్రవ్య పెట్టుబడి ఆధిపత్య స్వభావం కలిగిన నయా ఉదారవాద వ్యవస్థలో ద్రవ్య విస్తరణ సంభవించదు. ఒకవేళ అమెరికా సుంకాలను విధించినా కూడా అది నయా ఉదారవాదం నుంచి కొంత పక్కకు జరిగినట్లే అవుతుంది. అటువంటి వ్యవస్థలో పెట్టుబడి, ప్రత్యేకించి ద్రవ్య పెట్టుబడి స్వేచ్ఛగా సరిహద్దులు దాటుతుంది. ఈ విషయంలో ఎలాంటి రాజీనీ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఏ మాత్రం సహించదు. ట్రంప్ సంరక్షణావాదాన్ని సమర్థించే సమయంలో పెట్టుబడి నియంత్రణలకు అనుకూలంగా ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం విశేషం. పెట్టుబడి నియంత్రణ లు లేనప్పుడు ద్రవ్య విస్తరణ సమయంలో ఆయా దేశాల నుంచి పెట్టుబడులు తరలిపోయే ముప్పు ఉంటుంది. అందువల్ల దాన్ని తప్పించుకోవటానికి వారు ఇష్టపడతారు.

చైనా విషయానికి వస్తే, అది పూర్తి భిన్నమైనది. చైనాలో ఉత్పత్తి అయ్యే సరుకులు అమెరికా మార్కెట్‌లో ప్రవేశించకుండా వరుస అమెరికా ప్రభుత్వాలు కొంతకాలంగా అమెరికా మార్కెట్‌ను కాపాడుకుంటున్నాయి. అమెరికాతో సరుకుల వ్యాపారంలో చైనా మిగులు తగ్గిపోతుండడమే ఇందుకు ధృవీకరణ. అమెరికా మార్కెట్‌లో నష్టాన్ని దేశీయ మార్కెట్ విస్తరణ ద్వారా చైనా పూడ్చుకుంది. చైనా ఇలా చేయగలగడానికి, ఇతర దేశాలు చేయలేకపోవడానికి కారణమేమిటంటే, చైనా సరళీకరణ చేపట్టినప్పటికీ, అక్కడ 'కేంద్రీకృత ఆర్థికవ్యవస్థ'(కమాండ్ ఎకానమీ)నే కొనసాగుతోంది. ఆర్థిక వ్యవహారాలన్నీ రాజకీయ నాయకత్వం అదుపాజ్ఞలలోనే ఉంటాయి. అక్కడ ప్రభుత్వ రంగం గణనీయంగా ఉండడమే కాకుండా చైనా ఆర్థిక వ్యవస్థ సాధారణంగానే పెట్టుబడియేతర లక్షణం కలిగి ఉంటుంది. వాటి పెట్టుబడి నిర్ణయాలు, వేతనాల విధానాలను ప్రభుత్వమే ప్రభావితం చేస్తుంది. సంపన్న దేశాలు సహా ప్రపంచమంతట నిజవేతనాల్లో సర్వసాధారణంగా ప్రతిష్టంభన ఉండగా చైనాలో ప్రభుత్వ ఆదేశాల ఫలితంగా నిజ వేతనాల పెంపుదల ఉండటం ఆశ్చర్యం కలిగించదు. అందువల్ల చైనా దేశీయ మార్కెట్ విస్తరణను పెట్టుబడిదారీ దేశాల్లోలాగా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలు నియంత్రించలేవు.

అమెరికా మార్కెట్ రక్షణవాదం ప్రభావాలను తిప్పికొట్టగల(సూత్రప్రాయంగా) చైనాను పక్కనబెడితే, మిగతా ప్రపంచం (ఒకవేళ ఏదైనా దేశం నయా ఉదారవాద విధానం నుంచి వైదొలిగితే తప్ప) మాంద్యం పెరుగుదలను చూస్తుంది. ఈ ప్రభావం ప్రత్యేకించి పేద దేశాలపై తీవ్రంగా ఉంటుంది. స్వేచ్ఛా వాణిజ్యం గొప్పదనం గురించి దక్షిణ భూగోళ దేశాలకు లెక్చర్లు ఇస్తూ, వాటిని సంరక్షణవాద విధానాలు అమలు చేయకుండా నిరోధించే బ్రెట్టన్ ఉడ్స్ ఇన్‌స్టిట్యూషన్‌లు తాజాగా ట్రంప్ సంరక్షణవాదం నేపథ్యంలో మౌనం దాల్చాయి. (పెట్టుబడుల ప్రవాహాన్ని నిరుత్సాహపరచకుండా) ధనికులపై భారీ పన్నులను నిరోధించాలని, 'ద్రవ్య లోటు నిబంధనలకు' గట్టిగా కట్టుబడి ఉండాలని ఆ దేశాలకు ఆ సంస్థలు చెబుతుండేవి. ఇప్పుడు అమెరికన్ మార్కెట్ రక్షణ వాదాన్ని ఆ దేశాలు దీనంగా ఎదుర్కోక తప్పని పరిస్థితి మాత్రమే కాకుండా, ఆ ప్రభావంతో తగిలే దెబ్బలను అనుభవించాల్సిందే. దీంతో కేవలం మాంద్యం ధోరణులే కాకుండా, వాటి తీరాలలో పెట్టుబడి ప్రవాహాలు ఎండిపోయి, ఎగుమతి సరుకులను ఉత్పత్తి చేసే కేంద్రాలు వేరే చోటుకు తరలిపోతాయి.

మిగతా ప్రపంచమంతటా మాంద్యం ధోరణులు ప్రబలడంతో ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న నయా ఫాసిస్టు ధోరణులను మరింత బలోపేతమవడానికి దారి తీస్తుంది. ఆర్థిక సంక్షోభ కాలంలో కార్పొరేట్ పెట్టుబడి, నయా–ఫాసిస్టు శక్తుల మధ్య కలయిక నయా–ఫాసిజాన్ని పెంపొందిస్తుంది. ఎలాంటి సంక్షోభమైనా నయా–ఫాసిస్టు ధోరణిని మరింత బలోపేతం చేసేందుకు దారి తీస్తుంది. ఇలాంటి ప్రతీ సంక్షుభిత దేశంలో కొన్ని నిస్సహాయక మైనారిటీ సమూహాలను 'వేరు' చేసి చూపడం ద్వారా భౌతిక జీవితం నుంచి చర్చను దారి మళ్ళించేందుకు ప్రయత్నం జరుగుతూనే ఉంటుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చివరకు సామ్యవాదం, ఆటవికవాదం మధ్య ఎంచుకునేందుకు అవకాశాన్ని మానవాళికి కల్పిస్తుందని రోసా లగ్జంబర్ చేసిన ప్రకటన ప్రతీకార రూపంలో వాస్తవ రూపం దాలుస్తోంది. నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ చరమాంకానికి చేరుకుంది. ఇది ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థ తాజా దశ. ఈ దశ విస్తృత పరివ్యాప్తమైన ఆటవిక నయా ఫాసిజం పరిస్థితిలోకి మానవాళిని తెస్తున్నది. అక్కడి నుండి దశల వారీ సోషలిజంలోకి పరివర్తన చెందడమే మార్గం చూపుతుంది.

## కలుషితాన్ని, కల్తీని నియంత్రించలేమా!

ఈ సృష్టిలో నింగి, నేల ఎంత ప్రధానమో గాలి, నీరు కూడా అంతే ముఖ్యమైనవి. ఈ భూమిపై నేడు కలుషితం లేని నీరు లేదు, గాలి లేదు. ఎందుకంటే పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో కొత్త వస్తువు తయారు చేయాలంటే దానినుండి వచ్చే వ్యర్థాలు నదులు, సముద్రాలు, గాలిలో కలుస్తూ మొత్తం కలుషితం అవుతున్నాయి. రోజు రోజుకు ఓజోన్ పొర కూడా క్షీణిస్తుంది. గాలిలో ఆక్సిజన్ శాతం తగ్గుతుందని పర్యావరణ నిపుణులు తెలుపుతున్నారు. దేశంలో ఆహార పదార్థాల విషయానికి వస్తే పిల్లలు తాగే పాల నుండి మాంసకృత్తుల వరకు మొత్తం కల్తీ జరుగుతుంది. ప్రస్తుతం ఫుడ్ సేఫ్టీ అధికారులు చేస్తున్న తనిఖీలలో హోటల్స్, రెస్టారెంట్‌లలో కల్తీ ఆహార పదార్థాలు వాడుతున్నట్లు బయట పడుతుంది. నాణ్యతలేని ఆహార పదార్థాలు తిని ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, దీంతోపాటు దీర్ఘకాల వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు తెలుపుతున్నారు. కావున సంబంధిత అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తూ సాధ్యమైనంత వరకు కల్తీని నియంత్రించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసే కంపెనీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులో ఉండే చూడాలి. నేడు ఫ్యాక్టరీలు, ఇంధనాల నుండి వచ్చే వాయు కాలుష్యాన్ని నివారించడానికి ప్రత్యామ్నాయంగా సోలార్, ఎలక్ట్రానిక్ వాహనాలను వాడుతూ కాలుష్య నియంత్రణకు సహకరించాలి.



భారతదేశంలో కలుషితం, కల్తీ ప్రధాన సమస్యగా మారింది. ఇది ఆహారం యొక్క నాణ్యతను తగ్గిస్తూ మానవులు, జంతువులలో తీవ్రమైన అనారోగ్యాలకు మూల కారణం అవుతుంది. ఈ సమస్యలను అరికట్టడానికి ఇంకా కొత్త చట్టాలను తీసుకు వస్తూ ఉన్నటువంటి చట్టాలను తప్పక అమలు చేస్తే కొంతవరకైనా కాలుష్యాన్ని, కల్తీని అరికట్టవచ్చు. 1943లో భారత ప్రభుత్వం ఆహార కల్తీ కమిటీని ఆమోదించింది. కమిటీ ఆహార కల్తీకి సంబంధించిన అంశాన్ని అధ్యయనంచేసి సమీక్షించి కేంద్ర చట్టానికి సలహా ఇచ్చింది. ఆ విధంగా ఆహార కల్తీ నిరోధక చట్టం(PFA) చివరకు 1954లో ఆమోదించింది. భారతదేశం మొత్తం ఆహార కల్తీ నిరోధక చట్టం 1954 లో విస్తరించింది. ఈ చట్టం 1955, జూన్ 15 నుండి అమలులోకి వచ్చింది. ఈ చట్టం కల్తీని నిర్వచిస్తూ కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గెజిట్‌లో తెలియజేయడం ద్వారా అధికారిక ప్రతినిధిని నియమించవచ్చు. ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించిన కల్తీని ప్రయోగశాలకు పంపడం జరుగుతుంది. ఆహార కల్తీ అనేది వివిధ కారణాల వల్ల జరుగుతుంది. ఆహార ఉత్పత్తులకు విదేశీ లేదా నాసిరకం పదార్థాలను ఉద్దేశపూర్వకంగా చేర్చడం వల్ల మిక్సింగ్, ప్రత్యామ్నాయం, ప్యాకేజింగ్ మెటీరియల్‌లో నాసిరకం నాణ్యతను దాచడం, కుళ్ళిన ఆహారాన్ని అమ్మకానికి పెట్టడం, తప్పుగా బ్రాండ్ చేయడం లేదా తప్పుడు లేబుల్‌లను ఇవ్వడం వంటి అనేక రూపాల్లో కల్తీ జరుగుతుంది. ఆహార పదార్థాల నాణ్యతను గుర్తించడానికి అనేక విశ్లేషణాత్మక పద్ధతులను తీసుకువచ్చారు క్రోమాటోగ్రఫీ, స్పెక్ట్రోస్కోపీ, ఎలక్ట్రానిక్ సెన్సార్లు వంటివి ఉపయోగిస్తారు. ఆహార కల్తీకి సంబంధించిన కారణాలు, ప్రమాదాలు గురించి పూర్తి స్థాయిలో చర్చిస్తుంది. ఆహార కల్తీపై పుస్తకాలు, నియంత్రణ, మార్గదర్శకాలు, కథనాలు, నివేదికలను విమర్శనాత్మకంగా విశ్లేషిస్తారు. ఆహార కల్తీని ఎదుర్కోవడానికి సంబంధించిన సవాళ్లు సూచిస్తూ సమీక్ష తదనంతరం కీలక ఫలితాలను అంచనా వేస్తుంది. ఈ సమీక్షలో ఆహార కల్తీకి సంబంధించిన అనేక కారణాలు, ఆరోగ్య ప్రభావాలు ఉంటాయి. ఆహార కల్తీని గుర్తించడానికి విశ్లేషణాత్మక పద్ధతులు కూడా క్లుప్తంగా నమో దు చేయబడ్డాయి. అదనంగా నియంత్రణ చర్యలు సాంకేతిక పురోగతిని వినియోగదారుల అవగాహన కలయిక ద్వారా ఆహార కల్తీని పరిష్కరించాల్సిన ఆవశ్యకతను సమీక్ష నొక్కి చెప్పింది. కల్తీ ఆహారం వల్ల క్యాన్సర్, కాలేయ వ్యాధి, హృదయ సంబంధ వ్యాధులు, మూత్ర పిండాల వ్యాధి మరియు నాడీ వ్యవస్థకు సంబంధించిన వంటి అనేక దీర్ఘకాల వ్యాధులకు కారణమవుతుంది. కాబట్టి ఆహార భద్రతను నిర్ధారించడం అనేది సంబంధిత అధికారుల బాధ్యత. ఆహార పదార్థాల నాణ్యతకై క్రమం తప్పకుండా తనిఖీచేయడం వలన కొంతవరకైనా మార్పు తీసుకురావచ్చు. కల్తీ ఆహార పదార్థాలు నిత్యం మార్కెట్‌లోకి వస్తున్నాయి. వివిధ పదార్థాల తయారీలో కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా తయారీ తేదీ, చివరి తేదీ లేకుండానే మార్కెట్‌లో అమ్ముతున్నారు. నేడు జీవ నదులైన గోదావరి, తుంగభద్ర, కృష్ణ, కావేరి వంటి నదులు వ్యర్థాలతో నిండిపోయాయి. అదే నీరును శుద్ధిచేసి త్రాగునీరుగా వాడుతున్నాము. పెద్దపెద్ద ఫ్యాక్టరీల నుండి వచ్చిన వ్యర్థాలను నదులలో కలుపుతున్నారు. అలా కలువకుండా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

ఎక్కువ మొత్తంలో కలుషిత నీటిని వ్యవసాయానికి వాడుతున్నారు. దీంతో పంట దిగుబడి తగ్గడమే కాకుండా నాణ్యత కోల్పోతుంది. సముద్ర తీరాల వెంట కూడా సందర్శకులు వాడిన కవర్లు, వ్యర్థ పదార్థాలు ఎక్కడ అంటే అక్కడ వేస్తున్నారు. నదులు, సముద్రాలలో ఉండే జీవరాశులు సైతం కలుషిత నీటికి మృత్యువాత పడుతున్నాయి. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని మనవంతుగా సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ కవర్లు వాడకుండా స్వదేశీయులు తయారుచేసిన బట్ట సంచులను ఉపయోగిస్తూ చేతి వృత్తుల వారు తయారు చేస్తున్న మట్టి పాత్రలు, వెదురు బుట్టలు వాడు తూ వారి ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహిస్తూ పర్యావరణాన్ని పరిరక్షి ద్దాం. ఆనాడు గాంధీ చెప్పినట్లు స్వదేశీ వస్తువులను మాత్రమే ఉపయోగిద్దాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కలుషితం, కల్తీపై నియంత్రణకు కఠినమైన నిబంధనలు తీసుకువచ్చి సమర్థవంతంగా అమలు చేసినప్పుడే కొంత వరకైన నియంత్రించి సకల జీవరాసులను కాపాడగలము.

మిద్దె సురేష్, 9701209355

## ఈ జిఓలు 'రూల్ ఆఫ్ రిజర్వేషన్'కు అనుకూలమా? ప్రతికూలమా?

ఉద్యోగ నియామక ప్రక్రియలో భాగంగా రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అమలు చేయడానికి వీలుగా ప్రభుత్వాలు జిఓ లను విడుదల చేయడం పరిపాటి. అవే జిఓలు రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే న్యాయస్థానాలు జోక్యం చేసుకొని వాటిని రద్దుచేసి రాజ్యాంగ పరిరక్షకులుగా నిలుస్తున్నాయి. గ్రూప్–1 నియామక ప్రక్రియలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ 29తో పాటు వికలాంగుల రిజర్వేషన్ల అమలుకు తెచ్చిన జిఓ 96లు వివాదాస్పదంగా మారాయి. అట్లే గత ప్రభుత్వం ఎస్‌టి రిజర్వేషన్ల పెంపు విషయంలో తీసుకువచ్చిన జిఓ130పై కూడా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయబడింది. జిఓ 29, 96 విషయంలో విచారణ చేపట్టిన హైకోర్టు పూర్తిస్థాయిలో సమగ్ర పరిశీలన చేయకుండానే ఆలస్యం అనే కారణంతో ఆ పిటిషన్లను కొట్టివేయడం విస్మయాన్ని కలిగిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా ఇప్పటికే జిఓ130 మీద వెలువడాల్సిన ఏదో ఒక తీర్పు వాయిదాలపర్వంగా మారిందని రాజ్యాంగ నిపుణులు పెదవి విరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ జిఓల రాజ్యాంగ నిబద్ధతను పరిశీలిద్దాం!

2022లో వేసిన గ్రూప్–1 నోటిఫికేషన్‌లో రిజర్వేషన్ల వారీగా కేటాయింపు చేయబడ్డ పోస్టులను భర్తీ చేయుటకు జిఓ 55 తెచ్చారు. వివిధ అనివార్య కారణాలవల్ల ఆ నోటిఫికేషన్‌ను రద్దుచేసి 2024 ఫిబ్రవరిలో కొత్త నోటిఫికేషన్ ఇచ్చారు. దానిలో పేర్కొన్న జిఓ 29 ద్వారా ప్రిలిమ్స్ స్థాయిలో రిజర్వేషన్లను పాటించకుండా కేటాయింపు చేయబడ్డ పోస్టులకు తగిన అభ్యర్థులు లేనప్పుడు ఆయా రిజర్వేషన్ అభ్యర్థులను అదనంగా మెయిన్స్‌కు ఎంపిక చేశారు. అంటే ఓపెన్ కేటగిరీలో అర్హత సాధించిన రిజర్వేషన్ అభ్యర్థులు ఓపెన్ కేటగిరి అభ్యర్థులుగా కాకుండా రిజర్వేషన్ అభ్యర్థులుగానే పరిగణించబడ్డారు. కానీ సౌరవ్ యాదవ్ కేసులో కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఇది చెల్లుబాటు కాదు. కానీ ప్రభుత్వ వర్గాలు మాత్రం చివరి ఎంపిక ప్రక్రియలోనే రిజర్వేషన్లను పాటిస్తామని కోర్టుకు విన్నవిస్తూ రావడం జరిగింది. అన్ని స్థాయిలలో రిజర్వేషన్లను అమలు చేయాలని దీపేందర్ యాదవ్ కేసులో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. దీని ప్రకారం ప్రభుత్వ వాదనను నిర్ద్వందంగా తోసిపుచ్చవచ్చు. కానీ ఇవేవీ పరిశీలించని హైకోర్టు డివిజన్ బెంచ్ జిఓ 29 మీద దాఖలైన వివిధ పిటిషన్లను కొట్టివేసింది. దీంతో ఆ జిఓ 29 వివాదం ఇప్పుడు మళ్లీ సుప్రీంకోర్టుకు చేరింది. అత్యున్నత న్యాయస్థానం అందులోనూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనానికి వెళుతుండడం వల్ల ఈ కేసు ప్రాధాన్యతను సంతరించుకున్నది. సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు దేశవ్యాప్తంగా వర్తించడమే కాకుండా రిజర్వేషన్ ప్రక్రియపైన పెను ప్రభావాన్ని చూపనున్నదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

మహిళా రిజర్వేషన్లతో పాటు స్పోర్ట్స్, వికలాంగుల కోటాలను కూడా హారిజాంటల్‌గానే భర్తీ చేయాలని 2007 లో రాజేష్ కుమార్ దారియ కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. తెలంగాణ ప్రభుత్వం వివిధ ఉద్యోగాల భర్తీలో భాగంగా వికలాంగుల కోటాను అమలుపరిచే ఉద్దేశంతో జిఓ 96 తెచ్చింది. దీని ప్రకారం, వికలాంగుల కోటా భర్తీ విధానం హారిజాంటల్‌గా కాకుండా వర్టికల్‌గా ఉన్నది. ఇది సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా ఉన్నది. ఇట్టి విషయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ సైతం హైకోర్టు డివిజన్ బెంచ్‌లో డిస్మిస్ కావడంలో ఆంతర్యం ఏమిటని న్యాయ నిపుణులు ఇతరులు ప్రశ్నిస్తున్నారు. 2022లో వెలువడ్డ అన్ని నోటిఫికేషన్లలో మహిళా రిజర్వేషన్లను కూడా వర్టికల్ గానే ఇచ్చినప్పటికీ రాజేష్ కుమార్ దారియా కేసులో ఇచ్చిన తీర్పు మేరకు ఆ రిజర్వేషన్లను వర్టికల్‌గా కాకుండా హారిజంటల్‌గా మార్చారు. అదే సమయంలో వికలాంగుల కోటాను కూడా హారిజంటల్ గానే భర్తీ చేయవలసి ఉన్ననూ జిఓ 96 ద్వారా వర్టికల్ విధానంలోనే అమలుపరుస్తున్నారు.

ఇక ఎస్‌టి రిజర్వేషన్ పెంపుకొరకు తెచ్చిన జిఓ 130 కూడా వివాదాస్పదంగా మారింది. ఎస్‌టి రిజర్వేషన్ పెంపు ప్రక్రియ పార్లమెంటు సవరణ అనంతరం రాష్ట్రపతి ఉత్తర్వులు వెలువడ్డ తరువాత మాత్రమే అమలుకు నోచుకుంటుంది. అంతేకాకుండా ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు సామాజిక రిజర్వేషన్లు 50% దాటకూడదనేది నిబంధన. 6% నుండి 10% కు ఎస్‌టి రిజర్వేషన్‌ను పెంచడం ద్వారా 50% కోటా దాటుతున్నది. రిజర్వేషన్ పెంపు ప్రక్రియ అనేది జిఓ ద్వారా సాధ్యం కాదనేది అటు రాజ్యాంగ నిపుణులు, ఇటు న్యాయ కోవిదులు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిఓ 130మీద దాఖలైన పిటిషన్‌ను శీఘ్రగతిన తేల్చాల్సిన ఆవశ్యకత ఉన్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు. హైకోర్టులో దాఖలైన ఈ పిటిషన్ దాదాపు సంవత్సరకాలం పాటు వాయిదాలతో సాగిపోతూనే ఉన్నది. ఇలాంటి సున్నితమైన కేసుల విషయంలో సుప్రీంకోర్టు వెలువర్చిన తీర్పులను పరిశీలించడంతోపాటు, రాజ్యాంగ నిపుణుల సలహాలను తీసుకొని సత్వరమే పరిష్కారం చూపాలని అభ్యర్థులు ఆశిస్తున్నారు.

పైన పేర్కొన్న జిఓలపై దాఖలైన పలు పిటిషన్లను కోర్టులు సాధ్యమైనంత త్వరగా పరిశీలించి సమగ్ర అధ్యయనం చేసి 'రూల్ ఆఫ్ రిజర్వేషన్'కు అనుకూలంగా ఉన్నాయా?లేక ప్రతికూలంగా ఉన్నాయా? అనే విషయాన్ని తేల్చుతూ విరుద్ధంగా ఉన్న వాటిని కొట్టివేసి రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ ప్రక్రియను రక్షించాలని కోరుతున్నారు. ఆ గురుతర బాధ్యత న్యాయస్థానాలపై ఉన్నదని, సామాన్యునికి సైతం న్యాయవ్యవస్థ బాసటగా నిలుస్తూ విశ్వాసాన్ని పాదుగొలుపుతుందని అటు ఉద్యోగార్థులు, ఇటు న్యాయ నిపుణులు రాజ్యాంగ పరిరక్షకులు ఆశిస్తున్నారు.

భాస్కర్ యలకంటి, సోషల్ ఎనలిస్ట్
891946488

## ప్రవాస భారతీయులే... దేశానికి పట్టుగొమ్మలు

ఏ దేశమేగినా ఎందుకాలిడినా ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా పొగడరా నీ తల్లి భూమి భారతిని/నిలుపరా నీ జాతి నిండు గౌరవము అని రాయప్రోలు సుబ్బారావు గారు అన్నట్లు ఏ దేశంలో పనిచేసినా మాతృభూమిని మరువకుండా దేశ అభివృద్ధిలో భాగస్వాములగుటకు ఈ ప్రవాస భారతీయ దినోత్సవాన్ని జరుపుకోవడం విశేషం. భారతదేశంలో పుట్టి విదేశాలకు వెళ్లి స్థిరపడిన వారు వారి యొక్క వారసులను ప్రవాస భారతీయులు అంటారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి పెట్టాలనే సదుద్దేశ్యంతో మహాత్మాగాంధీ 1915, జనవరి 9న భారతదేశానికి తిరిగి వచ్చిన రోజును ప్రవాస భారతీయ దినోత్సవంగా జరుపుతున్నారు.

ప్రవాస భారతీయులు అనగానే... సత్యనాదెళ్ల, సుందర్ పిచాయ్... లాంటి పేర్లే ఎక్కువగా వినిపిస్తాయి. కానీ వాళ్లే కాదు, ప్రపంచమంతా విస్తరించారు మనవాళ్లు. కొన్నిచోట్ల ఆర్థిక రంగానికి ఆయువుపట్టుగా నిలిస్తే... ఇంకొన్ని దేశాల్లో రాజకీయాల్ని శాసించే స్థితిలో ఉన్నారు. ఎక్కడ ఉన్నా, ఏ స్థాయిలో ఉన్నా మన సంస్కృతీ, సంప్రదాయాల్నీ ఎలుగెత్తి చాటుతూనే ఉన్నారు. భారతీయ విదేశాంగ మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం 2020నాటికి విదేశాల్లోని ప్రవాస భారతీయులు, భారతీయ మూలాలున్న వారి సంఖ్య మొత్తం 3.2 కోట్లు. ఇందులో భారతీయ పౌరసత్వం ఉన్నవారు దాదాపు 1.4కో ట్లు, భారతీయ సంతతి వారు 1.8 కోట్లు. ఐరాస లెక్కల ప్రకారం ప్రపంచంలో ఇప్పటివరకూ అత్యధికంగా వలస వెళ్లింది భారతీయులే.

రిషి సునాక్ (బ్రిటన్ ప్రధాని), అంటోనియ కోస్టా (పోర్చుగల్ ప్రధాని), మహ్మద్ ఇర్ఫాన్ అలీ (గయానా ప్రెసిడెంట్), పృథ్వీరాజ్ రూపన్ (మారిషస్ అధ్యక్షులు), చంద్రిక పెర్సద్ శాన్ టోఖి (సురినామ్ ప్రెసిడెంట్)లతోపాటు 200 మందికి పైగా భారతీయులు 15 దేశాల్లో వివిధ హోదాల్లో ప్రజాసేవలో ఉన్నారు. వీరంతా అమెరికా, యుకె, కెనడా, గయానా, సురినామ్, ఫిజీ, ట్రినిడాడ్ అండ్ టుబాగో, సింగపూర్, మారిషస్, పోర్చుగల్, దక్షిణాఫ్రికా, మలేసియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో పనిచేస్తున్నారు. వీరు కాకుండా వివిధ దేశాల్లో, కేంద్ర, రాష్ట్ర చట్టసభల్లో సభ్యులుగా ఉన్నవారు చాలామందే ఉన్నారు. గతంలో సింగపూర్ ప్రెసిడెంట్‌గా ఉన్న ఎస్.ఆర్.నాథన్, దేవన్ నాయర్‌లు, ఫిజీ ప్రధానిగా పనిచేసిన మహేంద్ర చౌదరి, మలేసియా ప్రధానిగా పనిచేసిన మహతీర్ బిన్ మహ్మద్ వంటి వారు భారతీయ మూలాలున్నవారే.

స్వాతంత్ర్యానంతరం ప్రపంచ కలల దేశమైన అమెరికాకు భారతీయ వలసలు ప్రారంభమై, నేడు సుమారు 45 లక్షల మంది ఆ గడ్డపై తమవంతు పాత్ర నిర్వహిస్తున్నారు. 10 దేశాల్లో భారతీయుల జనాభా 10లక్షలు దాటితే మరో 22 దేశాల్లో లక్షకు పైగా వున్నారు. డర్బన్ నగరాన్ని మినీ ఇండియాగా అభివర్ణిస్తారంటే ఆ నగరంలో భారతీయుల హవాని అర్థం చేసుకోవచ్చు. ప్రతి సంవత్సరం 25 లక్షలమంది భారతీయులు విదేశాలకు వలస వెళుతున్నారు. భారతీయ వలసల్లో ఇదే పంథా కొనసాగితే ఈ శతాబ్దం అంతానికి భారతీయ పరిమళాలు ధరణి అంతా మరింత వ్యాపించి రవి అస్తమించని 'భారతీయం' సాక్షాత్కరిస్తుంది.

ప్రవాసీ భారతీయ దివస్ కన్వెన్షన్ యొక్క 18వ ఎడిషన్ జనవరి 8 నుండి 10, 2025 వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరుగుతుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటనలో పేర్కొంది. 'అభివృద్ధి చెందిన భారతదేశానికి డయాస్పోరా సహకారం' అనే థీమ్ తో ఈ సంవత్సరం సమావేశాలు కొనసాగనున్నాయి. విదేశాలలో స్థిరపడ్డ భారతీయులు వారి వారసులు తన మాతృదేశానికి, పుట్టిన ఊరికి ఇప్పటికే అనేక రూపాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం వీరిని ప్రోత్సహిస్తూ ఇంకా ఎక్కువ మందిని ఆహ్వానిస్తుందని ఆశిద్దాం...

(నేడు ప్రవాస భారతీయుల దినోత్సవం)

ఎవి. సుధాకర్
రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)

## ఢిల్లీలో సిఎం, పిఎం

# నివాసాల వద్ద హైడ్రామా



**న్యూఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధికారిక నివాసంగా వినియోగించుకున్న ఢిల్లీలోని 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లో ఉన్న ప్రభుత్వం భవనం వద్ద హైడ్రామా నెలకొంది. ఆ భవనంలోకి ప్రవేశించేందుకు ఆప్ నేతలు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ప్రధాని అధికారిక నివాసమైన లోక్ కల్యాణ్ మార్గ్‌కు చేరుకునేందుకు ప్రయత్నించగా మరోసారి పోలీసులు వారిని అడ్డగించారు. దీంతో ఆప్ నాయకులు ధర్నాకు దిగారు. అయితే ఆప్ నాయకులకు పోటీగా ముఖ్యమంత్రి ఆతిశీకి ఇప్పటికే ప్రభుత్వ నివాసాన్ని కేటాయించారని, మరో ప్రత్యేక బంగ్లా ఎందుకని బిజెపి నేతలు ప్రశ్నిస్తూ మీడియాను తీసుకుని ఎబి 17 మథురా రోడ్‌లో ఉన్న సిఎం బంగ్లాకు ఆ పార్టీ నాయకులు చేరుకున్నారు. కాగా, ఫ్లాగ్‌సాఫ్ట్ బంగ్లాలోకి వెళ్లేందుకు అనుమతించకపోవడంతో భవనం వెలుపల ఆప్ నేతలు సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్‌లు ధర్నాకు దిగారు. ఈ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాలమేడ) అంటూ బిజెపి చేస్తున్న విమర్శలకు కౌంటర్‌గా నిజాన్ని చూపిస్తామంటూ మీడియాను భవనం వద్దకు రావాలని ఆప్ నేతలు మీడియాను ఆహ్వానించారు. అయితే భవనం లోపలికి వెళ్లకుండా అప్ నేతలను అడ్డుకునేందుకు పోలీసులు పెద్ద ఎత్తున బారికేడ్లను ఏర్పాటు చేయడంతో పాటు, భారీగా పోలీసులను మోహరింపజేశారు. ఆ తరువాత వారు ప్రధాని నివాసానికి వెళ్లగా అక్కడ కూడా అడ్డుకున్నారు. దీంతో తగ్లక్ రోడ్ పోలీస్ స్టేషన్ సమీపంలోపే ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆప్ నేతలు మాట్లాడుతూ ప్రధాని నివాసాన్ని తనిఖీ చేయాలన్న సవాల్‌ను ఎదుర్కోకుండా బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పారిపోయిందని ఆరోపించారు. నేడు యావత్ దేశానికి బిజెపి అబద్ధాలు బహిర్గతమయ్యాయని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి నివాసంలో మినీ బార్, స్విమ్మింగ్‌పూల్, బంగారంతో చేసిన కమోడ్ ఉన్నాయంటూ బిజెపి పేర్కొంటోందని, ఈ నేపథ్యంలో నిజాలను ప్రజలకు చూపించేందుకు తాము అక్కడికి వెళ్లితే తమను పోలీసులు అడ్డుకున్నారన్నారు. అదే విధంగా రూ. 2700 కోట్లతో నిర్మించిన ప్రధాని మోదీ నివాసంలో ఉన్న వాస్తవాలను బయటపెట్టేందుకు తాము ప్రయత్నిస్తుంటే తమను అడ్డుకుంటున్నారనిసంజయ్ పేర్కొన్నారు. సింగ్ అంతకు ముందు మీడియాతో మాట్లాడుతుండగా, భవనంలోకి ప్రవేశించేందుకు అనుమతి తీసుకున్నారా అని ప్రశ్నించగా, ముఖ్యమంత్రి భవనంలోకి వెళ్లేందుకు ఎందుకు అనుమతి తీసుకోవాలని ప్రశ్నించారు. 'మమ్మల్ని ఆపమని మీకు ఎవరు ఆదేశాలు ఇచ్చారు? నేను మంత్రిని. నేను తనిఖీ కోసం వచ్చాను. మీరు నన్ను ఎలా ఆపగలరు. ఎవరి ఆదేశాల మేరకు మీరు? లెఫ్టినెంట్ గవర్నర్ నుండి మీకు ఆదేశాలు వచ్చాయా? అని భరద్వాజ అధికారులను ప్రశ్నించారు. అంతకుముందు విలేకరుల సమావేశంలో భరద్వాజ్ మాట్లాడుతూ, వాగ్దానం చేసినట్లుగా, తాము 6, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని ముఖ్యమంత్రి అధికారిక నివాసాన్ని ఉదయం 11 గంటలకు సందర్శించి, బిజెపి చెబుతున్న బంగారు కమోడ్ స్విమ్మింగ్ పూల్, మినీ బార్‌ను కనుగొనడానికి ప్రయత్నిస్తామన్నారు.

# కోర్టు అభిప్రాయం వర్సెస్ శాసనాధికారం

**2023 చట్టం కింద ప్రధాన ఎన్నికల కమిషర్, ఇసిల ఎంపికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై 'సుప్రీం' వ్యాఖ్య**

**కేసులో ఎన్‌జిఒ తరపున వాదనలు**

**తదుపరి విచారణ ఫిబ్రవరి 4కు వాయిదా**




**న్యూఢిల్లీ :** 2023 చట్టం ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను బుధవారం సుప్రీంకోర్టు ఫిబ్రవరి 4కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, దీపాంకర్ దత్తా, ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం దీనిపై స్పందిస్తూ చట్టాన్ని రూపొందించే శాసనాధికారానికి వ్యతిరేకంగా ఇది కోర్టు అభిప్రాయమని ధర్మాసనం తెలిపింది. ఈ త్రిసభ్య ధర్మాసనానికి ఎన్‌జిఓ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తెలియజేశారు. కోర్టు జోక్యం చేసుకోని పక్షంలో కొత్త ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి)ను కొత్త చట్టం ప్రకారం నియమిస్తారు. ప్రస్తుతం ఉన్న ప్రధాన ఎన్నికల కమిషనర్ ఫిబ్రవరి 18న పదవీవిరమణ చేయనున్న విషయం తెలిసిందే. మార్చి 2, 20 23నాటి తీర్పులో అత్యున్నత న్యాయస్థానం ప్రధానమంత్రి, ప్రతిపక్షనాయకుడు, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా (సిజెఐ)లతో కూడిన కమిటీని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి)ను, ఎన్నికల కమిషనర్లను (ఇసి)నియమించేందుకు ఏర్పాటుచేసిందని ప్రశాంత్ భూషణ్ వివరించారు.'కొత్త చట్టం ప్రకారం ఎలక్షన్ కమిటీలో ప్రధానమంత్రి, కేంద్ర కేబినెట్ మంత్రి, ప్రతిపక్షనాయకుడు లేదా లోక్‌సభలో అతిపెద్ద పార్టీకి చెందిన ప్రతిపక్షనాయకుడు ఉంటారు. వారు సెలక్షన్ కమిటీ నుండి చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా (సిజెఐ)ను తొలగించారు' అని ప్రశాంత్ భూషణ్ చెప్పారు. అనంతరం ధర్మాసనం తదుపరి విచారణను ఫిబ్రవరి 4కు పోస్టింగ్ చేసింది. బెంచ్ మాట్లాడుతూ ఎవరి అభిప్రాయాలు ఆధిపత్యంగా ఉన్నాయో పరిశీలిస్తామని చెప్పింది.'చట్టాన్ని రూపొందించడానికి శాసనాధికారం, ఆర్టికల్ 141ప్రకారం ఇది న్యాయస్థానం అభిప్రాయం' అని ధర్మాసనం నొక్కిచెప్పింది. పిటిషనర్లలో ఒకరి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం 2023 మార్చి 2నాటి జడ్జిమెంట్ ప్రాతిపదికన తొలగించలేదని , కొత్త చట్టాన్ని రూపొందించిందని ధర్మాసనానికి విన్నవించారు. ఎన్నికల కమిషనర్ల నియామకం ప్రజాస్వామ్యానికి ముప్పుగా ప్రభుత్వం నియంత్రించలేకపోయిందని ప్రశాంత్‌భూషణ్ అన్నారు. '2023 మార్చి 2 సుప్రీంకోర్టు ఏర్పాటుచేయాలని సూచించిన సెలక్షన్ కమిటీ నుండి చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాను తొలగించలేదని మేం భావిస్తున్నాం' అని ప్రశాంత్ భూషణ్ ధర్మాసనానికి తెలియజేశారు. శంకర్ నారాయణన్ మాట్లాడుతూ కేంద్రానికి దొరికిన ఏకైక మార్గం తీర్పు చుట్టూ రాజ్యాంగాన్ని సవరించడం, చట్టాన్ని అమలుచేయడం లేదని చెప్పారు. ప్రశాంత్‌భూషణ్, శంకర్‌నారాయణన్‌లను ఉద్దేశించి ధర్మాసనం మాట్లాడుతూ ఈ విషయాన్ని మరుసటి రోజున విచారణ చేపట్టేందుకు జడ్జిలకు ఫిబ్రవరి3న గుర్తు చేయాలని సూచించింది. 2023చట్టం ప్రకారం కొత్త ఎన్నికల కమిషనర్ల నియామకాలపై 'స్టే' ఇవ్వడానికి సుప్రీంకోర్టు మార్చి 15, 2024న నిరాకరించింది.ఇది చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా(సిజెఐ)ను సెలక్షన్ ప్యానెల్ నుండి మినహాయించింది. నియామకాలను సవాల్‌చేస్తూ దాఖలైన ఒక బ్యాచ్‌పై విచారణను వాయిదా వేసింది. ప్రధానమంత్రి, ప్రతిపక్షనేత, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాతో కూడిన త్రిసభ్య కమిటీని పార్లమెంట్ చట్టం చేసే వరకూ పనిచేయాలని 2023 మార్చి 2నాటి తీర్పును పిటీషనర్లకు సుప్రీంకోర్టు తెలిపింది. పిటిషనర్ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) తరపున హాజరైన ప్రశాంత్ భూషణ్ సిజెఐ మినహాయింపును సవాల్ చేశారు. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యాన్ని కొనసాగించడానికి ఎన్నికల కమిషన్ 'రాజకీయ', కార్యనిర్వాహక జోక్యం' నుండి నిరోధించబడాలని ప్రశాంత్ భూషణ్ వాదించారు. మార్చి 2, 2023న రాజ్యాంగ ధర్మాసనం ఇలా తీర్పునిచ్చింది. ప్రధాన ఎన్నికల కమిషన్, ఎన్నికల కమిషనర్లనియామకాలకు సంబంధించినంతవరకూ అదే భారత రాష్ట్రపతిచేత చేయబడుతుంది. భారత ప్రధానమంత్రి, ఈకేసులో ప్రతిపక్షనాయకుడు, లోక్‌సభలో అతిపెద్ద పార్టీ నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ఇచ్చిన సలహాపై నియామకం చేయబడుతుంది. పార్లమెంట్ చట్టం చేసేంతవరకూ ఈ కట్టుబాటు అలాగే కొనసాగుతుంది. అది మరింత కొనసాగుతుంది అని శంకర్‌నారాయణన్ వెల్లడించారు.

## 'ఆప్'కు మమత మద్దతు..

### కృతజ్ఞతలు చెప్పిన కేజ్రీవాల్



**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీ (ఆప్)కు మమతా బెనర్జీ సారథ్యంలోని టిఎంసి మద్దతు తెలిపింది. ఇప్పటికే ఆప్‌కు మద్దతిస్తున్నట్లు సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ప్రకటించిన నేపథ్యంలో టిఎంసి మద్దతు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిపై సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మమతాబెనర్జీకి కేజ్రీవాల్ కృతజ్ఞతలు తెలిపారు. 'ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌కు మద్దతిస్తున్నట్టు టిఎంసి ప్రకటించింది. మమతా దీదీకి వ్యక్తిగతంగా నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. థాంక్యూ దీదీ.. మేము బాగున్నప్పుడు, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడూ కూడా మీరు మా వెన్నంటే ఉండి ఆశీర్వదిస్తున్నారు' అని కేజ్రీవాల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఆయన ట్వీట్‌కు టిఎంసి ఎంపి డెరిక్ ఒబ్రెయిన్ వెంటనే 'ఎక్స్'లో స్పందించారు. మేము మీకు బాసటగా ఉంటామంటూ ఆ ట్వీట్‌లో ఒబ్రెయిన్ హామీ ఇచ్చారు. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఆప్ పొత్తుపెట్టుకున్నప్పటికీ ఆ తర్వాత జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఒంటరిగా పోటీ చేసింది. తాజాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఒంటరిగానే పోటీ చేస్తున్నట్టు ఆప్ మొదట్లోనే ప్రకటించింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడతాయి.

# రూ.25లక్షల ఆరోగ్య బీమా

**ఢిల్లీలో 'జీవన్ రక్ష యోజన' పథకాన్ని అమలు చేస్తాం**

**ఎన్నికల వేళ ప్రజలకు కాంగ్రెస్ హామీల వర్షం**




**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో రాజకీయ పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. అందులో భాగంగా కాంగ్రెస్ ఢిల్లీ వాసులకు కాంగ్రెస్ హామీల వర్షం కురిపించింది. తమ పార్టీ అధికారంలోకి వస్తే రూ. 25 లక్షల రూపాయల ఉచిత ఆరోగ్య బీమా కోసం 'జీవన్ రక్ష యోజన' పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ప్రతిపాదిత పథకం గేమ్ ఛేంజర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ అని అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు పెరుగుతున్నాయని, ఇది దేశానికి కూడా అవసరమని ఆయన అన్నారు. ఢిల్లీ నివాసితుల ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీర్చడంలో పార్టీ నిబద్ధతను ప్రతిపాదిత పథకం ప్రతిబింబిస్తుందని గెహ్లాట్ చెప్పారు. పార్టీ ప్రచార నినాదం 'హోగీ హర్ జరూరత్ పూరీ, కాంగ్రెస్ హై జరూరీ' ప్రకటన సమయం లో ప్రముఖంగా ప్రదర్శించగా, అందరికీ అవసరమైన సేవలను అందజేస్తామని కాంగ్రెస్ భరోసానిచ్చింది. ప్రతిపాదిత పథకం కుటుంబాలకు సమగ్ర ఆరోగ్య సేవలు అందించడం, క్లిష్టమైన అనారోగ్యాలు, ఆసుపత్రిలో చేరడం, చికిత్సల కోసం వైద్య ఖర్చులను భరించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు గెహ్లాట్ చెప్పారు. ఇప్పటి వరకు ఈ దేశాన్ని సమైక్యంగా ఉంచిన పార్టీ కాంగ్రెస్ అని, అన్నికులాలు, మతాలను కాంగ్రెస్ కలుపుకొని ముందుకెళ్తుందన్నారు. ఈ ఆరోగ్య పథకం రాజస్థాన్‌లోచాలా విజయవంతమైందని, ఇదిఢిల్లీలో కూడా విజయవంతమవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. 'మీరు పోలరైజేషన్ ద్వారా ఎన్నికల్లో గెలవగలరని నేను నమ్ముతున్నాను. కానీ దేశాన్ని నడిపించడం లేదా అభివృద్ధి చేయలేరు. ఢిల్లీలో కాంగ్రెస్‌ను తిరిగి తీసుకురావడం చాలా ముఖ్యం. షీలా దీక్షిత్ అద్భుతమైన పాలనను, ఆధునిక ఢిల్లీని అందించారు. మేము ఆ శకాన్ని తిరిగి జాతీయ స్థాయిలో తీసుకురావాలనుకుంటున్నాము అని గెహ్లాట్ అన్నారు. రాజస్థాన్‌లో ఈ పథకం విజయవంతం అయిన తర్వాత ఢిల్లీ కి కూడాఇది అవసరమని ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ దేవేందర్ యాదవ్ అన్నారు. 'చిరంజీవి పేరుతో గెహ్లాట్ రాజస్థాన్‌లో ఈ పథకాన్ని ప్రారంభించినందుకు నేను గర్వపడుతున్నాను. అక్కడ అది అద్భుతమైన విజయం సాధించిన తర్వాత, ఇక్కడ ప్రజలకు సరైన చికిత్స పొందేందుకు ఢిల్లీకి కూడా ఇది అవసరమని మేము గ్రహించాము' అని యాదవ్ జోడించారు.సోమవారం, కాంగ్రెస్ 'ప్యారీ దీదీ యోజన'ను ప్రకటించింది. దేశ రాజధానిలో అధికారంలోకి వస్తే మహిళలకు నెలవారీ రూ. 2,500 ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చింది.

## ట్రక్కును ఢీకొట్టిన ఆటో

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురు పాఠశాల విద్యార్థులు సహా నలుగురు మృతి

**రామ్‌గఢ్ :** జార్ఖండ్‌లోని రామ్‌గఢ్ జిల్లాలో బుధవారం ఉదయం బంగాళదుంపలతో కూడిన ట్రక్కును ఆటోరిక్షా ఢీకొనడంతో ముగ్గురు పాఠశాల విద్యార్థులతో సహా కనీసం నలుగురు వ్యక్తులు మరణించారని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులు కూడా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం సదర్ ఆసుపత్రిలో చేర్చినట్లు పోలీసులు తెలిపారు. జార్ఖండ్ రాజధాని రాంచీకి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోలా పోలీస్ స్టేషన్ పరిధిలోని మఘుతాండ్ గ్రామ సమీపంలో ఉదయం 8 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని వారు తెలిపారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు పాఠశాల విద్యార్థులు మృతి చెందగా, వాహనం డ్రైవర్ కూడా మృతి చెందాడని రామ్‌గఢ్ పోలీసు సూపరింటెండెంట్ అజయ్ కుమార్ పిటిఐకి తెలిపారు. ఆటోను ఢీకొట్టడంతో ట్రక్కు బోల్తా పడిందని రామ్‌ఘర్ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్‌డిపిఓ) పరమేశ్వర్ ప్రసాద్ తెలిపారు. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులు కూడా గాయపడ్డారు. వారిని సదర్ ఆసుపత్రిలో చేర్చారు. వారిలో ఒకరిని రాంచీలోని రిమ్స్‌కు తరలించామని సదర్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మృత్యుంజయ్ కుమార్ సింగ్ తెలిపారు. కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, రాష్ట్రంలో తీవ్రమైన చలి పరిస్థితుల దృష్ట్యా జనవరి 13 వరకు పాఠశాలలను మూసివేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ ప్రైవేట్ పాఠశాలలు తెరిచి ఉన్నాయని వారు ఆరోపించారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించిన పాఠశాలపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని రామ్‌గఢ్ డిప్యూటీ కమిషనర్ చందన్ కుమార్ తెలిపారు.

# 'ఇస్రో నూతన ఛైర్మన్'గా రాకెట్ శాస్త్రవేత్త వి.నారాయణన్

**విద్యార్థులకు ఆయన ప్రస్థానం ఎంతో స్ఫూర్తి**

**తమిళనాడు సిఎం స్టాలిన్ సంతోషం వ్యక్తం**

**ఇస్రో కొత్త శిఖరాలకు చేరుకుంటుందని వ్యాఖ్య**



చెన్నై : ప్రముఖ రాకెట్ శాస్త్రవేత్త వి.నారాయణన్‌ను అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నూతన ఛైర్మన్‌గా నియమించారు. ఇస్రోకు ప్రస్తుతం నాయకత్వం వహిస్తున్న ఎస్.సోమనాథ్ నుంచి ఆయన ఈ నెల 14న బాధ్యతలు స్వీకరించనున్నారు. నారాయణన్ రెండేళ్లపాటు ఈ పదవిలో ఉంటారు. ఈ మేరకు కేబినెట్ నియామకాల కమిటీ ఆయన్ను ఇస్రో ఛైర్మన్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. నారాయణన్ ప్రస్తుతం ఇస్రోకు చెందిన లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్ (ఎల్‌పిఎస్‌సి)కు సారథ్యం వహిస్తున్నారు. నారాయణన్‌ను నియమించడం పట్ల బుధవారం తమిళనాడు నాయకుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె.స్టాలిన్, ఆల్ ఇండియా అన్నా ద్రావిడ మున్నేట్ర కజగం (ఎఐడిఎంకె) ప్రధానకార్యదర్శి ఎడప్పడి కె.పళనిస్వామి, ఇతర రాజకీయ పార్టీల నేతలు వి.నారాయణన్ నియామకం పట్ల సంతోషం వ్యక్తంచేస్తూ దక్షిణాది రాష్ట్రానికి చెందిన ఆయనకు ఉన్నత స్థానం దక్కడం ఎంతో ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. స్టాలిన్ తన 'ఎక్స్' పోస్ట్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన నారాయణ్‌కు అత్యున్నతస్థాయి పోస్ట్ దక్కడం చాలా సంతోషదాయకం అన్నారు. రాకెట్ శాస్త్రవేత్త నారాయణన్‌కు ఈ సందర్భంగా తన హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. తమిళనాడులోని కన్యాకుమారి జిల్లాకు చెందిన నారాయణన్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని, ఇస్రోలో నిరాడంబరమైన ఆరంభాన్ని కొనసాగించారని, నాయకత్వస్థానంలోకి చేరుకోవడంలో ఆయన ఉత్సాహాన్ని, కృషిని మెచ్చుకోకుండా ఉండలేమని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. 'దేశానికి ప్రపంచస్థాయి ఖ్యాతిని తెచ్చిపెట్టిన మిషన్లలో నారాయణన్ నేతృత్వంలో ఇస్రో కచ్చితంగా కొత్త శిఖరాలకు చేరుకుంటుంది. చంద్రయాన్2, చంద్రయాన్ 3, ఆదిత్య ఎల్1, గగన్‌యాన్ అనేక అంతరిక్ష కార్యక్రమాలలో సహకరిస్తూనే ఉంది. నారాయణన్ ప్రయాణ ప్రస్థానం తమిళనాడులోని అనేకమంది విద్యార్థులకు సాధకులుగా ఎంతో స్ఫూర్తిని ఇస్తుంది' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. తమిళనాడు రాష్ట్ర ప్రతిపక్షనేత పళనిస్వామి కూడా నారాయణన్‌ను అభినందించారు. 'దేశ అంతరిక్ష పరిశోధనలో నారాయణ్‌ను అత్యున్నత స్థానానికి నియమించడం నిజంగా మన రాష్ట్రానికి గర్వకారణం. మీ నాయకత్వంలో ఇస్రో మరింత విజయాన్ని, కీర్తిని సాధించాలని కోరుకుంటున్నాను' అని ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. పిఎంకె అధ్యక్షులు డాక్టర్ అన్బుమణి రాందాస్, ఎఎంఎంకె నాయకుడు టిటివి.దినకరన్ నారాయణన్‌కు ఉన్నత స్థానం దక్కడంపై అభినందనలు తెలిపారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థలో నారాయణన్ ప్రఖ్యాత శాస్త్రవేత్తగా పేరున్నది. ఆయన అందులో దాదాపు 4దశాబ్దాల అనుభవం గడించారు. అంతేకాదు ఇస్రోలోనే వివిధ కీలకపదవులు నిర్వర్తించిన అనుభవాన్ని కూడా ఆయన సొంతం చేసుకున్నారు.

## అన్నా వర్సిటీ పేరుకు కళంకం తేవడం ఇష్టంలేదు : స్టాలిన్



**చెన్నై :** అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడి జరిగిన ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ అసెంబ్లీ వేదికగా స్పందించారు. ఈ అంశాన్ని అడ్డంపెట్టుకుని కొందరు సభ్యులు మాటిమాటికీ అన్నా యూనివర్సిటీ పేరు ప్రస్తావించడాన్ని ఆయన తప్పుపట్టారు. యూనివర్సిటీలో విద్యార్థినిపై జరిగిన దారుణం ఎవరికీ ఆమోదయోగ్యం కాదని, అది దారుణమని వ్యాఖ్యానించారు. సభలో చాలామంది సభ్యులు ఒక యూనివర్సిటీ పేరును ప్రస్తావిస్తూ మాట్లాడుతున్నారు. కానీ నేను ఆ యూనివర్సిటీ పేరును ప్రస్తావించదల్చుకోలేదు. నేను ఆ పేరుకు కళంకం తేవాలనుకోవడం లేదు. ఎందుకంటే ఈ సభలో ఉన్నవారిలో చాలామందిని తయారు చేసింది ఆయనే. ఆ భావోద్వేగంతో నేను ఆ పేరును పక్కన పెడుతున్నా. చెన్నైలో విద్యార్థినిపై జరిగిన ఘటనను ఎవరూ ఆమోదించరు. విద్యార్థినిపై లైంగిక దాడి క్రూరమైన చర్య' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. 'సభలోని సభ్యులంతా లైంగిక దాడి ఘటనపై మాట్లాడారు. ఒక్కరు తప్ప మిగతా అందరూ నిజమైన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని చెడుగా చూపించడమే ఆ ఒక్క సభ్యుడి పని. కానీ నేను ఒక్కటే చెబుతున్నా. మా ప్రభుత్వం బాధితురాలికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటుంది. నేరం జరిగిన తర్వాత నిందితుడిని అరెస్ట్ చేయకపోయినా, అతడిని కాపాడే ప్రయత్నాలు జరిగినా ప్రభుత్వాన్ని నిందించవచ్చు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసినా, వేగంగా విచారణ చేయిస్తున్నా ప్రభుత్వాన్ని నిందించడమనేది రాజకీయ ప్రయోజనాల కోసమే' అని స్టాలిన్ ఆరోపించారు. అన్నా యూనివర్సిటీలో ఇటీవల 19 ఏళ్ల విద్యార్థినిపై గణశేఖరన్ అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు క్యాంపస్ భవనం వెనుకాల తన స్నేహితుడితో మాట్లాడుతుండగా నిందితుడు చూశాడు. ఆమె స్నేహితుడిని బెదిరించి వెళ్లగొట్టి ఆమెపై లైంగిక దాడి చేశాడు. ఘటనపై విద్యార్థిని తన స్నేహితునితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటికి వచ్చింది. ఈ ఘటన తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది.

## రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స..

**న్యూఢిల్లీ :** కేంద్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక పథకాన్ని ప్రకటించారు. రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు నగదు రహిత చికిత్సను అందించేందుకు ప్రత్యేక పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడితే చికిత్సకు అయ్యే ఖర్చులో గరిష్ఠంగా రూ.1.50 లక్షలు ఈ పథకం ద్వారా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.ఇది మొదటి ఏడు రోజుల చికిత్సకు అయ్యే బిల్లుకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రమాద ఘటన జరిగిన 24 గంటల్లోగా పోలీసులకు సమాచారాన్ని అందిస్తేనే ఈ స్కీం ద్వారా నగదు రహిత చికిత్సను పొందొచ్చని గడ్కరీ స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్నట్లు చెప్పారు. 2025మార్చి నాటికి దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా హిట్ అండ రన్ కేసుల్లో చనిపోయినవారి కుటుంబాలకు రూ.2లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియాను అందిస్తామని గడ్కరీ తెలిపారు. పలురాష్ట్రాల రవాణా శాఖ మంత్రులతో కేంద్ర మంత్రి గడ్కరీ సమావేశమయ్యారు. అనంతరం ఢిల్లీలోని భారత్‌మండపంలో మీడియాతోమాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.2024లోజరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.8 లక్షల మంది చనిపోయారని.. అందులో 30 వేల మంది హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లే మరణించినట్లు తెలిపారు.

# దావాగ్ని బీభత్సంలో 'లాస్'ఏంజెల్స్

**ఇళ్ళు-కార్లు వదిలి సెలబ్రిటీల పరుగులు**

**హాలీవుడ్ షూటింగ్‌ను తలపించిన వాస్తవ దృశ్యాలు**

**స్టేట్ ఆఫ్ ఎమర్జెనీ : 30వేలమంది తరలింపు**



**లాస్‌ఏంజెల్స్ :** ప్రపంచ సంపన్న నగరాలలో ప్రముఖస్థానం వహించే అమెరికా లాస్ ఏంజెల్స్‌లో దావానలం చెలరేగింది. ప్రజలు ముఖ్యంగా సంపన్నవర్గాలు, సెలబ్రిటీలు, హాలీవుడ్ ప్రముఖులు వాహనాలు, ఇళ్ళు వదిలి రోడ్లమీద పరుగులు తీశారు. సురక్షిత ప్రాంతాలను వెతుక్కుంటూ వెళ్ళారు.అంతకంతకూ ఈ దావానలం ఉద్ధృతం అవుతూ ఉండటంతో ప్రభుత్వం లాస్ ఏంజెల్స్‌లో స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ ప్రకటించింది. సుమారు 30,000 మందిని తక్షణం లాస్ ఏంజెల్స్‌ను ఖాళీచేసి వెళ్ళిపోవాలని అగ్నిమాపకదళాధికారి క్రిస్టెన్ క్రాలే చట్టబద్ధ ప్రకటన జారీ చేశారు. వాతావరణ పరిస్థితికి అనుగుణంగా హై ప్రెషర్‌తో శరవేగంగా వీచే ఈ గాలులను 'శాంతా అనా విండ్స్' అని పిలుస్తారు. ఈ గాలులవల్ల దావానలం మరింతగా పేట్రేగింది. ఇప్పటికే 5,000 మంది ఇళ్ళుఖాళీచేసి వెళ్ళిపోయారు. 13,000 పౌర నిర్మాణాలు దావాగ్ని జ్వాలల్లో ఉన్నాయి. ఈ దావాగ్ని లాస్ ఏంజెల్స్ వాయువ్య ప్రాంతానికి మరింతగా విస్తరించే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. లాస్ ఏంజెల్స్‌లో దావాగ్ని బీభత్సం, ప్రజయ హాహాకారాలు, భయాందోళన, ట్రాఫిక్ జామ్‌లు,, వదిలేసిన కార్లను బుల్‌డోజర్లతో ఎత్తి పక్కకు నెట్టేసే యంత్రాంగం, ఎటు వెళ్ళాలో దిక్కుతోచని ప్రజల దుస్థితి...వంటివన్నీ హాలీవుడ్ షూటింగ్ దృశ్యాలను తలపింపజేశాయని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. వీధుల్లో వీల్‌ఛైర్స్‌లో సీనియర్ సిటిజన్లు, ఆసుపత్రి బెడ్లపై రోగులను జాగ్రత్తగా తీసుకువెళుతున్న దృశ్యాలు కనిపించాయి. పెద్దసంఖ్యలో అగ్నిమాపక బృందాలు, సహాయ బృందాలు, ఎమర్జెనీ అధికారులు రంగంలోకి దిగినట్లు కాలిఫోర్నియా సిటీ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ కో-ఆర్డినేటర్ జెన్నిఫర్ కోల్బీ చెప్పారు. ఈశాన్య లాస్‌ఏంజెల్స్ ప్రాంతాన్ని దావాగ్ని చుట్టుముట్టిందని చెప్పారు. మొదట ఈశాన్య లాస్‌ఏంజెల్స్‌లో మంగళవారం సాయంత్రం దావాగ్ని ప్రారంభమైంది. తర్వాత ఫసిఫిక్ పాలిసేడ్స్‌లో మరో దావాగ్ని చెలరేగింది. సైల్మర్ ప్రాంతంలో మూడో దావాగ్ని చెలరేగింది. బుధవారం ఉదయం నాటికి విపరీతమైన గాలుల కారణంగా కార్చిచ్చు భీవావహంగా మారింది. చలనచిత్ర నిర్మాణాలు, షూటింగులు అన్నీ రద్దైపోయాయి. మంగళవారం రాత్రినాటికే 1.67 లక్షలమంది లాస్‌ఏంజెల్స్ కౌంటీలో విద్యుత్ లేకుండా గడిపారు. పది ఎకరాల విస్తీర్ణంలో ప్రారంభమైన దావానలం కొద్ది గంటల్లోనే 2,900 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అడవులు, నివాసిత ప్రాంతాలకు విస్తరించి వాటిని మింగేసింది. గ్రీన్‌విచ్ మీన్ టైమ్ ప్రకారం 10.30 గంటలకు ఈ ప్రకృతి విలయం ప్రారంభమైంది. తమ జీవితంలో ఇలాంటి రోజంటూ ఒకటి వస్తుందని ఏనాడూ ఊహించలేదని కళ్ళెదుట అగ్నికి ఆహుతి అవుతున్న ఇళ్ళను చూస్తూ అనేకమంది కన్నీళ్ళుపెట్టుకున్నారని అంతర్జాతీయ వార్తాసంస్థలు కథనాలు వెలువరించాయి. ఫసిఫిక్ పాలిసేడ్స్ ప్రాంతంలో దావాగ్ని బీభత్సం సృష్టించిన దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో బుధవారంనాడు అతిపెద్దవార్తగా మారింది. సంబంధిత వీడియోలు సోషల్ మీడియాలోకి వచ్చాయి. దేశాధ్యక్షుడు జో బైడెన్ లాస్‌ఏంజల్స్‌లో పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తగిన ఆదేశాలు జారీ చేస్తున్నారు. సహాయ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఫసిఫిక్ పాలిసేడ్స్‌లో ఐదు ఫుట్‌బాల్ గ్రౌండ్స్‌కు సరిపడిన స్థలంలో ఉన్న ప్రాంతాన్ని కార్చిచ్చు ఒక్కనిమిషంలో ఆక్రమించి మంటల్లో ముంచెత్తుతున్నది. కొండ ప్రాంతం కావడంతో విపరీతమైన గాలుల ప్రభావంవల్ల దావానలం శరవేగంగా అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నది. ఇప్పటివరకూ సుమారు 1,000 హెక్టార్ల ప్రాంతం అగ్నికీలల్లో ఆహుతైపోయింది. వేలాదిఇళ్ళు అగ్నిలో దగ్ధమైపోయాయి. ఖరీదైన సెలబ్రిటీల ఇళ్ళు దావానలంలో మాడిమసైపోయాయి. వాహనాలలో వెళ్ళేందుకు కూడా అవకాశం లేకుండా విపరీతంగా రోడ్లన్నీ కిక్కిరిసిపోవడంతో సామాన్యులు, సెలబ్రిటీలు అనే భేదాలు లేకుండా అందరూ కార్లు ఇళ్ళు వదిలి కాలి నడకన, పరుగులు పెడుతూ సురక్షిత ప్రాంతాలకు వెళుతున్నారు. శాంతామోనికా ప్రాంతంలో కార్చిచ్చు భారీగా విస్తరించింది. ఆల్టడెనాలో కూడా రెండోసారి దావానలం వ్యాప్తి చెందుతుందన్న నిపుణుల హెచ్చరికలతో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమై ముందుగానే తగిన ఏర్పాట్లు చేస్తున్నది.

### వీధుల్లో నిలబడిన హాలీవుడ్ సెలబ్రిటీలు

లాస్ ఏంజెల్స్‌లో దావాగ్ని పుణ్యమా అని హాలీవుడ్ నటులు, సెలబ్రిటీలు పలువురు వీధుల్లో నిలబడ్డారు. సినిమా షూటింగులు కూడా రద్దయ్యాయి. కెనడా నటుడు, ప్రముఖ హాస్యనటుడు యూజీన్ లెవీ తన ఇంటిని వదిలి వీధుల్లోకి పారిపోయి వచ్చారు. ఇలాంటి పరిస్థితిని తాను ఊహించలేదన్నారు. తమ నివాసానికి దగ్గరగా దట్టంగా నల్లటి పొగలు కమ్ముకున్నాయనీ, కానీ తాను కణకణమండే అగ్నిజ్వాలలను చూడలేదని చెప్పారు. పోలీస్ అకాడమీ స్టార్ గుటెన్‌బర్గ్ కూడా వీధుల పాలయ్యారు. ఐతే ఆయన సహాయ బృందాలతో కలిసి సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. హెడీ మోటంగ్, ఎస్ ప్రాట్, టామ్ హాంక్స్, జెన్నిఫర్ అనిస్టోన్, రీస్ విథర్‌స్పూన్, బాస్కెట్‌బాల్ స్టార్ కవ్హీ లియోనార్డ్, జేమ్స్ వుడ్ తదితర ప్రముఖులు కూడా ఇళ్ళువదిలి వీధినపడ్డారు. హాలీవుడ్ స్టార్, అమెరికా నటుడు జేమ్స్‌వుడ్ (77) ఎక్స్ వేదికగా స్పందిస్తూ, తనకు ఎంతో ప్రీతిపాత్రమైన ఇంటిని వదిలిపెట్టి తాను బయటకు వచ్చేశానని పోస్టింగ్ పెట్టారు. స్టార్‌వార్స్ చిత్రాల్లో నటించి పేరు ప్రతిష్టలు పొందిన మార్క్ హామిల్ ఇన్‌స్టాగ్రామ్‌వేదికగా స్పందించారు. 1993 తర్వాత ఇంత దారుణమైన భీతావహ దావాలనాన్ని తాను చూడలేదని ఆయన రాశారు. తన ఇల్లు ఉన్న వీధిలో రోడ్డుకు ఇరువైపులా మంటలు చెలరేగడంతో ఎట్టకేలకు తాను విధిలేక ఆఖరి నిమిషంలో ఇంటిని ఖాళీచేశానని ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. అనేక హాలీవుడ్ ప్రీమియర్లను రద్దు చేశారు. రాబీ విలియమ్స్ బయోపిక్ బెటర్ మేన్ ప్రీమియర్‌నుఈ కార్చిచ్చు వల్ల రద్దుచేశారు. అన్‌స్టాపబుల్, ఉల్ఫ్‌మేన్ వంటి ప్రీమియర్లను కూడా రద్దుచేశారు.



## చిన్నారులకు పోషకాహారం అందిస్తే..
# ఉజ్వాల భవిష్యత్తు

### గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలలో మెరుగైన సేవలు అందించండి
### ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క

ప్రజాపక్షం / హైదరాబాద్

గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు రాష్ట్రంలో కోట్లాది మంది జీవితాలతో ముడిపడి ఉన్నాయని, ఈ శాఖల ద్వారా మెరుగైన సేవలు రాష్ట్ర ప్రజలకు అందాలని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో బుధవారం జరిగిన ప్రీబడ్జెట్ సమావేశంలో ఈ శాఖలకు సంబంధించి వారు పలు అంశాలను చర్చించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నతనంలోనే మంచి పోషక ఆహారాన్ని అందించడం ద్వారా వారికి ఉజ్వలమైన భవిష్యత్తును ప్రసాదించే అవకాశం ఉంటుందని, వారిపై పెట్టే పెట్టుబడి రాష్ట్ర భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని డిప్యూటీ సిఎం తెలిపారు. జువైనల్ హోమ్స్‌లోని పిల్లల మానసిక పరిపక్వతకు క్రీడలు దోహదం చేస్తాయని, ఇందుకుగాను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నుంచి స్పోర్ట్స్ కిట్స్ అందిస్తామని డిప్యూటీ సిఎం సంబంధిత అధికారులకు తెలిపారు. శిశు విహార్‌లో ప్రస్తుతం ఉన్న శిశువుల సంఖ్య, వారికి అందుతున్న సౌకర్యాలు, వైద్య సహాయం తదితర అంశాలపై మంత్రులు సమ్మె అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఉన్న మహిళా ప్రాంగణాల పరిస్థితిపై డిప్యూటీ సిఎం, మంత్రి సీతక్క ఆరా తీశారు. ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉన్నట్లు అధికారులు తెలియజేయడంతో వాటిని పూర్తిగా సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ సిఎం ఆదేశాలు జారీచేశారు. ఈ కేంద్రాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు పెద్ద వ్యాపారాలకు పనికొచ్చే విధంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. దివ్యాంగులకు స్వల్పకాలిక శిక్షణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌జెండర్‌ల సేవలను ప్రస్తుతం హైదరాబాద్ ట్రాఫిక్ కూడళ్ళలో వినియోగిస్తున్నారని, ఈ ప్రయోగం విజయవంతమైతే మండల కేంద్రాల్లోనూ ట్రాన్స్‌జెండర్‌ల సేవలు వినియోగిస్తామని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. దీంతోపాటు ట్రాన్స్‌జెండర్‌ల క్లినిక్ సెంటర్లు దేశంలో కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే అందుబాటులో ఉన్నాయని మంత్రులు వివరించారు. కేంద్ర సౌజన్యంతో కొనసాగుతున్న పథకాలు, నిధుల విడుదల, భవిష్యత్తులో ఈ పథకాలకు సంబంధించిన ప్రణాళికలపై చర్చించారు. సమావేశంలో ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బిగ్'సి'లో సంక్రాంతి సందర్భంగా వినూత్న ఆఫర్లు




ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎపి, తెలంగాణ రాష్ట్రాలలోనే నెంబర్.1 మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్ 'సి' సంక్రాంతి పండుగ సందర్భంగా ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించింది. సంస్థ ఫౌండర్ సిఎండి. యం.బాలు చౌదరి ఈ ఆఫర్ల వివరాలను వెల్లడించారు. బిగ్ 'సి'లో ఈ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి మొబైల్ కొనుగోలుపై రూ.10,000 వరకు విలువగల మొబైల్ ప్రొటెక్షన్‌తో పాటు, రూ.5,999 విలువగల స్మార్ట్ వాచ్ లేదా రూ.1,799 విలువగల ఎయిర్ బడ్స్ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఆవిష్కరించబడిన 13 మొబైల్స్ తమ అన్ని బిగ్ 'సి' షోరూమ్స్‌లలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ మొబైల్స్ కొనుగోలు పై రూ.7990 విలువగల స్విస్ మిలిటరీ స్పీకర్ తో పాటు వన్ ఇయర్ మొబైల్ ప్రొటెక్షన్ మరియు రూ.5000 వరకు ఇన్‌స్టంట్ కాష్ బ్యాక్ అందిస్తున్నామని తెలిపారు. మొబైల్ కొనుగోలుపై రూ. 15,000 వేల వరకు తక్షణ క్యాష్ బ్యాక్. జియోఫోన్ మొబైల్ కొనుగోలుపై రూ. 5,000 వరకు ఇన్‌స్టెంట్ డిస్కౌంట్ ఉంటుందని తెలిపారు. అంతే కాకుండా ఎ.టి.ఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్టాప్, ఎయిర్ కండీషనర్‌లు కొనుగోలు చేసే ఆకర్షణీయమైన సదుపాయాన్ని కూడా అందజేస్తున్నట్లు చెప్పారు.

## అనాథ పిల్లల ధృవీకరణ పత్రాల జారీలో ప్రత్యేక శ్రద్ధ
### డాక్టర్ పద్మజకు ప్రశంసాపత్రం




ప్రజాపక్షం/హైదరాబాద్: అనాథ ఆశ్రమంలో ఉంటున్న పిల్లలకు జనన ధృవీకరణ పత్రాల జారీలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చని జిహెచ్‌ఎంసి చీఫ్ మెడికల్ అధికారి (సిఎంహెచ్‌ఒ) డాక్టర్ పద్మజ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు జిల్లా కలెక్టర్, యూనిసెఫ్ అధికారుల సమక్షంలో ఆమెను సన్మానించారు. కాగా అనాథ శ్రమంలో ఉంటున్న పిల్లలకు సుమారు ఏడు క్యాంపులను నిర్వహించి,1642 మంది విద్యార్థులకు, అలాగే 2024 సంవత్సరంలో1287, తాజాగా 355 మంది పిల్లలకు జనన ధృవీకరణ పత్రాలను జారీ చేశారు.

## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాపక్షం / హైదరాబాద్ : నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని సిబిడి సి–2 ఎడిడి జి.నాగేశ్వర రావు తెలిపారు. విద్యుత్తు లైన్ల మరమ్మతులు, విద్యుత్తు లైన్‌లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల నరికివేత కారణంగా గోల్నాక చర్చి, అశోక్ నగర్ నాలా, తిలక్ నగర్, ఛేనంబర్, కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోనున్నట్టు తెలిపారు. శివాజీనగర్, దుర్గా మెస్, హెచ్‌ఆర్‌డి డిగ్రీ కళాశాల, రత్న డిగ్రీ కళాశాల, నారాయణగూడ ఫ్లై ఓవర్, రెడ్డి కళాశాల పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఫీవర్ హాస్పిటల్స్, అజయ్య క్వార్టర్స్, తెలంగాణ యువతీ మండలి, బర్కత్‌పురా పెట్రోల్ బంక్ ప్రాంతాల్లో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, ఎంఆర్‌ఒ ఆఫీస్, సోప్ ఫ్యాక్టరీ, అచ్చయ్య నగర్, ఆర్‌టిసి కళ్యాణమండపం, రాజేంద్ర ఆయిల్ మిల్లు ప్రాంతాల్లో విద్యుత్తు రాదని వివరించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి, సహకరించగలరని ఆయన కోరారు.

## ఆస్కార్ అవార్డులకు 323 చిత్రాల ఎంపిక

లాస్‌ఏంజెల్స్ : అస్కార్ అవార్డుల ఎంపికల పరిశీలనకు ఈ ఏడాదిలో మొత్తం 323 ఫీచర్ ఫిలిమ్స్ పోటీ పడుతున్నాయి. ఇందులో ఏడు భారతీయ చిత్రాలు కూడా ఉన్నాయి. రాబోయే మార్చి నెలలో ఈ 97వ ఆస్కార్ అవార్డుల ఎంపికకు ఓటింగ్ జరుగుతుంది. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఈ విషయం ప్రకటించింది. గత ఏడాదికంటే ఈ ఏడాదిలో 58 చిత్రాలు ఎక్కువగా వచ్చాయి. ఐతే వీటిల్లో బెస్ట్ పిక్చర్ అవార్డుల ఎంపిక పరిశీలనకు 207 చిత్రాలకు మాత్రమే అర్హత ఉందని కూడా అకాడమీ ప్రకటించింది. గత ఏడాది 321 చిత్రాలు పోటీ పడగా, 265 చిత్రాలను అవార్డుల పరిశీలనకు తీసుకున్నారు. ఈ సంవత్సరంలో ఇంగ్లీషేతర చిత్రాలు, డాక్యుమెంటరీలే ఎక్కువగా ఉన్నాయి. ద గర్ల్ విత్ నీడిల్ (డెన్మార్క్), ఆర్మండ్ (నార్వే), యూనివర్సల్ లాంగ్వేజ్ (కెనడా), దహోమీ (సెనెగల్) ఉన్నాయి.

## అదానీకేసు దర్యాప్తు నిర్ణయంపై బైడెన్‌ను సవాలు చేసిన రిపబ్లికన్ ఎంపి

వాషింగ్టన్ : వివాదాస్పద భారతీయ సంపన్నుడు గౌతమ్ అదానీ ఆర్థిక కార్యకలాపాలపై దర్యాప్తు జరపాలని జో బైడెన్ పాలనాయంత్రాంగం తీసుకున్న నిర్ణయాన్ని రిపబ్లికన్‌పార్టీకి చెందిన ప్రముఖ అమెరికా చట్టసభ సభ్యుడు లాన్స్ గూడెన్ సవాలు చేశారు. బైడెన్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ అమెరికా అటార్నీ జనరల్ మెర్రిక్ బి.గార్లాండ్‌కు కఠిన పదజాలంతో ఒక లేఖ రాశారు. లాన్స్ గూడెన్ కాంగ్రెస్ జ్యుడీషియరీ కమిటీలో కూడా ఒక సభ్యుడుగా ఉన్నారు. మొత్తం ఐదుసార్లు ఆయన అమెరికా చట్టసభకు ప్రజలద్వారా ఎన్నికయ్యారు. మొన్న జరిగిన ఎన్నికల్లో రిపబ్లికన్‌పార్టీ తరపున ఆయన గెలిచారు. ''విచారణ నిమిత్తం గౌతమ్ అదానీని అమెరికాకు అప్పగించాలని చేసిన విజ్ఞప్తిని పాటించేందుకు భారతదేశ ప్రభుత్వం తిరస్కరిస్తే మీరేం చేస్తారు?'' అని ఆయన తన లేఖలో అటార్నీ జనరల్‌ను ప్రశ్నించారు. విదేశీ కంపెనీలకు చెందినవారిలో ఎంపిక చేసిన వారిని మాత్రమే విచారణకు స్వీకరించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ వారిపై దర్యాప్తు చేయడంలో గల అంతరార్థం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విధమైన చర్యలు తీవ్ర హాని కలిగిస్తాయని, అమెరికాకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కూటమికి, మిత్రదేశాలకు నష్టం కలిగిస్తాయని, అమెరికాకు అంతిమంగా నష్టం కలుగుతుందని పేర్కొన్నారు.

# జిడిపివృద్ధిలో నేలచూపుల అంచనాలు!

### నిరాశకలిగించే కొత్త బడ్జెట్‌కు సంకేతం
### జైరామ్ రమేశ్ విమర్శ



న్యూఢిల్లీ : ప్రభుత్వం విడుదల చేసిన జిడిపి (స్థూల జాతీయోత్పత్తి) వృద్ధి అంచనాలు రాబోయే నిరాశాజనకమైన బడ్జెట్‌కు సంకేతమని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ కమ్యూనికేషన్ల విభాగం ఇన్‌చార్జి జైరామ్‌రమేశ్ విమర్శించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం జిడిపి వృద్ధిని 6.4 శాతంగా మాత్రమే చూపిస్తూ ముందస్తు అంచనాలను విడుదల చేసింది. ఈ ముందస్తు అంచనాలపై జైరామ్ రమేశ్ బుధవారం నాడు నిశిత విమర్శలు చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్‌లో 8.2 శాతంగా ఉన్న వృద్ధిరేటు అంచనాలతో పోల్చి చూసినప్పుడు ప్రస్తుత అధోముఖస్థాయివృద్ధి అంచనాలు నాలుగు సంవత్సరాల కనిష్ట స్థాయికి దిగజారిపోయాయని ఆయన విమర్శించారు. రిజర్వుబ్యాంకు వేసిన అంచనాలతో కూడా ప్రభుత్వ అంచనాలు ఏ మాత్రం సరిపోల్చి చూడటానికి వీల్లేకుండా ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇంకెంతో కాలం వాస్తవాలను మరుగుపరచి అసత్య ప్రచారాలు చేయలేదని, మరెంతోకాలం వాస్తవాలను మరుగుపరచలేదని హెచ్చరించారు. గడచిన పది సంవత్సరాలలో భారతదేశంలో వినియోగదారుల వ్యయాలు తిరోగమనస్థాయిలో నడుస్తున్నాయని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో బాధ కలిగించే తీవ్రమైన విషయమని హెచ్చరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిడిపి వృద్ధిని అథోముఖస్థాయిలో అంచనాలు వేశారని, వృద్ధి మందగించడానికి అడ్డంపడుతున్న ఆటంకాలు తొలగించేందుకు, దేశంలో పెట్టుబడులు భారీగా పెరిగేందుకు వీలుగా సమస్య మూలకారణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని, సమూల మార్పులు తీసుకురావాలని ఆయన అన్నారు. దేశంలో పేదలకు భారీ మద్దతు ఎంతో అవసరమని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు అత్యధికంగా వేతనాలను సమకూర్చాల్సిన అవసరం ఉందని, రైతులకు కనీస మద్దతు ధరలను భారీగా పెంచాల్సిన అవసరం ఉందని, ఈ చర్యలన్నింటికీ ఇదే సరైన తరుణమని అన్నారు. ఇటీవల రిజర్వుబ్యాంకు వేసిన 6.6 శాతం జిడిపి వృద్ధికంటే కూడా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ముందస్తు అంచనాలు మరీ హీనంగా ఉన్నాయని, ఈ అంచనాలు చూస్తుంటే, 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వం పార్లమెంటు బడ్జెట్ సమావేశాలలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్ అంచనాలు ఎంత నిరాశాజనంగా ఉంటాయో ముందుగానే అర్థం అవుతోందని విమర్శించారు. భారత ఆర్థిక వ్యవస్థ 2024–25 ఆర్థిక సంవత్సరంలో 6.6 శాతం జిడిపి వృద్ధి దిశగా పుంజుకుంటున్న లక్షణాలు చూపిస్తోందని ఆర్థిక స్థిరత్వ నివేదిక విడుదల చేసిన సందర్భంగా ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా డిసెంబరు 30న పాత్రికేయులతో చెప్పిన విషయాన్ని జైరామ్ రమేశ్ ప్రస్తావించారు. ఇంతకు ముందు వృద్ధిరేటును 7.2 శాతంగా అంచనావేసిన రిజర్వు బ్యాంకు పది రోజుల క్రితం విడుదల చేసిన ఆర్థికస్థిరత్వ నివేదికలో వృద్ధిరేటును 6.6 శాతంగా చూపించింది.



## బ్రహ్మోత్సవాలకు సిఎంకు ఆహ్వానం
### మంత్రి కొండా సురేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్ : జనవరి 13 నుంచి జరిగే ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, దేవాదాయశాఖ తరఫున ఆహ్వానపత్రికను అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ, సిబ్బంది స్వామి వారి తీర్థప్రసాదాలను అందించి, శేష వస్త్రాలతో సత్కరించగా, ఆలయ అర్చకులు సిఎం రేవంత్ రెడ్డిని వేదాశీర్వచనం అందించారు. జానపదుల జాతరగా ఖ్యాతికెక్కిన ఐనవోలు మల్లన్న బ్రహ్మోత్సవాల వైభవాన్ని, దేవాలయ చారిత్రక నేపథ్యాన్ని, ఆలయ ప్రాశస్త్యాన్ని ఆలయ సిబ్బంది, అర్చకులు సిఎం రేవంత్ రెడ్డికి వివరించారు. అంతకుముందు వర్ధన్నపేట ఎంఎల్‌ఎ కెఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చకులు హైదరాబాద్‌లోని జూబ్లిహిల్స్‌లో మంత్రి కొండా సురేఖ నివాసంలో కలిసి మల్లన్న బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ఆలయ సిబ్బంది మంత్రికి మల్లికార్జున స్వామి వారి తీర్థప్రసాదాలను అందించి, శాలువాతో సత్కరించారు. అర్చకులు వేదాశీర్వచనం అందించారు. ఎఇఒ కిరణ్ కుమార్, ప్రధానార్చకులు రవీందర్ శర్మ, అర్చకులు నరేష్‌శర్మ, భానుప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జ్ఞానేశ్వర్‌కు అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పదోన్నతి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉస్మానియా విశ్వవిద్యాలయ టిఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షులు బి.జ్ఞానేశ్వర్‌కు అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం సూపరింటెండెంట్ కేడర్‌లో కొనసాగుతున్న జ్ఞానేశ్వర్‌ను పదోన్నతిపైన సికింద్రాబాద్ పిజి కళాశాలకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ బదిలీ చేశారు. ఈమేరకు ఒయు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జ్ఞానేశ్వర్ ప్రస్తుతం తెలంగాణ విశ్వవిద్యాలయాల ఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఆయనకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ గా పదోన్నతి లభించడం పట్ల ఉస్మానియా తో పాటు రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాల ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్, ఇతర కేటగిరీల వర్కర్స్ సమస్యల పరిష్కారానికి జ్ఞానేశ్వర్ నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయనకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ గా పదోన్నతి లభించడంతో జ్ఞానేశ్వర్ ఉద్యోగుల కు మరింత సేవలు అందించేందుకు దోహదపడుతుందని ఉద్యోగ సంఘాల నాయకులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్‌జిఒ అసోసియేషన్ ప్రతినిధులు శంకరయ్య, అశోక్ యాదవ్ ఆకాంక్షించారు.

## కూలిన హర్యానా గవర్నర్ దత్తాత్రేయ ఇంటి ప్రహారీ గోడ



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాంనగర్ శ్రీనివాస గల్లీలో ఓ ఇంటి కూల్చివేతలు చేపడుతుండగా భారీ ప్రహారీ గోడ కూలి పక్కింటిపై పడింది. ప్రమాదవశాత్తు అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ చెందిన ఓ ఇంటి నిర్మాణానికి సంబంధించి గత కొన్ని రోజులుగా కూల్చివేతలు చేపడుతున్నారు. కాగా బుధవారం సాయంత్రం హెవీ హిటాచితో కూల్చివేతలు చేపడుతుండగా ఒక్కసారి భారీ గోడ కూలింది. ఎటువంటి జాగ్రత్తలు చేపట్టకుండా కూల్చివేతలు జరుపుతుండటంతో 20 ఫీట్ల గోడ ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రణాపాయం తప్పింది. ఈ ఘటనపై పక్క ఇంటివారికి, కూల్చివేతలు చేపడుతున్న సిబ్బంది వాగ్వాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది కూల్చివేతల తీరును పరిశీలించారు.

## మార్చి 5న 'జామామసీద్ హరిహర్ ఆలయం' కేసు తదుపరి విచారణ
### నిర్ణయించిన సంభల్ స్థానిక కోర్టు

సంభల్ (యుపి) : మొఘల్ కాలం నాటి షాహీ జామా మసీదు, చందౌసీలో దాని సర్వేకు సంబంధించిన కేసు తదుపరి విచారణను బుధవారం సంభల్ కోర్టు మార్చి 5వ తేదీని ఖరారు చేసింది. 'తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకూ ఏ ప్రార్థనా స్థలంపైనా కొత్త దావాలు వేయవద్దని సుప్రీంకోర్టు అన్ని దిగువ కోర్టులను ఆదేశించింది. మేం పేర్కొన్న ఉత్తర్వు కాపీని కోర్ట్‌లో దాఖలు చేశాం. ఇది మార్చి 5ను తదుపరి విచారణ తేదీగా నిర్ణయించబడింది' అని ముస్లింల తరపు న్యాయవాది షకీల్ అహ్మద్ వారి చెప్పారు. ఆయన ఈ విషయాన్ని విలేకరులకు వెల్లడించారు. మసీదు పురాతన హరిహర ఆలయంపై నిర్మించబడిందన్న హిందూపక్షం వాదనల గురించి ప్రస్తావించగా ఈ విషయంపై కోర్టు నిర్ణయం తీసుకోవాలని షకీల్ అహ్మద్ వారీ తెలిపారు. 'అది హరిహర్ దేవాలయానిది కాదని, జామా మసీదుది అని కోర్టులో నిరూపిస్తాం. దానికి సంబంధించిన అన్ని సాక్ష్యాధారాలు మావద్ద ఉన్నాయి' అని న్యాయవాది చెప్పారు. మరోవైపు హిందువుల తరపు న్యాయవాది గోపాల్ శర్మ మాట్లాడుతూ 'ప్రత్యుత్తరం ఇవ్వడానికి వారికి అవకాశం ఇవ్వాలని మేం కోర్టులో ఫైల్ చేశాం. ఈ విషయం ఇప్పుడు మార్చి 5న విచారణకు వస్తుంది' అని ఆయన తెలియజేశారు. గత సంవత్సరం నవంబరు 19నుండి సంభల్‌లో ఉద్రిక్తతలు పెరిగాయి. షాహీ జామా మసీదు కోర్టు నిర్దేశిత సర్వే ఒకప్పుడు ఆ స్థలంలో హరిహర్ దేవాలయం ఉందని వాదనలు ప్రారంభమయ్యాయి.
నవంబరు 24న రెండవ సర్వే సందర్భంగా ఆందోళనాకారులు భద్రతా బలగాలతో ఘర్షణకు దిగడంతో పరిస్థితి హింసాత్మకంగా మారింది. అనంతరం జరిగిన రాళ్లదాడి, కాల్పుల్లో నలుగురు మరణించగా, అనేకమందికి గాయాలయ్యాయి.

## సిసిఐ నిబంధనలు బెవరీస్‌లో అమలయ్యే విధంగా చర్యలు తీసుకోండి
### ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ చెవ్వూరు హరికిరణ్

ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిసిఐ (కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా) రూల్స్ తెలంగాణ బెవరీస్ కార్పొరేషన్ అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ చెవ్వూరు హరి కిరణ్ అన్నారు. అబ్కారీ భవన్‌లో బుధవారం సిసిఐ నిబంధనలపై స్టేట్ రీసోర్స్ పర్సన్ ఆర్.సి.కుమార్ ఇతర యంత్రాంగం కలిసి బెవరీస్ కార్పోరేషన్ ఉద్యోగులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కంపెనీల మధ్య కాంపిటీషన్ ఉంటే వినియోగదారులకు కొంత మేలు జరుగుతుందని అదే వారు సిండికేట్గా మారితే వినియోగ దారుల నష్టం జరుగుతుందని సిసిఐ రీసోర్స్ పర్సన్ ఆర్సి కుమార్ అన్నారు. కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా రూపొందించిన చట్టాలపై అవగహాన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి బెవరీస్ కార్పోరేషన్ జనరల్ మేనేజర్లు అబ్రహం, కాశీనాథ్తోపాటు శీలం శ్రీనివాస రావుతోపాటు ఇతర ఉద్యోగులు హాజరయ్యారు. ఎక్సైజ్ శాఖలో పలు శాఖల పరిధిలో కోర్టు కేసులకు సంబంధించిన విషయంలో ఆయా సెక్షన్‌ల అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ చెవ్వూరు హరి కిరణ్ సూచించారు. ఎక్సైజ్ శాఖ పలు శాఖలో కొనసాగుతున్న కోర్టు కేసులపై రివ్యూ నిర్వహించారు. ప్రధానంగా కోర్టు ఇచ్చిన నోటీసులకు వెంటనే స్పందించాలని, సమయం లోపు సమాధానం ఇవ్వాలని, కోర్టులో వేసే రిట్ పిటిషన్లపై, వివిధబూ రకాల రిట్ పిల్స్లొకంటెంట్ ఆఫ్ కోర్ట్ కోర్టు కేసులపై చాల సీరియస్ ఉండాలని అన్నారు. కోర్టు కేసులపై వెంటనే స్పందించాలని అన్నారు. ఈ విషయాలో ఆయా శాఖల ఎస్ఓలు ఇతర పర్యవేక్షణ అధికారులు స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ అజయ్రావు ఎక్సైజ్ జాయింట్ కమషనర్లు ఖురేషి, కేఏబీ శాస్త్రీ, సురేష్,తోపాటు రఘురాం , శీలం శ్రీనివాసరావు, శ్రీనివాస్, శ్రీధర్, ప్రణవీల తోపాటు ఎస్ఓలు పాల్గన్నారు.

### చత్తీస్‌గఢ్ స్వతంత్ర 'జర్నలిస్టు ముఖేష్ చంద్రాకర్ హత్య ఘటన'పై
## తక్షణమే న్యాయ విచారణ చేపట్టాలి

ప్రజాపక్షం/హైదరాబాద్: చత్తీస్‌గఢ్ స్వతంత్ర జర్నలిస్టు ముఖేష్ చంద్రాకర్ హత్య ఘటనపై తక్షణమే న్యాయ విచారణ చేపట్టి, బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ముఖేష్ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులకు కూడా రక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టాలన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు పాలకులు, పెట్టుబడిదారులు,సంఘ వ్యతిరేక శక్తులు ప్రమాదకరంగా మారుతున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లోని బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర (సిఎల్‌సి) అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్ సెక్రెటరీ జనరల్ ఎన్. కొండయ్య మీడియాతో మాట్లాడారు. దేశంలో పరిశోధనాత్మక జర్నలిజం ప్రమాదంలో పడిందని ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం ఆందోళన వ్యక్తం చేశారు. చత్తీస్‌గడ్‌లో ద్విచక్ర వాహనాలు కూడా ప్రయాణించని ప్రాంతాల్లో ఆరు లైన్ల రహదారుల నిర్మాణం వెనుక ఉన్న అవినీతిని ప్రశ్నించినందుకే జర్నలిస్టు ముఖేష్ చంద్రాకర్‌ను నిర్మాణ పనుల కాంట్రాక్టర్ సురేష్ చంద్రాకర్ పలువురితో కలిసి దారుణంగా హత్య చేయించారని విమర్శించారు. ఆంజనేయులు మాట్లాడుతూ సమాచార సేకరణలో జర్నలిస్టులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ క్రమంలో స్థానిక ఎస్‌ఐలు కూడా బెదిరించే పరిస్థితులు ఏర్పాడాయని మండిపడ్డారు.
జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపైన దేశ వ్యాప్తంగా అన్ని జర్నలిస్టు సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. చత్తీస్‌ఘడ్ జర్నలిస్టుల రక్షణ చట్టం 2023 అమలులో ఉన్నప్పటికీ, ఆచరణలో మాత్రం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా జర్నలిస్టులకు రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. నారాయణరావు మాట్లాడుతూ జర్నలిస్టు ముఖేష్ చంద్రాకర్ హత్య పత్రికా స్వేచ్ఛకు గొడ్డలి పెట్టులాంటిదని, భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ ఎంత ఆందోళనకరంగా ఉన్నదో అద్దం పడుతోందన్నారు.

## ఆజంజాహి మిల్లు కార్మికుల భవన స్థలాన్ని కాపాడాలి




### తెలంగాణ ఉద్యమకారుల వేదిక చైర్మన్ కూరపాటి వెంకట్ నారాయణ డిమాండ్

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : ఆజంజాహి మిల్లు కార్మిక భవనాన్ని కూల్చి స్థానిక వస్త్ర వ్యాపారి వ్యాపార భవన సముదాయాన్ని నిర్మించడానికి మరొకసారి ప్రయత్నం వరంగల్ నగర వాసులను విస్మయానికి గురిచేసిందని తెలంగాణ ఉద్యమకారుల వేదిక చైర్మన్ కూరపాటి వెంకట్ నారాయణ అన్నారు. పదివేల మంది కార్మికులకు ఉపాధి ఆదాయాలను కల్పించిన వరంగల్ పట్టణానికి ప్రతిష్టాత్మకమైన మిల్లును మూసివేయడమే కాకుండా భూములను అమ్మి వేయడం, చివరికి కార్మికుల భవన భూమిని కూడా అన్యాక్రాంతం కావడం వరంగల్ నగర ప్రజలకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నని వరంగల్ నగర పౌర సమాజం పక్షాన సీనియర్ సిటిజన్స్ మేధావులు అడ్వకేట్స్ ప్రజాసంఘాల ప్రతినిధులు బుధవారం వరంగల్ జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతి పత్రాన్ని సమర్పించారు.అనంతరం ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ, ప్రజల భూములు అన్యాక్రాంతం కావడం కబ్జాకు గురి చేయడం నిరంతరాయంగా కొనసాగడం వరంగల్ ప్రజలను మరింత ఆందోళనకు గురి చేస్తున్నదని పౌర సమాజం ఆందోళన చెందుతున్నదన్నారు. ఇప్పటికైనా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ భూములను కాపాడడానికి, ముఖ్యంగా ఆజం జాహి మిల్లు మొత్తం భూములను గురించిన సమగ్ర సర్వే చేసి వివిధ సంస్థలకు అమ్మిన భూములు పోగ మిగిలిన భూముల వివరాలు వరంగల్ నగర ప్రజల ముందు పెట్టాలని కోరుతున్నారు. ర్యాంకీ, కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, హౌసింగ్ బోర్డు, ఇతర సంస్థలు ఎంత భూమిని కొనుగోలు చేశాయి, ఇంకా మిగిలిన భూమి ఎవరి ఆధీనంలో ఉన్నది ప్రజాస్వామ్యంలో ప్రజలకు తెలవవలసిన అవసరం ఉందని అన్నారు. . ఈ కార్యక్రమంలో సభ్యులు పుల్లూరు సుధాకర్, సోమ రామమూర్తి, వీరమల్ల బాబురావు, కొండ్రెడ్డి మల్లారెడ్డి,, పెండ్లి ఉపేందర్ రెడ్డి , మహమ్మద్ బాసు, చందుపట్ల శ్రీలత రెడ్డి,సోమిడి శ్రీనివాస్, జెండా అంబయ్య ఉన్నారు. ఆజం జాహీ మిల్లు కార్మికుల భవనానికి సంబంధించిన భూమిని కాపాడాలని మిగులు భూములను రక్షించాలని వరంగల్ జిల్లా మంత్రులకు ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలకు కూడా ఈ వినతి పత్రాలను పంపిస్తున్నట్లు ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ తెలియజేశారు.

# చిన్న కాళేశ్వరం పనుల్లో ఉద్రిక్తత

### ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళా రైతు



ప్రజాపక్షం/మహాదేవపూర్: జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలం లో రాష్ట్ర ప్రభుత్వం రైతుల కు త్రాగు సాగు నీరందించడానికి నిర్వహింస్తున్న పనుల్లో బుధవారం నాల్గవ రోజు రైతులు పనుల ను అడ్డకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. తాతల కాలంనాటినుండి తాము సాగుచేఉకుంటున్న భూముల్లో అధికారులు అన్యాయంగా కాలువ తవ్వుతున్నారని త మకు నష్టపరిహారం అందిచాక పనులను నిర్వహించాలని స్పష్టం చేసారు. అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య కాలువ పనులను కొనసాగిస్తున్న నేపథ్యంలో రైతులు అడుడ్కుని ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో మహిళా రైతు పురుగుల మందుత్రాగి ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించగా పోలీసులు మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**దౌర్జన్యంగా తమ పొట్టగొడుతున్నారు:** అధికారు లు దౌర్జన్యంగా తమపొట్టగొట్టే ప్రయత్నం చేస్తున్నారని రైతులు ఆరోపించారు. దశాబ్దాల కాలంగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమ భూములను బలవంతంగా లా క్కొనే ప్రయ త్నం చేస్తున్నారన్నారు. అధికార బలంతో అడ్డొచ్చిన వారిని అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు.

**మహిళా రైతు ఆత్మహత్యా యత్నం:** గత నాలుగు రోజులుగా చిన్న కాళేశ్వరం పనులను అధికారులునిర్వహించే క్రమంలో తమ భూముల మధ్య నుండి కాలువ వెళ్తుండడంతో నష్టపరిహారం అం దించాకే పనులు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్న రైతులను పోలీసులు అడ్డుకునే క్రమంలో ఎల్కేశ్వరం గ్రామానికి చెందిన రాళ్లబండి కమల అనే మహిళా రైతుల పురుగుల మందు త్రాగి ఆత్మహ త్య యత్నానికి పాల్పడడంతో వెటనే పోలీసులు మహిళా రైతులను మహదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.చికిత్స అందించిన ఆసుపత్రి వైద్యులు మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లి వందపడకల ఆసుపత్రికి తరలించాలని సూచించారు.

## పాఠశాలల తనిఖీ



ప్రజాపక్షం/నర్వ : అడ్డాకుల మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మండలంలోని అన్ని పాఠశాలలో స్వచ్ఛమైన పోషక విలువలు కలిగిన మధ్యాహ్న భోజనం అందించుటకు పర్యవేక్షణకు మండల్ స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్, ఎంపిడిఒ, ఎంఇఒ, ఎంపిఒ పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా ఎంపిడిఒ నర్వలో కెజివివి పాఠశాలను పర్యవేక్షణ చేయడం జరిగింది.

## యువతతోనే దేశ భవిష్యత్తు



ప్రజాపక్షం/జడ్చర్ల : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఎబివిపి జడ్చర్ల శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 162వ జయంతి పురస్కరించుకొని ప్రభుత్వ వివిధ జూనియర్ కళాశాల సెమినార్స్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్చర్ల నగరే కార్యదర్శి రాఘవేందర్ మాట్లాడుతూ నేటి యువత స్వామి వివేకానందుని స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని యువత మద్యం మత్తులో చెడు తోవ పడుతున్నారని, దేశం కోసం ఎంతోమంది మహనీయులు వాళ్ళ జీవితాలను సైతం అర్పించారని, సమాజంలో జరుగుతున్న ప్రతి అవినీతి అంతం యువత పంతం అనేట్టుగా పనిచేయాలని. రాష్ట్ర ప్రభుత్వం యువతపై ప్రత్యేక దృష్టి సాధించి, మంచి మార్గంలో నడిచే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి శివకుమార్, వీర, మోహన్, ఆశోక్, నరేష్, జయకృష్ణ, పాండు, సాయికిరణ్, సామెల్, రామకృష్ణ భరత్, శ్రీను, విజయ్, శ్రీను, నవనీత, భోభారాణి, సైని, పద్మావతి, దివ్య, భార్గవి, రిషత తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ ఏర్పాటు చేయాలి




ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి : ప్రతి కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ (అంటీ డ్రగ్ కమిటీ) ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ హాల్‌లో ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంటే మాదక ద్రవ్యాల నియంత్రణకు యాంటీ డ్రగ్ కమిటీలు ప్రతి కళాశాలలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే ఈ కమిటీ నెలవారీగా సమావేశం జరపాలని, జెండర్ సెన్సిటివిటీపై అవగాహన కల్పించాలని సూచించారు. కళాశాలలో ఎవరైనా డ్రగ్స్,మత్తు పదార్థాల భారిన పడిన వారిని గుర్తించాలని, ప్రతి కళాశాలలో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు కళాశాల ప్రిన్సిపల్‌లను ఆదేశించారు. ఈ సమావేశానికి ఎస్‌పి. జానకి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఎస్పీ డి.జానకి, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి గౌసర్ జహాన్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా॥ కె. కృష్ణ,ఎక్సైజ్,అటవీ,మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు, ఎస్వీఎస్ మెడికల్ కళాశాల, కళాశాలల ప్రిన్సిపాల్ లు పాల్గొన్నారు.

## జిల్లెల యంగంపల్లి రోడ్డు పరిశీలన



ప్రజాపక్షం/కల్వకుర్తి :కల్వకుర్తి మండల పరిధిలోని జిల్లెల,యంగంపల్లి గ్రామాల మధ్య గల రోడ్డును బుధవారం జిల్లెల మాజీ సర్పంచ్ జిల్లెల రాములు, డిఇ లింగంలు కలిసి పరిశీలించారు. వారి వెంట ఎఇ షబ్బీర్, రెండు గ్రామాల కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## బిటి రోడ్డు మంజూరు చేయాలి

ప్రజాపక్షం/ వెల్దండ : మండల పరిధిలోని చెదురుపల్లి గ్రామం నుంచి బుగ్గకాల్వ తండా వరకు బీటీ రోడ్డును మంజూరు చేయాలని బిఆర్ఎస్ నాయకులు పోలే అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ తండా నుంచి రైతులు,ప్రజలు ప్రతినిత్యం తమ పనుల నిమిత్తం మండల కేందానికి, చెదురుపల్లి గ్రామానికి వచ్చి వెళ్తుంటారని, దీంతో బస్సు సౌకర్యం కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సౌకర్యార్థం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టిలో ఉంచుకొని ఆ తండాకు బీటీ రోడ్డు, ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

## మోతీలాల్‌నాయక్‌కు ఘన సన్మానం



ప్రజాపక్షం/ వెల్దండ : జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సభ్యులుగా నియమితులైన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్‌ను బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్‌టి సెల్ అధ్యక్షులు శంకర్ నాయక్ ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో మరిన్ని పదవులను స్వీకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ తాలుకా అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్ర శ్రీనివాస్ ముదిరాజు, పార్టీ నాయకులు రాములు యాదవ్, పూల్ సింగ్, వెంకట్నాయక్, లాలునాయక్, చంద్‌నాయక్; పంతుల నాయక్, జైరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కసిరెడ్డికి గజమాలతో సన్మానం

ప్రజాపక్షం/ వెల్దండ : మండల పరిధిలోని రాచూర్ గ్రామం నుంచి వెల్దండ మండల కేంద్రానికి బిటి రోడ్డు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని రాచూర్ గ్రామస్తులు గున్నెళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ పూదీనా గజామాలతో సన్మానించారు.ఎన్నికల సమయంలో రాచూర్ గ్రామానికి ప్రచారం నిమిత్తం వచ్చిన సందర్భంగా ఇచ్చిన హామిని నేరవేర్చినందుకు గాను ఎమ్మెల్యేలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచూర్ గ్రామస్తులు రమేష్ ముదిరాజు, శ్రీనివాస్ ముదిరాజు, పబ్బాల బాలకృష్ణలతో తదితరులు ఉన్నారు.



# సోలార్‌పవర్ ప్లాంట్‌కు స్థలాల గుర్తింపు

### నాగర్‌కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్ వెల్లడి



ప్రజాపక్షం/ నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : జిల్లాలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల ఎంపిక పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్‌కుమార్ అన్నారు. బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుపై ప్రజా భవన్ నుండి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, దేవాలయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ,పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శి లోకేష్ కుమార్, సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్ ట్రాన్స్‌కో సిఎండి కృష్ణబాస్కర్ విద్యుత్ శాఖల సిఎండిలతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు తన ఛాంబర్ నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో మహిళా స్వయం సహయక బృందాల ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు కావాల్సిన ప్రభుత్వ,ప్రైవేట్ స్థలాలను ఎంపికను జిల్లా యంత్రాంగం ఇప్పటికే గుర్తించినట్లు తెలిపారు. జిల్లా లక్ష్యాలకు అనుగుణంగా భూమిని నిర్దేశించిన గడువులోగా పూర్తిస్థాయిలో ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసి తద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు, జిల్లాలో ఉన్న దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న భూములను కూడా గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటికే స్వయం సహాయక సంఘాలకు ఇందిరా మహిళా శక్తి ద్వారా అనేక రకాల వ్యాపారాలను నిర్వహించేందుకు రుణ సధుపాయాలను కూడా కల్పించినట్లు పేర్కొన్నారు.అదే తరహాలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచి గ్రామీణ ప్రాంతా అవసరాలతో పాటు మిగిలిన విద్యుత్‌తో ఆదాయ వనరులను సమకూర్చేలా భూ సేకరణతో పాటు మహిళా సంఘాల సభ్యుల గుర్తించి సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టనున్నట్లు ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

ప్రజాపక్షం / నారాయణపేట : ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థిని విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. 2025–26 విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 23న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనుందని ఆమె తెలిపారు. గురుకులాల్లో విద్యను అభ్యసించవాల్సిన బాల బాలికలు ద్వారా ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 1వ తేదీ దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు కుల ధృవీకరణ పత్రం నంబర్, ఆదాయ ధృవీకరణ పత్రం నంబర్, ఆధార్ కార్డు నంబర్ , బర్త్ సర్టిఫికెట్ ఫోటో అవసరమని తెలిపారు. ధృవీకరణ పత్రాల సత్వర జారీ కోసం కలెక్టరేట్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని, ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం తెరిచి ఉంటుందన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, సాధారణ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు, ఎస్‌సి, ఎస్‌టి గురుకులాల్లో 6 నుండి 9వ తరగతి వరకు ఖాళీ సీట్లలో ప్రవేశాల కోసం, ఖమ్మంలోని గిరిజన సంక్షేమ గురుకులం, పరిగిలో ఎస్ఇఒలలో 8వ తరగతిలో ప్రవేశాలకై అలుగునూరులోని సిఇఒలో 9వ తరగతిలో అడ్మిషన్ల కోసం, రుక్మాపూర్ సైనిక్ స్కూల్ , మల్కాజ్ గిరి ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.



## ధాన్యం కొనుగోళ్ళు పూర్తి

### రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు

ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి : జిల్లాలో వానాకాలం 2024–25 సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోళ్ళు సాఫీగా పూర్తి చేసినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు తెలిపారు. జిల్లాలో 173 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, ఐకెపి ద్వారా 103, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) ద్వారా 70, డిసిఎంఎస్ ద్వారా 4 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ప్రజా ప్రతినిధుల సహకారం తో ప్రణాళిక బద్దంగా రైతులకు ఇబ్బంది లేకుండా వానాకాలం సీజన్ 2024– 25లో కొనుగోళ్ళు సాఫీగా పూర్తి చేసినట్లు తెలిపారు. 19116 మంది రైతుల నుండి 91673.020 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేసినట్లు తెలిపారు. అత్యధికంగా సన్న రకం సాగు జిల్లాలో సన్నరకం ధాన్యం సాగు చేసి ప్రభుత్వం ప్రకటించిన 500 రూ.లు బోనస్ లబ్ధి పొందారు. దొడ్డురకం 29252.840 మెట్రిక్ టన్నులు, సన్న రకం ధాన్యం 62420.180 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల నుండి కొనుగోలు చేసిన ట్లు తెలిపారు. కోనుగోలు చేసిన ధాన్యం కు 212.68 కోట్ల రూ.లు మద్దతు ధర చెల్లించ వలసి ఉండగా 204.89 కోట్ల రూ.లు రైతుల ఖాతాల్లో చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యం కొనుగోలుకు క్వింటాలుకు 500 రూ.లు బోనస్ చెల్లించ వలసి ఉండగా 19.77 కోట్ల రూ.లు రైతుల ఖాతాల్లో బోనస్ జమ చేసినట్లు తెలిపారు.

## ‘108 అంబులెన్స్’లో మహిళా ప్రసవం

ప్రజాపక్షం / మద్దూర్ : అంబులెన్స్‌లో మహిళా ప్రసవించిన ఘటన నారాయణపేటజిల్లా కొత్తపల్లిలో జరిగింది. మండల పరిధిలోని వీరారం పెద్ద తండాకు చెందిన మనిషాకు పురిటి నొప్పులు రావడంతో మనిషా భర్త భాస్కర్ నాయక్ మద్దూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని రాగా ఇక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని వెల్లడించారు.



## పూర్వీకుల ఆహారమే బలవర్ధక ఆహారం

### ప్రణాళిక సంఘం అధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి

ప్రజాపక్షం/జడ్చర్ల : పూర్వీకుల ఆహారమే గొప్ప ఆహారమని జొన్నలు, సజ్జలు, తైదలు కొర్రలు వంటి చిరుధాన్యాలను తింటు శ్రమైక జీవనాన్ని కొనసాగించారని రాష్ట్ర ప్రణాళిక సంఘం అధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. బుధవారం జడ్చర్ల మండలం పోలేపల్లి స్టైజ్‌లోని ఎస్‌వికెయం పాటశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో చిరుధాన్యాల ప్రాధాన్యతపై ఏర్పాటు చేసి సెమినార్‌లో మాట్లాడారు. సైన్స్ లేనిదే అభివృద్ధి లేదని సైన్స్ మానవాళి జీవితాలనే మార్చిందన్నారు.సంచారజీవనం నుండి ఆధునిక మానవుడి దాక ఎన్నో పరిణామాలు జరిగాయని దీని వెనుక శాస్త్రవేత్తలు కృషి ఎంతో ఉందన్నారు. వ్యవసాయం ద్వారానే మానవ నాగరికత అభివృద్ధి చెందిందని చిన్నారెడ్డి అన్నారు. మంచి చేయాలన్నా చెడు చేయాలన్నా సైన్స్ ద్వారానే సాధ్యమౌతుందన్నారు. అనేక దేశాలు సైన్స్‌ను దుర్వినియోగం చేస్తూ యుద్దాలు విద్యార్థుల్లో సహయ వ్యవసాయంతో పాటు ప్రాచీన ఆహారం ప్రాధాన్యతను తెలియజేసేందుకు కోసం సెమినార్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెమినార్‌కు ముందు ప్రణాళిక సంఘం అధ్యక్షులు చిన్నారెడ్డి విద్యార్థుల ఆవిష్కరణలను ఆసక్తిగా తిలకిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రయోగాల్లో చేయాల్సిన మార్పుల గురించి సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ రవీందర్, సిఎంఒ బాలు యాదవ్, డిఎస్‌ఓ శ్రీనివాస్, ఎఎంఒ దుంకుడు శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇస్రానాయక్, డిగ్రీకళాశాల అధ్యాపకులు సదాశివయ్య, గుముడాల చక్రవర్తి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయి ఖోఖోకి మద్దూరు విద్యార్థి



ప్రజాపక్షం / మద్దూర్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎస్‌జిఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర స్థాయిలో జరిగిన అండర్ 14 బాలుర ఖోఖో విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర మద్దూర్‌కి చెందిన రాజశేఖర్ రెడ్డి 9వ తరగతి విద్యార్థి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు నుండి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ చెన్నారం వెంకటప్ప తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు సవిత మాట్లాడుతూ క్రమ శిక్షణతో మెలిగి జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబర్చి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం బాలాజీ, రఘు, వసంతకుమార్ , వనజ, ప్రసన్న లక్ష్మి , విజయలక్ష్మి , శారద, సూర్యప్రకాశ్ , రవి, సుధాకర్ , నాగేందర్ , యశ్వంత్ , భీమయ్య, బందయ్య, స్వప్న, రాజశేఖర్ , ఆంజనేయులు, సునీత, సత్యం విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలను అధునాతన ప్లే స్కూల్స్‌గా అభివృద్ధి చేస్తాం

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : అంగన్‌వాడీలను అధునాతన ప్లేస్కూల్స్‌గా అభివృద్ధి చేస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గం, హన్వాడ మండలంలోని, నాయినోనిపల్లి గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధుల ద్వారా రూ.12 లక్షలతో నూతనంగా నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి ఎంపి డికె అరుణతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యతో పాటు బలవర్థకమైన ఆహారం చిన్నారులకు అందిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత , మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి తదితరులు ఉన్నారు.

### యాదవుల అభివృద్ధికి కృషి చేస్తా

యాదవుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జిల్లాగొర్రెల పెంపకముదారుల సహకార యూనియన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు.ఈసందర్భంగా జిల్లాగొర్రెల పెంపకముదారుల సహకారం యూనియన్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఎంపి డికె అరుణతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేవలం కులవృత్తులే కాకుండా మన పిల్లలకు చదువు కూడా చెప్పించాలని ఇప్పుడు ప్రభుత్వవిద్యాసంస్థల్లో కార్పోరేట్ స్థాయి విద్యను అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లురాబోతున్నాయని, అర్హులైన నిరుపేదలకు వస్తాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గొర్రెల పెంపకముదారుల సహకార సంఘం అధ్యక్షులు శాంతన్న యాదవ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నర్సింహులు యాదవ్, రమేశ్ యాదవ్, బాలమణి, గోవింద్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ‘ఆశా’లకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి



ప్రజాపక్షం / కొత్తకోట : ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 18వేలు ఫిక్స్‌డు వేతన నిర్ణయించి ఇవ్వాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జె.భాగ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ డాక్టర్ ఆసియాకు ఆశాల సమస్యల పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఎన్‌ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశలకు ఏఎన్‌ఎం పోస్టులో ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని వెయిటేజ్ మార్కులు వెంటనే నిర్ణయించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు ప్రమీల నందకిషోర్ , సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ , ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

## చురుకుగా బిటి రోడ్డు నిర్మాణ పనులు



ప్రజాపక్షం / వీపనగండ్ల : మండల పరిధిలోని సంగినేనిపల్లి ఆర్‌అండ్‌బి రోడ్డు నుండి తూముకుంట ... వల్లభాపూర్ రోడ్డు వరకు నాలుగు కోట్ల రూపాయలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. 2023లో అప్పటి కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఎస్‌డిఎఫ్ నిధుల నుండి నాలుగు కోట్ల రూపాయలను మంజూరు చేయించి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గత నెలరోజులల క్రితం బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టగా ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తికావస్తున్నాయి. ఉగ్ర లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయం వద్ద సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేశారు. మరో వారం రోజుల్లో రోడ్డు పనులు పూర్తి కావస్తాయని సంబంధిత కాంట్రాక్టర్ తెలిపారు. బిటి రోడ్డు నిర్మాణం వల్ల ఉగ్ర లక్ష్మీ నర్సింహస్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు ఇబ్బందులు తప్పుతాయి.

## బిఆర్‌ఎస్ పాలనలో ఒరిగిందేమీ లేదు

### జాతీయ రహదారిపై సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం....



ప్రజాపక్షం/ వెల్దండ : గత 5సంవత్సరాల నుంచి టిఆర్ఎస్ పాలనలో అప్పటి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ హాయంలో కల్వకుర్తి నియోజకవర్గానికి ఒరిగింది ఎమి లేదని కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వావిళ్ల ఉమామనీలా సంజీవ్‌కుమార్‌యాదవ్‌లు అన్నారు. బుధవారం హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు ఎమ్మెల్యేగా జైపాల్‌యాదవ్ 50 మీటర్ల కాల్వ తీయలేకపోయాడని, ఇప్పుడు కాల్వను సందర్శించి ఏమి మాట్లాడుతున్నాడో ఏమో ఆయనకే అర్థం కావడం లేదని ఆరోపించారు. ప్రజా శ్రేయస్సు కోసం కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్యే గెలిచాకనే మండల పరిధిలోని చెర్కూర్ రెవెన్యూ శివారులో మిగిలిన కెఎల్ఐ డి 82 కాల్వను 50 మీటర్లు తవ్వించారని అన్నారు. జైపాల్‌యాదవ్ ఎమ్మెల్యే పదవిని ఎంజాయ్ చేశాడే కానీ వెల్దండ మండలానికి, కల్వకుర్తి నియోజకవర్గానికి చేసింది శూన్యమన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్,కిసాన్‌సెల్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి,మాజీ సర్పంచులు భూపతిరెడ్డి, పత్యానాయక్, కిస్టాలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కొయ్యల పుల్లయ్య,ఎర్ర శ్రీను ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్, రషీద్, అమీద్, మట్ట భరత్‌గౌడ్, బద్రియాదవ్, నిజాం,తిరుగుడు రాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ తప్పక రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ప్రజాపక్షం / వనపర్తి టౌన్ : రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఐడిఒసి ప్రాంగణం నుండి నల్ల చెరువు వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి , జిల్లా ఎస్పీతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మరణాలు సంభవిస్తున్నందునే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు భద్రతా వారోత్సవాల నుంచి మాసోత్సవాలుగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. జిల్లాను యాక్సిడెంట్స్ ఫ్రీగా మార్చడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలోనే ఆర్టీసీ డ్రైవర్లకు సైతం కంటి పరీక్షల క్యాంపును నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని చెప్పారు. పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు తల్లిదండ్రులు ఒకసారి ఆలోచించాలని గుర్తు చేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రతి రోజు రోడ్డు భద్రతపై కొంత అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా ఎస్‌పి గిరిధర్ రావుల మాట్లాడుతూ సమాజం మనకు ఎంతో ఇస్తుందని , మనం కూడా ఇతరులకు ఇబ్బంది కలగకుండా చక్కగా రోడ్డు భద్రత పాటిస్తూ బాధ్యతగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి మానస, జిల్లా పౌర సంబంధాల అధిఇకారి సీతారాం, యువజన సర్వీసుల శాఖ అధికారి సుధీర్ రెడ్డి, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.




## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



ప్రజాపక్షం/పెద్దమందడి : మండలం వెల్టూరు గ్రామంలో బుధవారం మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థునులకు సైబర్ నేరాలపై పెద్దందడి ఎస్ఐ యుగేందర్ రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలతో వారు మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లు వాడే మీరు కాని మీ కుటుంబ సభ్యులు కాని గుర్తు తెలియని వ్యక్తులు పంపిన క్లిప్పులను ఓపెన్ చేయకూడదని వారు తెలిపారు. ఎవరైనా ఎమర్జెన్సీగా అవసరం ఉన్నదని నీ అకౌంట్ నుండి డబ్బులు వేయగలరని సూచిస్తే వారు కంపల్సరిఇగా మీ కుటుంబ సభ్యులు తెలుసుకొని అమౌంట్ ట్రాన్స్‌పర్ చేయాలని వారు సూచించారు. నైపుణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహత్మ జ్యోతిబాపూలే విద్యార్థునులతో పాటు ఉపాధ్యాయురాలు పెద్దమందడి మండల ఎస్ఐ యుగంధర్ రెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫోకస్

# కళారంగం

## 'నటనే 'ఆయన ఊపిరి

డిఎస్ దీక్షితులుగా సుపరచితుడైన దీవి శ్రీనివాస దీక్షితులు నటనే ఊపిరిగా జీవించాడు. రంగస్థలం నుంచి వెండి తెరపైకి వచ్చిన అరుదైన నటుల్లో ఆయన ఒకడు. 1956 జులై 28న హనుమంతాచార్యులు, సత్యవతమ్మ దంపతులకు గుంటూరు జిల్లా, రేపల్లెలో జర్లించిర దీక్షితులు 2019 ఫిబ్రవరి 18న తుదిశ్వాస విడిచాడు. రంగస్థల నటుడిగానేగాక, దర్శకుడిగానూ పేరుప్రఖ్యాతులు సంపాదించాడు. సంసృృతం, తెలుగు భాషాల్లో రంగస్థల కళలపై ఎంఎ పూర్తి చేశాడు. నటుడిగా, అధ్యాపకుడిగా, దర్శకుడిగా పేరు గడించాడు. రేపల్లెలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేసిన ఆయన తన ఉద్యోగాన్ని విడిచిపెట్టి, హైదరాబాద్‌లోని ఎపి థియేటర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిపర్టరీలో చేరి, థియేటర్ ఆర్ట్స్‌లో డిప్లొమోలో చేరాడు. 'శాకుంతలం', 'మా నాన్న కావాలి', 'కీలుబొమ్మలు', 'ఆశ', 'ప్రతాపరుద్రీయం' వంటి నాటకాల్లో నటించి, శిక్షణా సమయంలోనే అందరి మన్ననలు పొందాడు. 'హరిశ్చంద్ర' 'సక్కుబాయి' వంటి పద్యనాటలతోపాటు, 'వ్యవహార ధర్మబోధిని', 'కన్యాశుల్కం', 'వెయింటింగ్ ఫర్ గోడో', 'స్వతంత్ర భారతం' తదితర సాంఘిక నాటకాల్లోనూ నటించి ఉత్తమ నటుడిగా పేరు తెచ్చుకున్నాడు. 'గోగ్రహణం', 'కొక్కొరోకో', 'స్వతంత్రం' లాంటి వీధి నాటకాలకు దర్శకత్వం వహించాడు. పలు ఆల్‌ఇండియా రేడియో నాటకాలు, టివి సీరియళ్లలోనూ నటించి మెప్పించాడు. టివి నాటకం 'ఆగమం' సీరియల్‌కు నంది అవార్డును అందుకున్నాడు. 'సిరిసిరి మువ్వలు' సీరియల్ కూడా దీక్షితులకు గొప్ప పేరు సంపాదించిపెట్టింది. 'ఎల్లమ్మ' 'మురారి', 'ఇంద్ర', 'ఠాగూర్', 'ప్రాణం', 'వర్షం', 'అతడు', 'గోపాల గోపాల' వంటి పలు చిత్రాల్లో నడిపించిన ఆయన, జీవితం మొత్తం రంగస్థలానికి, నటనకే అంకితమైంది.



## ఒకే ఒక్క ఫొటోతో..!



ఎంతో మంది కొన్ని సంవత్సరాలు... దశాబ్దాలు కష్టపడినా దక్కని గుర్తించి అతి కొద్దిమందికి హఠాత్తుగా లభిస్తుంది. అలాంటి అరుదైన వారిలో 'సెలబ్రిటీ కిడ్ ' జాక్ పేరు తప్పక చేరుతుంది. అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ ఇలినాయిస్‌లో విద్యార్థి అదూఫా ప్రాక్టికల్స్ కోసం 2015లో ఘనా వెళ్లాడు. అక్కడ కళారూపాలను అధ్యయనం చేశాడు. ఆ సమయంలోనే అక్కడి ఒక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖం పట్ల ఆసక్తిని పెంచే కార్యక్రమాన్ని చేపట్టాడు. డ్రాయింగ్ క్లాసులు జరిగే సమయంలో అదూఫా స్నేహితుడు కరోల్స్ కొర్సెస్ కూడా కొన్ని ఫొటోలు తీశాడు. ఘనాలో అధ్యయనం పూర్తయిన తర్వాత అదూఫా తిరిగి అమెరికా వెళ్లాడు. ఘనాలో తాను తీసిన వందలాది ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. వాటిలో, ఘనా ప్రైమరీ స్కూల్‌లో తీసిన జాక్ ఫొటో ఒకటి. రంగు పెన్సిళ్లు తీసుకుంటున్నప్పుడు... డ్రాయింగ్ వేసే సమయంలో జాక్ సీరియస్ ముఖం ఎంతోమందిని ఆకట్టుకుంది. కొన్ని గంటల్లోనే లక్షలాది మంది ఆ ఫొటోను చూసి, లైక్ చేశారు. 'అద్భుతం' అంటూ కామెంట్లు కూడా పెట్టారు. దీనితో, హఠాత్తుగా జాక్‌కు స్టార్‌డమ్ వచ్చేసింది. జాక్ చదువుతున్న పాఠశాలలో ఎక్కువ మంది పేదలే ఉన్నారని, వారికి సాయం చేసేందుకు ముందుకు రావాలని అదూఫా ఇచ్చిన పిలుపులకు వేలాది మంది సానుకూలంగా స్పందించారు. మొదటి రెండు గంటల్లోనే 2000 డాలర్లు విరాళాలు రూపంలో వచ్చాయి. జాక్ ఫొటోను చూసి, ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది ఇచ్చిన విరాళాలు 20,000 డాలర్లకు చేరుకున్నాయి. ఆ మొత్తాన్ని ఆ స్కూల్‌కు ఇచ్చిన అదూఫా తన నిజాయితీని నిరూపించుకున్నాడు. ఈ ఘనతకు కారణమైన బాలుడు జాక్‌కు మాత్రం తాను సెలబ్రిటీ కిడ్‌గా మారిన విషయం తెలియదు. చిత్రకళలో అతను ఉన్నత శిఖరాలు అధిరోహిస్తాడని ఆశిద్దాం.





## వృద్ధాప్యం శాపం కారాదు..




అవుననుకున్నా.. కాదనుకున్నా... ప్రతి వ్యక్తికీ వృద్ధాప్యం అనివార్యం. ఎప్పటికీ ఒక వయసులో ఉండిపోవడం అసాధ్యం. బాల్యం, కౌమారం, యౌవనం, వార్ధక్యం... ఈ నాలుగూ జీవితంలో నాలుగు ప్రధానాంశాలు. మిగతా మూడూ దశలూ చాలా త్వరగా ముగిసినట్లు... వార్ధక్యం మాత్రం వెంటాడి వేధిస్తున్నట్టు భావించే వాళ్లు కోకొల్లలు. వృద్ధాప్యాన్ని శాపం అనుకునే వారి సంఖ్యకు కొదువ లేదు. కానీ, వార్ధక్యాన్ని భారంగానో... శాపంగానో భావించి, లోలోపల కుంగిపోవాల్సిన అవసరం లేదు. జీవితంలో ఇది సంధ్యాసమయం. ఉన్నది మరికొద్దిపాటి జీవితమే. అందుకే, ఊపిరి పీల్చుకుంటున్న ప్రతి క్షణం సానుకూల దృష్టితోనే కనబరచాలి. ఉత్సాహంతో చివరి మజిలీని పూర్తి చేయడానికి సిద్ధపడాలి. వార్ధక్య దశ అందరి జీవితాల్లోను ప్రవేశిస్తుంది. తాత్వికచింతనకు, సామాజికసేవకు ఈ దశ ఎంతో అనుకూలమైనది. శాస్త్రీయ, జీవన ధర్మాలను ఆచరించడానికీ ఈ దశ ఉపయోగకరంగా ఉంటుంది. ఈ దశలో శాంతి మార్గంలో నడవాలని రుషులు ప్రబోధించారు. వృద్ధాప్యంలో మనిషి సమస్యలనుంచి విముక్తిని ఆపేక్షిస్తాడు. ప్రశాంత జీవనవిధానం కోరుకుంటాడు. ఈ దశను ఆదర్శంగా మలచుకుంటే ఎలాంటి వాళ్లయినా పరిపూర్ణ మనశ్శాంతిని పొందుతారు. సాధారణంగా మనిషి వృద్ధాప్య దశ గురించి ముందుగా ఆలోచించి భయంతోను, ఆందోళనలోను నిత్యం విచారగ్రస్తుడవుతుంటాడు. దీనివల్ల మానసిక స్థైర్యం కోల్పోయి ముందుగానే వృద్ధుడవుతాడు. నిజానికి వృద్ధాప్యం శరీరానికే తప్ప మనసుకు కాదు. ఎలాంటివాళ్లకైనా మనసెప్పుడూ నిత్యనూతనంగా, చైతన్యవంతంగా ఉండాలి. మనసు ఆశలకు, ఆశయాలకు నిలయం. ఆ మనసును నచ్చిన వ్యాపకం వైపు, మంచి కార్యాల వైపు మళ్ళిస్తే మనిషి తన వయసును, వార్ధక్యాన్ని కూడా మరిచిపోతాడు. ఇంక వృద్ధాప్యంలో ప్రతి మనిషీ ఓ తోడుకోసం పరితపిస్తాడు. ఒంటరితనం భరించలేకపోతాడు. ఎవరు దూరమైనా విలవిల్లాడిపోతాడు. దీనికి కారణం ఆత్మజ్ఞానం లోపించడమే. ఆధ్యాత్మిక పథంవైపు ప్రయాణించే మనిషి తన శరీరం గురించి ఏ క్షణమూ ఆలోచించడు. అంతర్ముఖుడై పరమాత్మ అన్వేషణలో నిమగ్నమవుతాడు. ఎవరు దూరమైనా చింతించడు. మానవ జన్మ సార్థకతను తెలుసుకుంటూ సన్మార్గంవైపు ప్రయాణిస్తాడు. ఆత్మవిశ్వాసం కలిగిన మనిషి వార్ధక్యంలోనూ అఖండ విజయాలు సాధిస్తాడని ఎందరో మహానుభావులు రుజువుచేశారు. ఏభైమూడో ఏట మార్గరేట్ థాచర్ బ్రిటన్కు తొలిమహిళా మేయర్‌గా ఎన్నికైంది. తన అరవై అయిదో ఏట విన్‌స్టన్ చర్చిల్ ప్రధానమంత్రి అయ్యాడు. హిట్లర్‌ని ఎదుర్కోగలిగాడు. ప్రతి మనిషిలోనూ అనంతమైన శక్తి అంతర్గతంగా ఉంటుంది. దాన్ని వెలికితీయాలి. ఛార్లెస్ డికెన్స్ రచనలకు మొదట్లో ఆదరణ దక్కలేదు. అయినా అతడు నిరాశపడలేదు. ఆత్మవిశ్వాసంతో రచనా వ్యాసంగం కొనసాగించి గొప్ప రచయితగా పేరు సంపాదించాడు. థామస్ ఆల్వా ఎడిసన్కి చెందిన మిలియన్ల డాలర్ల విలువచేసే సంస్థ అగ్నికి ఆహుతి అయినప్పుడు ఆయన వయసు అరవై ఏడు. అప్పుడు ఎడిసన్ ఊహ ఎలా ఉందో తెలుసా! ఇక ముందు కొత్త విషయాలపై దృష్టి కేంద్రీకరించాలని భావించి ఫొటోగ్రఫీని కనుగొన్నాడు. ఎవరికైనా తన శక్తియుక్తులమీద పరిపూర్ణమైన విశ్వాసం ఉండాలి. అప్పుడు ఏ దశలోనైనా మనిషి ఉత్సాహభరితంగా ఉంటాడు. వృద్ధాప్యం గురించి ఏనాడూ ఆందోళన చెందడు. ఒక్కసారి ప్రకృతిని గమనించండి. ఎన్ని సంవత్సరాలైనా వృక్షాలు ఫల సంపదను ప్రాణికోటికి అందిస్తూనే ఉంటాయి. అలాగే పశుపక్ష్యాదులు తమ ఆహారాన్ని తామే సంపాదించుకుంటాయి. మనిషి కూడా ప్రకృతిని స్ఫూర్తిగా తీసుకోవాలి. వార్ధక్యాన్ని మరిచిపోయి ప్రశాంతమైన జీవన విధానం అవలంబించాలి. ఆదర్శవంతమైన కార్యాలు చేయాలి. పనిలో నిమగ్నమైన మనిషికి వార్ధక్యం గురించి ఎలాంటి ఆలోచనారాదు. అప్పుడతడు ప్రజల దృష్టిలో వృద్ధుడు కాదు. ఓ ఆదర్శపురుషుడు.

## ఒగ్గు కథకు జీవం పోస్తున్న భరత్



జానపద కళలను ప్రాణపదంగా మార్చుకొని రంగస్థల వేదికపై తమ ప్రతిభను చాటుతూ ఒగ్గుకథ పితామహుడు మిద్దె రాములును మైమరపిస్తూ..ఒగ్గు కథ జానపదాలకు జీవం పోస్తున్నారు...వివరాల్లోకి వెళ్లితే సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం జనగామ గ్రామానికి చెందిన అల్లాడి కొమురయ్య కోమలతల కుమారుడు భరత్ గజ్జె కట్టి గళం విప్పితే వేదిక సందడిగా మారుతుంది.పురాణ చరిత్రలను ఇతిసాహిత్యా సన్నివేశాలను కళ్లకు కట్టినట్టుగా ఒగ్గుకథ రూపంలో చూపించడంలో సిద్ధహస్తుడిగా రాణిస్తున్నాడు.తండ్రి బాటలో తనయుడు అల్లాడి భరత్ డిగ్రి ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తునే ఒగ్గుకథలో తనకంటూ గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. గ్రామీణ ,పట్టణ ప్రాం తాలకు ఒగ్గుకథ చెబుతూ కుటుంబానికి బాసటగా నిలుస్తున్నాడు.తన తండ్రి కొమురయ్య ప్రదర్శించిన ఒగ్గుకథలను చెప్పి న విధానం గమనించిన భరత్‌కు అప్పటినుంచి ఒగ్గుకథపై ఆసక్తి పెంచుకొని తండ్రి బృందంలోనే చేరి స్త్రీ వేషధారణ పాత్రల్లో సుమారు ఇప్పటి వరకు సుమారు వంద వరకు కథలను అనర్గళంగా ప్రదర్శిస్తూ గ్రామస్థులతో భేష్ అనిపించుకుంటున్నాడు.

**ఆదరణ కోల్పోతున్న కళ... ప్రభుత్వం ఆదుకోవాలి**

ఒగ్గుకథా కళాకారుల ప్రతిభ మహా అద్భుతం.విభిన్న పాత్రలకు జీవం పోస్తూ నిత్యం కళామతల్లి సేవకే అంకితమవుతున్నారు. అయితే వారి దర్పం కేవలం రంగస్థలం పైనే కనబడుతున్నాయి. నటనలో వారిలో కనిపించే దర్పం,తీవి నిజజీవితంలో మాత్రం కానరావడం లేదు.ఒకప్పుడు గ్రామాల్లో జరిగే శుభకార్యాలకు,జాతరలకు కళాకారులను ఆహ్వానించి వీరితో ప్రదర్శనలు ఇప్పించే వారు.సుమారు 8090 వరకు పురాణ గాథలను అనర్గళంగా ప్రదర్శించే కళాకారులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సహం కరువైందని అక్కన్నపేటకు చెందిన ఒగ్గు కళాకారుడు నకీర్తి పర్శరాములు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రదర్శనలకు ఆహ్వానించే వారు కరువై కళాకారులు దుర్భరజీవితాన్నీ అనుభవిస్తున్నారు.వృద్ధ కళాకారులకు పింఛన్లు అందించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఒగ్గు కళాకారులను పట్టించుకోవడం లేదని,ఈ మేరకు ప్రభుత్వ పథకాల్లో తమకు ప్రత్యేక గుర్తింపునిచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.



ప్రజాపక్షం/అక్కన్నపేట

## కూనంనేని సమక్షంలో సిపిఐలో 20 కుటుంబాలు చేరిక



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి :** లక్ష్మీదేవిపల్లి మండలం దుద్యా పంచాయతీకి చెందిన 20 కుటుంబాలు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో సిపిఐ పార్టీలో చేరారు. వీరికి ఎర్ర కండువాలు కప్పి పార్టీకి ఆహ్వానించారు. దూద్యా పంచాయతీ నుండి దంజీ, దంచింగ్, కిషన్, బాల్‌సింగ్, భట్టు బాలు, భద్య, బ్రహ్మాచారి, రాజు, సురేష్, శ్రీను పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పార్టీ చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యకర్తలకు అన్నివేళలాల అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు దీటి లక్ష్మి పతి, కంటెం శ్రీనివాస్, దేవరగట రాంబాబు, లగడపాటి రమేష్, మిర్యాల రాము, అక్కిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు

## ఆరుట్ల కమలాదేవి, రామచంద్రా రెడ్డి పోరాటపటిమ నేటి యువతకు ఆదర్శం

**స్మారక కబడ్డీ క్రీడా మహోత్సవాల ముగింపు సభలో వక్తలు**



**ప్రజాపక్షం / యాదాద్రి ప్రతినిధి :** తెలంగాణ సాయుధ పోరాటయోధులు ఆరుట్ల కమలాదేవి, రామచంద్రా రెడ్డి పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శమని పలువురు వక్తలు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జరిగిన ఆరుట్ల కమలాదేవి రామచంద్రరెడ్డి స్మారక కబడ్డీ క్రీడా మహోత్సవాల ముగింపు, బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఎ బీర్ల ఐలయ్య, అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకట రెడ్డి, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర రావు, మాజీ ఎం ఎల్‌ఎలు మోత్కుపల్లి నరసింహులు, గొంగిడి సునీత హాజరయ్యారు. కబడ్డీ క్రీడా మహోత్సవాలలో భాగంగా ముగింపు ఆటను వీక్షించారు. అనంతరం కబ్బడి క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు, మెమెంటోలు అందజేశారు. ఈ సమావేశంలో విద్యార్థులు చేసిన నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట వీరులుగా తన భర్త పోరాటయోధుడు రామచంద్ర రెడ్డి సహకారంతో ఘన కీర్తి సాధించిన నాయకురాలు ఆరుట్ల కమలాదేవి అని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర శాసనసభలో తొలి ప్రతిపక్ష నాయకురాలిగా నిలిచిన ఆలేరు నియోజకవర్గం మంతపురి గ్రామంలో జన్మించిన బిడ్డ ఆరుట్ల కమలాదేవి ఆశయాలు సాధించాలని కోరారు. తమ నాయకులకు ఆరుట్ల కమలాదేవి రామచంద్ర రెడ్డి స్ఫూర్తిగా నిలిచారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఈ ప్రజా ప్రభుత్వం కూడా విద్యార్థులకు క్రీడా స్ఫూర్తి ఉండాలని సీఎం కప్ లాంటి క్రీడా మహోత్సవాలను నిర్వహిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటయోధులు ఆరుట్ల కమలాదేవి, రామచంద్ర రెడ్డి పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శమన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నాడు సిపిఐ నేతృత్వంలో చేపట్టిన తెలంగాణ రైతాంగ సాయుధపోరాటంలో భాగంగా ఊరూరా ఉద్యమకారులు, ప్రజలు దండుకట్టి రజాకార్లను ఉరికించడంలో వారు కీలకపాత్ర పోషించారన్నారు. సామాజిక కార్యక్రమాల ద్వారా వారి పోరాటాలను నేటి తరానికి తెలియజేయాలన్నారు.

## పేదలకు చెందాల్సిన అసైన్డ్ భూములు పెద్దలకు కట్టబెట్టారు

సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాజన్న సిరిసిల్ల జిల్లాలో తన అనుచర వర్గానికి వేలాది ఎకరాలు అసైన్డ్ భూములు అక్రమ కబ్జాలు దొంగ పట్టాలు చేయించారని సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. బుధవారం సుభాష్ నగర్ సిపిఐ కార్మి క భవనంలో సిపిఐ నాయకులతో కలిసి సమావే శం నిర్వహించి, ఆయన మాట్లాడారు. కేవలం తంగళ్లపల్లి మండలంలోనే 1000ఎకరాలకు పై న భూములు భూ కబ్జాకు గురయ్యాయని అన్నా రు. ఈ కబ్జాకు గురైన భూములను పట్టా చేయడంలో కీలక పాత్ర పోషించిన రెవెన్యూ అధికారు లు, ఎమ్మార్వో అంజయ్య, ఆర్ఐ సంతోష్, విఆర్ఒ శ్యామలపై వారి ఆస్తులపై సిబిఐ విచారణ జరిపి వాస్తవాలను తెలుసుకుని వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ని యోజకవర్గ స్థాయిలో అసైన్డ్ భూములకు ఎవరికైనా పట్టాలు చేయాలన్న ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తరువాతనే ఇతరులకు పట్టాలు చేయాలని కానీ అందినకాడికి దోపిడి చేయడానికి రెవెన్యూ అధికారులు మంత్రుల మెప్పు పొం దడం కోసం నిజమైన పేదలకు చెందాల్సిన అసైన్డ్ భూములను పెద్దలకు కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ఎకరానికి ఎన్‌ఓసి ఇప్పించి ప్రొసిడింగ్స్ ఇచ్చి పట్టా పాసుబుక్ ఇచ్చి రైతు బంధు ఇచ్చే తతంగాన్ని పూర్తి చేసినందుకు రెం డు లక్షల వకు రెవెన్యూ అధికారులు లంచాలు తీసుకుని బహిరంగగానే ఈభూములు పట్టాలు కబ్జాకు ఇచ్చారన్నారు. అసైన్డ్ భూములు పేదల కు తప్ప పెద్దలకు ఇవ్వకూడదని చట్టం చెబుతున్నప్పటికి ఈ చట్టాన్ని తుంగలో తొక్కి కోట్లాది రూాల లంచాలు దిగమింగి అప్పటి విఆర్ఒ, ఎ మ్మార్వో ఆర్‌ఐలను ఆర్‌డిఒలను ఎవరిని కూడా వదలకుండా కోట్లాది రూ.లు మింగిన అధికారులను నుండి రికవరీ చేయాలని డిమాండ్ చేశా రు. చట్టం తన పని తాను చేసుకుని పోవాల్సిం దే, అసైన్డ్ భూములు వాపస్ తీసుకుంటూ అదే గ్రామంలో ఉన్నటువంటి పేదలకు పంచాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు.

## ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై విచారణ చేయాలి

అడిషనల్ కలెక్టర్‌కు ఎఐఎస్‌ఎఫ్ వినతి

**ప్రజాపక్షం / కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ పట్టణంలోని శర్మ నగర్ జ్యోతి భాపూలే గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన జరగడం పట్ల సమగ్ర విచారణ జరిపించాలని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్న ఏ మాత్రం కూడా వాటిపైన విచారణ జరిపించకుండా కేవలం హంగులు, ఆర్భాటాలకే కాంగ్రెస్ ప్రభుత్వ పరిమితం అయ్యిందని అన్నారు. కరీంనగర్ పట్టణంలో శర్మ నగర్‌లోని జ్యోతిభాపూలే గురుకులాల్లో విద్యార్థులు రాత్రి భోజనంలో ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు హస్పిటల్‌లో చేరిన పరిస్థితి నెలకొందని దీనికి కారణమైన కాంట్రాక్టర్లను ఆర్‌సివోను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నాసిరకమైన, నాణ్యత లేని కూరగాయలను కాంట్రాక్టర్లు వారి కక్కుర్తితో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. వెంటనే కాంట్రాక్టర్లను వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షుడు కనకం సాగర్, నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి పాల్గొన్నారు.



## మోదీది రైతు వ్యతిరేక ప్రభుత్వం

- జగ్‌జీత్ సింగ్ డల్లేవాల్ నిరాహార దీక్షను విరమింపజేయాలి : బాగం
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన, ధర్నా




**ప్రజాపక్షం/ఖమ్మం :** వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే దిశగా పాలన సాగిస్తున్న మోదీది రైతు వ్యతిరేక ప్రభుత్వమని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపించారు. దశాబ్ద కాలంగా వ్యవసాయ రంగానికి సంబంధించిన సబ్సిడీలను ఎత్తివేయడంతో పాటు వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించాలని ప్రయత్నిస్తుందన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో పంటలకు మద్దతు ధర ప్రకటించాలని 44 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జగ్‌జీత్ సింగ్ డల్లేవాల్ నిరాహార దీక్షను ప్రభుత్వం ఉపసంహరింపజేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు ముందు వెంకటాయపాలెం నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళనను ఉద్దేశించి బాగం హేమంతరావు మాట్లాడుతూ మోడీ సర్కార్ వ్యవసాయ రంగానికి సంబంధించి మూడు నల్ల చట్టాలను తీసుకు వచ్చిందని సుదీర్ఘ కాలం పాటు భారతదేశ రైతాంగం సాగించిన బహుముఖ పోరాటాలతో తాత్కాలికంగా మూడు నల్ల చట్టాల అమలును ఉపసంహరించుకుందన్నారు. అదే సమయంలో వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి కనీస మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని ప్రకటించేందుకు హామీ ఇచ్చిందని కాని మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దొడ్డిదారిన నల్ల చట్టాల అమలుకు పూనుకుంటుందని హేమంతరావు తెలిపారు. వ్యవసాయ రంగానికి మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని ప్రకటించడంలో విఫలమైందన్నారు. జాతీయ సంస్థలను, జాతి సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్లకు అప్పగించే పనిలో ఉందని ఆయన స్పష్టం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేస్తున్న మోడీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆయన తెలిపారు. నల్ల చట్టాల రద్దు, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం అమలు కోసం 44 రోజులుగా దీక్ష చేస్తున్న జగ్‌జీత్ సింగ్ డల్లేవాల్ నిరాహార దీక్షను ఉపసంహరింపజేయాలని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని వెంటనే ప్రకటించాలని లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం ప్రకటించేంత వరకు ఆందోళన కొనసాగుతుందని ఆయన తెలిపారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ పరిపాలన అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు మిడికంటి వెంకటరెడ్డి, రామ్మూర్తి, తాటి వెంకటేశ్వరరావు, జాగర్లమూడి రంజిత్‌కుమార్, పగడాల మల్లేష్, పుచ్చకాయల సుధాకర్, కూచిపూడి రవి, ఏనుగు గాంధీ, రైతు సంఘం నాయకులు యడ్లపల్లి శంకరయ్య, నల్లమోతు నర్సింహారావు, శ్రావణ్, మల్లికార్జున్, ఆనందరావు, సాంబశివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఇసినగర్ సొసైటీ అధ్యక్షులుగా బి.శ్రావణ్‌కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/చర్లపల్లి :** కాలనీలోని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తా నని ఇసి నగర్ హౌసింగ్ సొసైటీ నూతన అధ్య క్షులు బూడిద శ్రావణ్ కుమార్ గౌడ్ అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఇసిఐఎల్ ఎంప్లాయిస్ కోఆపరే టివ్ సొసైటీకి నిర్వహించిన ఎన్నికల్లో డైరెక్టర్లుగా ఏడుగురు విజయం సాధిం చారు.నూతన అధ్యక్షులుగా శ్రావణ్ కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా పద్మిని, ప్రధాన కార్యదర్శిగా జగ్గరాజు, కోశాధికారిగా కె.ఇందిర, డైరెక్టర్లు ఎన్నిక య్యారు. నూతన సభ్యులచే ఎన్నికల అధికారి పమాణం చేయించారు.

# మహానగరి

## చిన్నారిపై అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడి అరెస్టు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** చిన్నారిపై ఓ యువకుడు అసభ్యకరంగా ప్రవ ర్తించిన ఉదంతం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం గత మంగళవారం జవహర్‌నగర్ ప్రాంతంలో నివసించే నాలుగేళ్ల బాలిక ఇంటి ముందు ఆడుకుంటూ ఉండగా సమీప ప్రాంతంలో ఉండే షేక్ ఉమర్(46) తనపై అసభ్యకరంగా ప్రవర్తించిన విషయాన్ని రోధిస్తూ చెప్పింది. ఈ మేరకు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్టు చేశామని ఇనస్పెక్టర్ తెలిపారు.



## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా వార్తా కథనాలను ప్రచురించాలని కుత్బుల్లాపూర్ నియో జకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజాపక్షం తెలుగు దినపత్రిక నూతన సంవత్సరం కాలమానాన్ని హన్మంత రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డిలు వేర్వేరుగా ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి, నాయకులు మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## కీచక ప్రిన్సిపాల్‌ను అరెస్ట్ చేయాలి



**ప్రజాపక్షం/చర్లపల్లి :** కుషాయి గూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని సదాశివ హై స్కూల్‌లో మంగళ వారం పదవ తరగతి విద్యార్థి నుల పట్ల అసభ్యంగా ప్రవర్తిం చిన స్కూల్ ప్రిన్సిపాల్ నాగేం దర్‌రావుపై కేసు నమోదు చేసిన ఇంత వరకు అరెస్టు చేయకపోవడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు న్యాయం కావాలంటూ స్కూల్ ముందు బైఠా యించారు. ప్రిన్సిపాల్‌ను అరెస్టు చేయ కపోవడంతో పలు అనుమానాలకు దారి తీస్తుందని తల్లిదండ్రులు ఆరోపిస్తు న్నారు. ప్రిన్స్‌పాల్‌పై కేసు చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రిన్సిపాల్‌ను అరెస్ట్ చేశాం : సిఐ అంజయ్య

విద్యార్థినీలపై అసభ్యంగా ప్రవర్తించిన సదాశివ స్కూల్ ప్రిన్సిపాల్‌పై మంగళవారం కేసు నమోదు చేసిన అరెస్టు చేయకపోవడం ఏమిటని సిఐ అంజయ్యను వివరణ అడగగా నిందితున్ని అరెస్టు చేసినట్లు తెలిపారు.

## రైతువేదికల పనితీరు భేష్

రాజస్థాన్ వ్యవసాయ సెక్రటరీ ఐఎఎస్ రాజన్‌విశాల్



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** శామీర్ పేటలోని రైతు వేదికల పనితీరు సంతృప్తికరంగా ఉందని రాజస్థా న్ రాష్ట్ర వ్యవసాయ సెక్ర టరీ ఐఎఎస్ రాజన్ విశాల్ అన్నారు. బుధవారం శామీర్‌పేట మండలం అలియాబాద్‌లోని రైతువేదిక కార్యాల యాన్ని అధి కారులతో కలిసి సందర్శించారు. రైతు వేదికల ద్వారా రైతులకు అందిస్తున్న పలు రకాల సేవలపై ఎఒ రమేష్‌ను, వ్యవసాయాధికారులను అడిగి తెలు సుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్, రైతు లకు శిక్షణ కార్యక్ర మాలు, పంటలు సస్యరక్షణ చర్యలు, ప్రభుత్వం ద్వారా రైతులకు అందిస్తున్న పలు పథకా లు, పంట నమోదు, తదితర అంశాలను అడిగి తెలుసుకుని సంతృప్తి చెం దారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెలం గాణ వ్యవసాయ కార్యా లయం డిఎఒ సింగారెడ్డి, ఎడిఎ వినోద్‌కుమార్, మేడ్చల్ ఎడిఎ వెంకట్రామ్‌రెడ్డి, ఎంఎఒ, ఏఇఒలు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/మేడ్చల్ జిల్లా ప్రతి నిధి :** తెలం గాణా రెవెన్యూ సర్వే సెస్ అసోసియే షన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా ప్రథ్వి, అసోసియేట్ అధ్యక్షు డిగా నవీన్‌రెడ్డి, ఉపాధ్యక్షు లుగా సునీల్, దుర్గా భవాని, శెర్నా ల్ నాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సైదిరెడ్డి, ఫారు క్, కార్యద ర్శులుగా చంద్రకళ, నవీన్, మహేం దర్, అభిలాష్, సంయుక్త కార్యదర్శిగా బలరాం, వినయ్, రవి, విజయ కుమార్, కోశాధికారిగా శ్యామ్ సన్నాల్ కార్య వర్గసభ్యులుగా మహేందర్, విన య్, నరసింహ, రతన్‌రా జాలు నియ మితులయ్యారు. ఈ కార్యక్రమా నికి తహసీల్దార్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్,రాములు, ప్రధాన కార్యదర్శిగా రమేష్, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్‌లు హాజరయ్యారు.

## విద్యార్థి యువజన సంఘాల ధర్నా

**ప్రజాపక్షం/కాప్రా :** విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సదాశివ పాఠశాల ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకొని వెంటనే అరెస్టు చేయాలన్న డిమాండ్‌తో ఆ పాఠశాల ఎదుట పలు విద్యార్థి యువజన సంఘాల ఐక్య కార్యచరణ సమితి బుధవారం ధర్నా చేశారు. ధర్నాలో పాల్గొన్న ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివానంద్, బిజెవైఎం జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి లింగం, ఎన్ఎస్‌యూఐ ఉప్పల్ అసెంబ్లీ అధ్యక్షుడు కిషోర్‌లు మాట్లాడారు. అనంతరం వారు కాప్రా మండల విద్యా శాఖాధికారి బాపురెడ్డికి ఈ మేరకు వనతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్వప్న, బిందు, తరుణ్, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** విద్యార్థి దశ నుండే చట్టాల పట్ల అవగాహనతో పాటు నేరస్తుల బారిన పడకుండా తీసుకో వాల్సిన జాగ్రత్తల గురించి తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు తెలియ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నేరేడ్‌మెట్ ఎస్సై శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ కాంతయ్యలు అన్నారు. సాయినాథపురంలోని రామకృష్ణా విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్యావసరంగా మారిన మొబైల్ ఫోన్ల ద్వారా ఎలా ంటి సైబర్ నేరాలు జరుగుతున్నాయని, వాటి బారిన పడకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుం దన్న విషయాలపై ఆయన తెలియచేసారు. నేరస్తుల బారిన పడ కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎలా ంటి నేరాల బారిన పడినా, అనుమానం కల్గినా వెంటనే డయల్ 100కు కానీ సమీప పోలీస్ స్టేషన్ అధికారులను కానీ సంప్రదించాలని కోరారు.

## మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలోని స్వయం సహా యక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటు ప్రగతిపై జిల్లా కలె క్టర్లతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించా రు. జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ పాల్గొన్నారు. రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభు త్వ లక్ష్యమన్నారు. కలెక్టర్ మా ట్లాడుతూ ప్రభుత్వ అదేశాల ప్రకారం మహి ళలు ఆర్థిక సాధికారత సాధిచేస్తేనే ఎదుగులకు అవకాశాలు ఏర్పాడతయని అన్నారు.ఆర్థిక సహాయం కోసం బ్యాంక్ అధికారులతో సమన్వయం చేయా లన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మండల తహసీల్దార్లకు అటవీ , ప్రభుత్వ భూములను గుర్తించి నివేదికలు సమర్పించాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఒ శ్రీనివాస్ ,ఎస్సీ ఎలక్ట్రిసిటీ లీలావతి , అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ , గిరిజన సంక్షేమఅధికారి కమలకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నైపుణ్యాల ప్రదర్శనకు 'మెట్రో' వేదిక

ముఖ్యమైన స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని వెల్లడించిన మెట్రో ఎండి.ఎన్‌విఎస్‌రెడ్డి





**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిత్యం లక్షలాదిగా ప్రయాణించే మెట్రో రైల్ ఇప్పుడు ప్రయాణికుల కు కొత్త అనుభూతిని అందించబోతోంది. ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారంగా మెట్రోను ఆశ్రయిస్తూ ప్రయాణిస్తున్న అనేక మందిలో వివిధ కళా, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ఉన్న అభిరుచిని ప్రదర్శించుకునే గొప్ప అవకాశాన్నిఇవ్వనున్నది మెట్రో. ఇందుకు ఎంజిబిఎస్ వంటి కొన్ని విశాల మైన స్టేషన్లలో తమ నైపుణ్యాలను ప్రదర్శించుకు నేందుకు తగిన స్థలం కేటాయించనున్నట్టు హెచ్ ఎంఆర్ఎల్, హెచ్ఎఎంఎల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి వెల్లడించారు. సంక్రాంతి పండగను పురస్కరిం చుకుని ఎల్ అండ్ టీ మెట్రో, హైదరాబాద్ మె ట్రో రైల్ సంస్థలు 'మి టైం ఆన్ మెట్రో' పేరుతో మూడు రోజుల వినూత్న ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఈ మెట్రో పండుగను జెబిఎస్ మెట్రో స్టేషన్ లో హెచ్ఎంఆర్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి, ఎల్ అండ్ టీ మెట్రో రైల్ హైదరాబాద్ ఎం డి, సిఇఒ కెవిబి రెడ్డి ఈ రోజు ప్రారంభించారు. మెట్రో అం కేవలం కాంక్రీట్, గోడల నిర్మాణాల తో కూడిన ఒక రవాణా వ్యవస్థ మాత్రమే కాదని, ఇది హైదరాబాద్ జనజీవితాలతో ముడిపడి ఉన్న ఆత్మ వంటిదని ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు.

**కొత్త కారిడార్లకు మెగా జంక్షన్:** ఫేజ్ 2 పార్ట్ 'బి' లోని ప్రతిపాదిత జేబీఎస్ శామీర్ పేట్ (22 కి.మీ), ప్యారడైజ్ మేడ్చల్ (23 కి.మీ) మార్గా లకు ఉమ్మడిగా ఒక మెగా జంక్షన్ ను ఏర్పాటు చేయాలని ముఖ్య మంత్రి సూచనల మేరకు ప్రణాళి కలు సిద్ధం చేస్తున్నామని ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. రెండవ దశ పార్ట్ 'ఏ' అయిదు కారిడార్లకు సంబం ధించి ఇప్పటికే కేంద్రానికి పంపిన డిపిఆర్ లను త్వరలో ఆమోదింప జేయడానికి ప్రయత్నాలు జరుగు తున్నాయని, ఆ అనుమతులు రా గానే ఆ పనులు త్వరితగతిన ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. ఈ లోగా పాతనగరంలో భూసేకరణ చేస్తూనే, రోడ్డు విస్తర ణకు, మెట్రో నిర్మాణానికి కూల్చివేతల పనులు త్వరలోనే చేపట్టనున్నట్టు ఎన్వీఎస్ రెడ్డి తెలిపా రు. 'మి టైం ఆన్ మెట్రో' ప్రచారంలో భాగంగా ల ఘు చిత్రాలను, నృత్యాలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. అలాగే సంక్రాంతి సంబురాలు, ఈ ప్రచార కార్యక్రమం ప్రతిబింబించేలా రూపొ ందించిన మెట్రో రైలుని ఎన్‌విఎస్ రెడ్డి, కెవిబి రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

## ఇంజనీరింగ్ విద్యపై అంతర్జాతీయ సదస్సు

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి విఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యపై అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఇంజనీరింగ్ విద్య రూపాంతరణ ఇతి వృత్తంగా ఉత్పాదక యంత్రమేధ తరంలో ఇంజనీరింగ్ విద్యలో అవసరమైన సమూలమైన మార్పులు కేంద్రంగా మూడు రోజుల పాటు ఈ అంతర్జాతీయ సదస్సు జరుగనుంది. విఎన్ఆర్ విజెఐఈటి సహా విజ్ఞాన్ జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సంస్థలతో పాటు ఇండో యూనివర్సల్ కొలాబిరేషన్ ఫర్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో ఎబిఈటి (యూఎస్ఎ) సిఇఓ డాక్టర్ మైఖేల్ మిలిగన్, ఐయూసిఈఈ వ్యవ స్థాపకులు ఆచార్య డాక్టర్ కృష్ణ వేదులతో పాటు యూఎస్ఎ, ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, ఫిన్‌లాండ్, పోర్చుగల్ తదితర దేశాల నుండి, భారత దేశంలోని పలు రాష్ట్రాల నుండి విద్యావేత్తలు, పరిశ్రమల నిపుణులు పాల్గొన్నారు. ఈ సదస్సులో ఐయూసి ఈఈ వార్షిక విద్యార్థి సమితి ఐఎస్ఎఫ్ 2025 పేరిట పలు రాష్ట్రాల విద్యార్థుల డిజైన్ థింకింగ్, ఇంజనీరింగ్ ప్రాజెక్టుల ప్రదర్శనతో సహా విద్యార్థులు, అధ్యాపకులకు ప్రత్యేక కార్యశాలలు కూడా నిర్వహించారు. కార్యక్రమంలో విఎన్ఆర్ విజెఐఈటి డీన్ ఆచార్య డాక్టర్ వై.పద్మశాయి, సంచాలకులు డాక్టర్ బి.చెన్నకేశవరావు, ప్రధానాధ్యాపకులు డాక్టర్ సిడి నాయుడు, విజెఐఎం సంచాలకులు డాక్టర్ భరత్ భూషన్ సింగ్, విజ్ఞాన్ జ్యోతి సంస్థల పురోగమన సంచాలకులు డాక్టర్ కోడె సంధ్య, పూర్వాధ్యక్షులు డాక్టర్ డిఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.





## టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో తనిఖీలు

గంజాయి విలువ రూ.7.50లక్షలు స్వాధీనం



**ప్రజాపక్షం/తాండూరు** తాండూరు రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు చేసిన తనిఖీలో ఒరిస్సా రాష్ట్రా నికి చెందిన ఓ వ్యక్తి వద్ద 30కిలోల గంజాయి స్వాదినం చేసుకున్నారు. రైలు మార్గంలో కలోల కొద్ది గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న గంజాయి బస్తాలను ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పట్టు కున్నారు.ఈ ఘటన మంగళవారం తాండూరు రైల్వే స్టేషన్‌లో జరిగిం దని ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు వెల్లడించారు. ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెం ట్ డైరక్టర్ బీబీ కమలహాసన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరిండెంట్ విజయ భాస్క ర్‌రెడ్డి ఆదేశాల మేరకు విశ్వాస నీయ సమాచారం మేరకు వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ బృందం శ్రీనివాస్‌రెడ్డి, ప్రమ్‌కుమార్‌రెడ్డిల నేతృత్వంలో తాండూరు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. అయితే తాండూరు మీదుగా వెళ్లె కోణార్క్ ఎక్స్‌ప్రెస్ లో వచ్చిన ఒరిసా రాష్ట్రానికి చెందిన శిబిరామ్ స్వాన్ అనే వ్యక్తి అనుమానస్పదంగా కనిపించడంతో అతని వద్ద ఉన్న బ్యాగులను సోదా చేశారు. అతని బ్యాగ్‌లో 12కిలోల ఎం డు గంజాయి మరో బ్యాగులో 18కిలోల గంజాయిని గుర్తించారు. అతని30కిలోల గంజాయిలభించిందని,సుమారురూ.7.50లక్షల ఉం టుందని పోలీసులు తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని విచారించగా కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తీసుకవచ్చనట్లు తెలిపాడని వెల్లడించారు. ఈ మేరకు ఆ వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ డైరక్టర్ బిబి కమలహసన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరిడెంట్ విజయభాస్కర్‌రెడ్డిలు అభినందించారు.

## ప్రజల పక్షాన నిలబడేది 'ప్రజాపక్షం'

క్యాలెండర్ ఆవిష్కరించిన తాండూరు ఎంఎల్ఎ బుయ్యాని మనోహర్‌రెడ్డి





**ప్రజాపక్షం/తాండూరు :** ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ ప్రజా సమస్యలపై వెలుకి తీస్తూ ప్రజల పక్షాన నిలబడేది ప్రజాపక్షం మని తాండూరు ఎంఎల్ఎ బుయ్యాని మనోహర్‌రెడ్డి అన్నారు. బుదవారం తాండూరులోని గౌతమి మాడల్ స్కూల్‌లో 2025నూతన సంవత్సర నూతన క్యాలెండర్‌ను ఎంఎల్ఎ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలికి తీస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్న పత్రిక ప్రజాపక్షమని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ రవిదంర్‌గౌడ్, తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పటోళ బాల్‌రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మురళీగౌడ్, కోట్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ సాయిని నారాయణరెడ్డి, అజయ్ ప్రసాద్, గౌతమి మాడల్ స్కూల్ కరస్పాండెంట్ మహిపాల్‌రెడ్డి, నాయకులు ఉత్తమ్‌చంద్, ప్రజాపక్షం తాండూరు ఇంచార్జీ రాంచందర్, పెద్దేముల్, బషీరాబాద్ మండలాల రిపోర్టర్‌లు మోహన్‌రెడ్డి, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి

అట్టహాసంగా ప్రారంభమైన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

తాండూరు ఎంఎల్ఎ బుయ్యాని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు :** తాండూరు పట్టణంలో ఎంఎల్ఎ బిఎంఆర్ కప్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభించారు. బుధవారం తాండూరు పట్టణ శివారులోని గౌతమి మాడల్ స్కూల్‌లో నిర్వహించిన ఎంఎల్ఎ బిఎం ఆర్ కప్ క్రీడా పోటీలను ఎంఎల్ఎ బుయ్యాని మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా ఎంఎ ల్ఎ క్రీడా జ్యోతిని వెలగించి క్రీడాకారులతో గౌర వ వందనన్నా స్వీకరించారు.ఈ సందర్భంగా ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యా ర్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని , గ్రామీణ ప్రాంతల్లో ఉన్న విద్యార్థుల ప్రతిభను గుర్తించాలనే ముఖ్యఉద్దేశంతో నియోజకవర్గ పరి ధిలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యా ర్థులను ఓకే వేదికపై తీసుక రావడం జరిగింద న్నారు. తాండూరు నియోజకవర్గ పరిధి మారు మూల ప్రాంతంలోని క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడానికే నియోజకవర్గ స్థాయి బిఎం ఆర్ కప్ 2025ను నిర్వహించాలని నిర్ణయించా మని తెలిపారు. అనంతరం క్రీడాకారులో పరి చయం చేసుకని టాస్ వేసి పోటీలను ప్రారంభిం చారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ రవి గౌడ్, మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, కోట్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ సాయిని నారాయణరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ సురేం దర్‌రెడ్డి, అజయ్ ప్రసాద్, గౌతమి మాడల్ స్కూల్ కరస్పాండెంట్ మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎబ్లాక ప్రసిడెంట్ లొంక నర్సిములు, కౌన్సిలర్‌లు ప్రభాకర్‌గౌడ్, నీరాజబాల్‌రెడ్డి, విజయదేవి, మ హిల అధ్యక్షరాలు శోభరాణి,అక్బర్‌బాబ, పార్టీ సీనియర్ నాయకులు ఉత్తమ్‌చంద్, ఎంఇఒలు వెంకటయ్యగౌడ్, వ్యాయమ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యుదాఘాతంతో చెరుకు తోట దగ్ధం

రూ.1.50వేలు నష్టపోయిన రైతు

రైతును ప్రభుత్వం ఆదుకోవాలని

అభ్యర్థన : గ్రామ నేత మల్లప్ప

**ప్రజాపక్షం/పెద్దేముల్ :** కోతకు వచ్చిన చెరుకు పంట విద్యాఘాతంతో దగ్ధమైన ఘటన పెద్దే ముల్ మండల పరిధి బండమీదిపల్లిలో చోటు చేసుకుంది. బాధిత రైతు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం బండమీదిపల్లి గ్రామానికి చెం దిన రైతు బత్తేలి బాలప్పకు సర్వేనెంబర్ 66/1/ 3లోని సుమారు రెండు ఎకరాల భూమిలో చెరు కు పంటను సాగు చేస్తున్నారు. చేతికి వచ్చిన చెరుకు పంట విద్యుత్ షాక్‌సర్క్యూట్‌తో చెరుకుతో టకు మంటలు అంటుకొని పూర్తిగా కాలి పో యింది. మధ్యహ్నం సమయం కావడంతో దగ్ధమ వుతున్న చెరుకు పంటను ఆర్పడానికి వీలు కాలే దని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చినప్పటికి లాభం లేకుండా పోయింది, అప్పటికే జగాల్సిన నష్టం జరిగిందని రైతులు లబోదిబోమంటూ రోధించారు. సుమారు రైతుకు రూ.1.50వేల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు బాలప్ప కోరుతున్నారు. ఈ మేరకు పెద్దేముల్ తహసిల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



పంట నష్ట పరిహారం అందించాలి

విద్యుత్ షాక్‌తో చెరుకు పంట కాలిపోయిన రైతును ప్రభుత్వం ఆదువాలని, బండమీదిపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌరి మల్లప్ప డిమాండ్ చేశారు. రైతుకు నష్టపరిహారం అందిం చాలని కోరారు. చేతికి వచ్చిన పంట కాలిపో వడం బాధకరమని విచారం వ్యక్తం చేశారు.

## భూ సమస్య పరిష్కరించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి డిజి సాయిలుగౌడ్



**ప్రజాపక్షం/ శామీర్ పేట:** ధరణిలో తప్పుగా నమోదైన భూమి వివరా లను వెంటనే విచారించి సరిచేయాలని మూడు చింతలపల్లి మండల త హశీల్దార్ వెంకటనర్సి ంహారెడ్డికి వినతిపత్రం సమర్పించామని మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మండల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 16లో ఉన్న 2.30 గుం టల వ్యవసాయ భూమి గూడె బిక్ష పతి తండ్రి గూడె సత్తయ్యల పేరుపై ఉన్న భూమి ధరణిలో పొరపాటున తన తమ్ముడు గూడె మల్లేష్‌పై నమోదైందని తెలిపారు. మొత్తం విస్తీర్ణం 5 ఎకరాలు ఉండగా ఇద్దరికి 2.20 గుంటల చొప్పున కేటా యించాల్సి ఉండగా మొత్తం ఎకరాలు ఒకరిపై నమోదు అయ్యిందని చెప్పారు. దీం తో రైతుకు రైతుబంధు రావడం లేదని చెప్పారు. ఈ విషయమై ఉన్న తాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో సిపిఐ మండల కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్ ఉన్నారు.

**నేడు అమరజీవులు కామ్రేడ్స్‌కు సంతాప సభ :** నేడు ఉదయం 10.30 గంటలకు సిపిఐ రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని బషీరాబాగ్ ప్రెస్ క్లబ్‌లో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ బాలమల్లేష్, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు పోటు ప్రసాద్, రాష్ట్ర పార్టీ కార్యాలయం కార్యదర్శి రామ చంద్రారావులకు సంతాప సభ కార్యాక్రమం ఉందని తెలిపారు. ఈ కార్య క్రమానికి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పార్టీ శ్రేణులను డిజి కోరారు.

## సొసైటీ దశదిశ మార్చిన చైర్మన్

- రూ. 94.25 లక్షలతో వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ప్రారంభించిన ఎంఎల్ఎ మల్లారెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘం దశదిశ మార్చిన ఘనత డిసి ఎంఎస్ వైస్ చైర్మన్ డాక్టర్ మధుకర్‌రెడ్డికి దక్కు తుందని మాజీ మంత్రి, మేడ్చల్ ఎంఎల్ఎ చామ కూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం మూడు చింతలపల్లి మండలం లక్ష్మాపూర్‌లో నాబార్డు నిధులు రూ. 94.25 లక్షలతో నూతనంగా నిర్మించిన వ్యవసాయ సహకార సంఘాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో సేవలు అందించామని, సుమారు రూ.2 కోట్లతో శామీర్ పేటలో దుకాణాల సముదాయాన్ని ఏర్పాటు చేశామన్నారు డిసిసిబి చైర్మన్ సత్తయ్య మాట్లాడుతూ రైతులకు హౌసింగ్ లోన్‌ల కింద ఇళ్లు కట్టుకోవడానికి రూ.75 లక్షలు ఇస్తామని, అలాగే మార్టిగేజ్ లోన్‌కింద రూ. 35 లక్షలు, ఇతర దేశాల్లో చదువుకునే విద్యార్థులకు రూ. 20 లక్షలు, భూమి కొనుగోలుకు సైతం డబ్బులు ఇస్తామని చెప్పారు. డిసిఎం ఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహాయాదవ్, డిసిఎంఎస్ రంగారెడ్డి చైర్మన్ కృష్ణారెడ్డి, హెచ్‌డిసిసి చైర్మన్ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఐలయ్య, సిఈవో నర్సింలు, డైరక్టర్‌లు, మాజీ సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్, పీర్జాదిగూడలో హైడ్రా కమిషనర్ పర్యటన

పలు ఫిర్యాదులపై పరిశీలన

కూల్చివేతపై చర్చలు...అక్రమార్కుల గుండెల్లో గుబులు



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** చెరువుల్లో అక్రమ నిర్మా ణాల కూల్చివేతలపై హై డ్రా మరోసారి దృష్టి పెట్టి ంది. తక్షణమే వాటిని తొ లగించేందుకు కార్యాచ రణ సిద్ధం చేస్తోంది. ఈ మేరకు మేడిపల్లి మండల పరిధిలోని పరిధిలోని పీర్జాదిగూడ,బోడుప్పల్ జంట కార్పొరేషన్‌లలో క బ్జాలపై పలు ఫిర్యాదు రావడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వ ర్యంలో స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. దీంతో అక్రమాల అక్రమార్కుల గుండెల్లో గుబులు పట్టుకుంది. ఏమి కూల్చివేస్తారోనని స్థానికంగా చర్చించుకుంటున్నారు. బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచర్ల చిం తల చెరువు వద్ద సర్వే నంబర్ 57 కొత్త కిషోర్ గౌడ్, కొత్త ప్రభాకర్ గౌడ్, కుర్రి శివశంకర్‌లు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు చేసిన ఫిర్యాదుపై చింతల చెరువు పరిసరాలను, బఫర్ జోన్‌లను వారు పరిశీలించారు. కొత్త నిర్మాణాలు పెద్దగా ఉండటంతో పాటు, నిర్మాణంలో ఉన్న కట్టడాల ఫొటోలను తీసు కున్నారు.పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ వెస్ట్ కామల నగర్ లోని సర్వే నంబర్40లో 1000 గజాల పార్క్ స్థలం కబ్జాకు గురి అయ్యిందని సహజ యోగ ఆశ్రమం వారు ఫిర్యాదు చేయడంతో సంబంధిత అధికారులతో పర్యటించి వివరాలు సేకరిం చా రు. మేయర్ తోటకూర అజయ్ యాదవ్,మేడిపల్లి తహసీల్దార్ హాసీనా, బోడుప్పల్, పీర్జాదిగూడ టౌన్ ప్లానింగ్ ఆధికారులు, ఇరిగేషన్ ఏఈ పర మేష్, ఆర్ఐలు రాకేష్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్ఐ. కె.అరుణ్ కుమార్



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూనే, డయల్100పై అవగాహన కలిగి ఉం డాలని ఎస్సై కె.అరుణ్ కుమార్ అన్నారు. నవాబుపేట మండల కేంద్ర ంలోని జెడ్పిహెచ్ఎస్ పాఠ శాలలో బుధవారం ఎస్సై కె.అరుణ్ కుమార్ సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లా డుతూ.సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూనే, డయల్100పై అవగా హన కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఏదైనా సమస్య వస్తే, వెంటనే డయల్100కు కాల్ చేయా లన్నారు. ఆయన మాట్లాడుతూ, అపరిచితుల నుంచి ఎస్ఎంఎస్, ఈ మెయిల్, వాట్సప్‌ల ద్వారా వచ్చే బ్లూ కలర్ లింక్స్‌ను క్లిక్ చేస్తే, మీ మొబైల్‌లోని డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి పోతుందని హెచ్చ రించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయా లన్నారు. ఎఎస్ఐ మురళీధర్, పిఎస్ఐ శ్వేత, జమిందార్ నరసింహారెడ్డి, పోలీస్ సిబ్బంది, ఎంఇఒ అబ్దుల్ రహేమాన్, ప్రధానోపాధ్యాయులు మల్లేశం, ఉపాధ్యా యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎఐడిఆర్ఎం కౌన్సిల్ సభ్యుడిగా రామకృష్ణ



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : ఆల్ ఇండియా దళిత రైట్స్ మూమెంట్ (ఎఐడిఆర్ఎం) జాతీయ రెండో మహాసభలు హైదరాబాద్‌లో 5,6,7 తేదీలలో నిర్వహించారు. ఈ మహాసభలలో తతను ఎఐడిఆర్ఎం జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందని శేరిలింగంపల్లి సిపిఐ కార్యదర్శి టి.రామకృష్ణ తెలిపారు. తనకు అవకాశం కల్పించిన జాతీయ కౌన్సిల్‌కు ధన్యవాదాలు తెలిపారు. దళితుల ఐక్యతకు కృషి చేస్తానని, వారి సమస్యలు పరిష్కరించడానికి అందుబాటులో ఉంటానని తెలిపారు.

# మహానగరి

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాపక్షం/కొందుర్గు: మండల పరిధిలోని మహాదేవ్‌పూర్ 33కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కొందుర్గు ట్రాన్స్‌కో ఎఇ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని మహాదేవ్‌పూర్, భైరంపల్లి, ఉత్రాస్‌పల్లి, ముట్పూర్, రేగడిచిల్కమర్రి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన వివరించారు. మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## ఘనంగా సిపిఐ వంద వసంతాల ఉత్సవాల నిర్వహణ

### పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపు



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : సిపిఐ వంద వసంతాల ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య పిలుపునిచ్చారు. బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో సిపిఐ చేవెళ్ల నియోజకవర్గం కార్యదర్శి కె.రామస్వామి అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరిగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ముఖ్య అతిథిగా పాల్గొని 100 సంవత్సరాల చరిత్ర దానికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేవెళ్ల, ఎల్బీనగర్ ప్రాంతాలలో భారీ బహిరంగ సభలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వీటితోపాటు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో సభలు, ప్రదర్శనలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, రైతు సంఘం కార్యదర్శి ప్రభులింగం, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, సుధాకర్‌గౌడ్, మంజుల, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, మండలాల కార్యదర్శులు సత్తిరెడ్డి, కె.శ్రీనివాస్, పి.సుధీర్ నక్కల జంగయ్య, ఎఐటియుసి మండల అధ్యక్షులు శివ, తదితరులు పాల్గొన్నారు

## చేవెళ్ల అభివృద్ధికి సహకారం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధికి సహ కారం అందిస్తానని, అధిక నిధులు కేటాయించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా చేవేళ్ల మండలంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ చీప్ వీప్ పట్నం మహేందర్‌రెడ్డి, తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్యలతో కలిసి ప్రాథమిక వ్యవసాయ, సహకార పరపతి సంఘ భవనం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ గోడౌన్, ముడిమాల గేట్ నుండి మేడిపల్లి వరకు బిటి రోడ్డు పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడారు. దేవర సమత, వెంకటరెడ్డిలు రైతులపై వారికి ఉన్న ప్రేమను చాటుకోవడంతోపాటు, వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనాన్ని 40 లక్షల రూపాయల వ్యయంతో కట్టించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ముందు ముందు ఎన్నో చేయాలని వారికి శుభాకాంక్షలు తెలిపారు. చేవేళ్ల నియోజకవర్గానికి ప్రభుత్వం నుండి సహకారం అందించే విధంగా చూస్తానని తెలిపారు. హైదరాబాద్ నుండి చేవేళ్ల రోడ్డును అభివృద్ధి చేయడానికి సహకారం అందింస్తానన్నారు. రోడ్డు ఇరువైపుల ఉన్న చెట్లు నష్టపోకుండా చర్యలు చేపడతామన్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ నాడు వైస్ రాజశేకర్‌రెడ్డి నిర్మించిన అవుటర్ రింగ్ రోడ్డ్‌తోనే రంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. శంషాబాద్ విమానాశ్రయంతో పాటు ప్రాంతంలో భూములకు మంచి ధరలు, రియల్ ఎస్టేట్ పెరిగిందని గుర్తు చేశారు. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతంగా చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపి రంజిత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూధన్‌రెడ్డి, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి, స్థానిక నాయకలు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శంగా మణికొండ మున్సిపాలిటీ

### రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

ప్రజాపక్షం/నార్సింగి: మణికొండ మున్సిపాలిటీపి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. బుధవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డిలతో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో సాధారణ నిధులతో పూర్తి చేసినటువంటి అభివృద్ధి పనులకు శంకుస్థాపన మరియు ప్రారంభోత్సవాల చేశామన్నారు. అల్కాపూర్ టౌన్‌షిప్‌లో పార్క్ అభివృద్ధి పనులు, స్పెక్ట్రమ్ విల్లాల దగ్గర బాక్స్ కల్వర్టు నిర్మాణం, హెచ్‌ఆర్‌సిఅలీజాపూర్‌లో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్స్ రామకృష్ణారెడ్డి, పద్మారావు, బుద్ధుల్ కావ్య, బుద్ధుల్ మీనా ముత్యాలు, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ మేనేజర్ శ్రీధర్ డిఇ సాయి శివ, ఎఇ ఈ సంజయ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## గౌడ కులస్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

### బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : గౌడ కులస్థుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గౌడ ఐక్య సాధన సమితి క్యాలెండర్–2025 ఆవిష్కరణ కార్యక్రమం అంబాల నారాయణగౌడ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథులుగా శ్రీకాంత్‌గౌడ్‌తో పాటు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ బాల్‌రాజ్‌గౌడ్, బిసి కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి , కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి, బండి సాయన్న, భిక్షపతి గౌడ్, అయిలి వెంకన్నగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతి శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ ఎక్సైజ్‌శాఖ పరిధిలో ఉన్న నీరాకేఫ్‌ను బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ పరిధిలోకి తెచ్చేందుకు కృషిచేస్తున్నట్టు చెప్పారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ట్యాంకుబండ్‌పై ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు. అనంతరం గౌడ ఐక్య సాధన సమితి క్యాలెండర్ 2025ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి నేతలు బాలకృష్ణ, మహేందర్‌గౌడ్, సతీశ్‌గౌడ్, మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బఫర్ జోన్లలో వెంచర్లు చేసిన వారిపై కఠిన చర్యలు

### హైడ్రా కమిషనర్ రంగనాథ్

ప్రజాపక్షం/తుర్కయంజాల్: చెరువుల ఆక్రమణపై మరోసారి హైడ్రా బృందం ముందు కదులుతోంది. బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటి పరిధిలో మాసబ్ చెరువు, ఆదిత్య నగర్, ఇంజాపూర్ జిలావర్ ఖాన్ చెరువులను మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు చెరువులను చెర బట్టి ప్లాట్లుగా మార్చి అమాయకులకు కట్టబెట్టారరన్నారు. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లలో వెంచర్లు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టం.. ఎవరికి చుట్టం కాదని హెచ్చరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని, పాత మ్యాపులు, శాటిలైట్ డాటని పరిశీలించి రానున్న మూడు నెలల్లో తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డైరక్టర్ పాపయ్య, తహసీల్దార్లు హేమామాలిని, సుదర్శన్ రెడ్డి, డిఇలు నాగరాజు, చెన్నకేశవరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని ఆసుపత్రులు సీజ్

### షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ

ప్రజాపక్షం/షాద్‌నగర్: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆసుపత్రులను నడిపిస్తే సీజ్ చేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి హెచ్చరించారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం, బూర్గుల గ్రామాల్లో ఉన్న ప్రథమ చికిత్స కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాటిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేసి సంబంధింత నిర్వాహకుడు రమేష్‌ను ప్రశ్నించారు. ఈ క్లినిక్‌కు సంబంధించిన పత్రాలను చూపించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే సహించేది లేదని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇష్టం వచ్చినట్లు వైద్యం నిర్వహించరాదని, అలా చేసేవారు ప్రభుత్వ అనుమతి విధిగా తీసుకోవాలని సూచించారు. అలా ఎమైనా ఉంటే తమకు చూపించాలని, ఈ వ్యవహారంపై విచారణ చేసి పూర్తి వివరాలను త్వరలోనే బయట పెడుతామని సూచించారు. ప్రథమ చికిత్స నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి పని చేయాలని, అతిక్రమించి పని చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తనిఖీల్లో హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులుతోపాటు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఉన్నారు.



## డివిజన్‌లో సమస్యలు పరిష్కరిస్తా

### హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాత నాయక్



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : డివిజన్‌లో నెలకొన్న ప్రతి సమస్యలను పరిష్కరించడానికి తన సహకారం ఉంటుందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని ఆర్కేఆర్ ఎంక్లేవ్, దాతు నగర్, నందనవనం కాలనీలో కాలనీ వాసులతో కలిసి పర్యటించి కాలనీలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాత నాయక్ మాట్లాడుతూ కాలనీల్లో ఉన్న సమస్యలు తమ దృష్టికి తీసుకోరావాలని కాలనీ వాసులను కోరారు. కార్యక్రమంలో ఆర్కేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.

## స్వచ్ఛందంగా బెల్టుషాపుల నియంత్రణ

### షాద్‌నగర్ పట్టణ సిఐ విజయ్‌కుమార్

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛందంగా బెల్టు షాపులు నియంత్రించేందుకు ప్రజలందరు కృషి చేయాలని షాద్‌నగర్ పట్టణ సిఐ విజయ్‌కుమార్ కోరారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడు గ్రామంలో ప్రజలందరు స్వచ్ఛందంగా బెల్టు షాపులు బంద్ చేయడాన్ని స్వయంగా పర్యటించి పరిశీలించి అభినంధించారు. ఈ సందర్భంగా సిఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలందరు కలిసికట్టుగా ఉంటూ అభివృద్ధి బాటలో నడిచేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ బలరాంతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించండి..

### షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్ నాయక్

ప్రజాపక్షం/షాద్‌నగర్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్ నాయక్ సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ విద్యార్థులకు, బిఏఎం, విజ్ఞాన్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిమంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ నాయక్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను దృష్టిలో పెట్టుకొని నియంత్రించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రమాదకరమైన మలుపుల వద్ద, స్కూల్ జోన్ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రాణ నష్టం నియంత్రించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు ప్రజలందరు సహకరించాలన్నారు.



## క్రీడల్లో రాణించేందుకు కృషి



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు కృషిచేయాలని కేశంపేట మాజీ జడ్పిటిసి పల్లె నర్సింగ్‌రావు సూచించారు. బుధవారం మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లె నర్సింగ్‌రావు మాట్లాడుతూ క్రీడలను స్ఫూర్తిగా తీసుకొని రాణించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శేఖర్ పంతులు, నాయకులు ప్రేమ్‌కుమార్ గౌడ్, తార్నాక శ్రీనివాస్, త్రిప్పిశెట్టి సుదర్శన్, దశరథ్ పాల్గొన్నారు.

## సంప్రదాయాలు కాపాడుకోవాలి



ప్రజాపక్షం/షాబాద్ : సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ అన్నారు. బుధవారం షాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మండలంలోని వివిధ పాఠశాల విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పోటీలో పాల్గొన్న 64 మంది విద్యార్థులందరికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు మల్లిఖార్జున్, షఫీ, అడ్డూ, రాకేష్, ఉపాధ్యాయులు సుశీల వివిధ పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : కోదండరామ్



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులు, డిఎల సవరణ వంటి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ హామీనిచ్చారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (టిజిపిఎ)–2025 క్యాలెండర్‌ను అధ్యక్షులు కనకం కొమురెల్లి, ప్రధానకార్యదర్శి తూము అశోక్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి సూర్యకళ, అసోసియేట్ ప్రెసిడెంట్ టి.ఎ.ఎస్.ఆర్.గుప్త, కోశాధికారి జయంతి ప్రకాశ్‌రావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్.వేణుగోపాల స్వామి, స్వర్ణకుమారి, జాయింట్ కటకం జానకిబాయి, కార్యవర్గ సభ్యులు కె.లక్ష్మ ణరావు, పి.కమలాకరరావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు

ప్రజాపక్షం/యాచారం : మండలంలో రైతులు వరిసాగులో డ్రమ్ సీడరు పద్ధతిని అలవర్చుకోవాలని మండల వ్యసాయధికారి అర్.రవినాథ్ కోరారు. బుధవారం మండల పరిధిలోని తమ్మలోనిగూడ గ్రామంలో రైతు పన్నిర్ వెంకటేశ్ వ్యవసాయ పొలంలో డ్రమ్ సీడర్ విధానాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ యాసంగీ వరి సాగు విధానం కేవలం 10 నుండి 12 కిలోల విత్తనాలు వాడుతూ రైతుల సమయాన్ని కూలీల ఖర్చును తగ్గించుకోవచ్చునని తెలిపారు. రైతులందరూ ఈ పద్దతిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సిహెచ్ వసంత, ఎస్.సంతోష్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలి

### ముంబై అంబేద్కర్ సమాధి వద్ద ఎమ్మెల్యే బీర్ల నివాళి



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాల్సిన అవసరం ఉన్నదని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ముంబై పర్యటనలో భాగంగా రెండోరోజు బుధవారం ముంబై దాదర్‌లోని అంబేద్కర్ సమాధి చైత్య భూమిని నల్లగొండ జిల్లా గౌరై కాపరుల సహకార సంఘం మాజీ ఉపాధ్యక్షులు మల్లాపురం మల్లాపురం మాజీ సర్పంచ్ మంగ సత్యనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నేతలు కర్రె జహంగీర్, కురుమ సంఘం ముంబై గౌరవ అధ్యక్షులు పుప్పాల సత్తయ్య ప్రతినిధులతో కలిసి ఆయన సందర్శించారు. అంబేద్కర్ సమాధి వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. అయిలయ్య మాట్లాడుతూ అంబేద్కర్ మార్గదర్శకంలో ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకొంటూ ముందుకు సాగుతున్నట్టు పేర్కొన్నారు. సమాధిని సందర్శించడంతో నా జన్మ ధన్యమైందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గవ్వల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఐల చంద్రమౌళి, నేతలు జట్ట కృష్ణ, కుండే చంద్రయ్య, జూకంటి రామ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

## కొందుర్గును అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/కొందుర్గు: కొందుర్గు మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కొందుర్గు ప్రీమియర్ లీగ్5వ సీజన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్ మండలాలు ఎంతో కొంత అభివృద్ధి దిశలో పయనిస్తున్నాయని, పూర్తిగా వ్యవసాయ అధారిత మండలమైన కొందుర్గు ఉమ్మడి మండలాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్రంలో మొదటి సారిగా కొందుర్గు మండలానికి తన వంతుగా ఇంటిగ్రెటెడ్ పాఠశాలను మంజురు చేయించి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శంఖుస్థాపన చేయించడం జరిగిందన్నారు. త్వరలోనే షాద్‌నగర్–పరిగి రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా మార్చడం జరుగుతుందని, కొందుర్గులో స్టేడియంను ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. ఏమ్స్ ఆసుపత్రి నిర్మాణం కోసం మండలంలో 300 ఎకరాల ప్రభుత్వ అవసరం అవుతుందని, దీని కోసం ప్రయత్నం చేస్తున్నామని, ఆసుపత్రి ఏర్పాటుతో కొందుర్గు మండలం రూపురేఖలు మారుతాయని, కొందుర్గు మండల కేంద్రంలో 300 ఇండ్ల నిర్మాణంతోమాడల్ కాలనిని ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. క్రీడలతో ఐకమత్యం వస్తుందని, పార్టీలకు అతీతంగా నాయకులందరిని ఏకం చేస్తాయని, కొందుర్గు మండలంలో గత 15 సంవత్సరాలుగా క్రీడా టోర్నమెంట్ల నిర్వాహణతో కొందుర్గు క్రీడల కేంద్రంగా మారిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండ విజయ్ కుమార్,పిఎసిఎస్ చైర్మెన్ చిట్టెం దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎ కృష్ణారెడ్డి, నాయకులు కావలి యాదయ్య, రాజేష్ పటేల్, కె రామయ్య గౌడ్, బి నరేందర్, చేవెళ్ల కృష్ణయ్య, మాణయ్య, శ్రీధర్‌రెడ్డి, రాయికంటి రామస్వామి, జిబి కృష్ణ,బి పెంటయ్య, జగదీశ్వర్ గౌడ్, కెకె కృష్ణ, అక్రం, రామకృష్ణ, దుర్గని శ్రీను, పెరుమాళ్ల చంద్రశేఖర్, రఘునాథ్‌గౌడ్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

షాద్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాను సిద్దంగా ఉన్నానని తెలిపారు. సమస్యలు పరిష్కారం కోసం వచ్చే ప్రజలకు న్యాయం చేసేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## గ్రామీణాభివృద్ధిపై శిక్షణ

### హిమాచల్‌ప్రదేశ్ ప్రజాప్రతినిధుల సందర్శన

ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని గడ్డమల్లాయగూడ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను బుధవారం హిమాచల్ ప్రదేశ్ కార్సోగ్ బ్లాక్ పంచాయతీ ప్రజాప్రతినిధులు సందర్శించారు. అధికారులు గ్రామీణాభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ఎంతోగానో ఉపయోగ పడుతాయన్నారు. నర్సిరీలు, పల్లే ప్రగతి వనాలు కంపోస్టు క్రిమిటోరియం స్థానికంగా లభించే వనరులను గురించి తెలుసుకున్నారు. పర్యావరణ స్థిరత్వం స్వయం సమృద్ధిని పోత్సహించే విధంగా మౌలిక సదుపాలు ఎలా ఉన్నాయినే విషయంపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించారు. మహిళా సంఘాల పాత్ర, మహిళా సంఘాలతో ఏర్పాటు చేస్తున్న వస్త్ర దుకాణాలు స్థానిక అర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కిలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఇ నరేంధర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అచ్చన జంగయ్య, ప్రజాప్రతినిధులు కొర్సో గ్ కోఅర్డినేటర్ శశిరేఖ, సీనియర్ కన్సల్‌టెంట్ ట్రైనింగ్ మేనేజర్ నాగలక్ష్మి , అరుణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



క్రీడ

ఛాంపియన్స్ ట్రోఫీ

# ఆ ముగ్గురు ప్లేయర్స్ డౌటే!





మరికొన్ని రోజుల్లో ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పటివరకూ జట్లను ప్రకటించనప్పటికీ, టీమ్ లోకి ఎవరిని తీసుకుంటారు, ఎవరిని పక్కనపెడతారనే విషయాలపై క్రికెట్ అభిమానుల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది. అయితే ఈ ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో కీలక ప్లేయర్స్ ను పక్కన పెట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రచారం సాగుతోంది. ఇంతకీ వారెవరంటే?

**కోహ్లీ, రోహిత్ కు లాస్ట్ ఛాన్స్**

ఫిబ్రవరి 19 ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ప్రారంభం కానుంది. అయితే బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో పేలవ ప్రదర్శనతో సిరీస్ కోల్పోవడం, డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరే అవకాశాలు గల్లంతవ్వడంతో, ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్ ఇండియా ఎలా ఆడుతుందనే ఆసక్తి అందరిలో నెలకొంది. పైగా సీనియర్లైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆటతీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. వారిని పక్కనపెట్టాలన్న డిమాండ్ కూడా వినిపిస్తోంది. అయినా కూడా విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో చివరి అవకాశం కల్పిస్తారని తెలిసింది. అయితే ఈ ఛాంపియన్స్ ట్రోఫీ కన్నా ముందు టీమ్ ఇండియా, స్వదేశంలో ఇంగ్లాండ్ తో వన్డే, టీ20 సిరీస్‌లు ఆడనుంది. ఈ సిరీస్ కు కూడా ఇంకా జట్టును ప్రకటించలేదు. అయితే ఇంగ్లాండ తో వన్డే సిరీస్ ఆడే భారత జట్టే, ఛాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సమాచారం అందింది.

**వారిని పక్కనపెట్టే అవకాశం**

ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో కేఎల్ రాహుల్ , రవీంద్ర జడేజా, మహ్మద్ షమీలకు స్థానం దక్కక పోవచ్చని కొత్త ప్రచారం మొదలైంది. మోకాలిలో వాపు కారణంగా ఆస్ట్రేలియా సిరీస్‌కు దూరంగా ఉన్న సీనియర్ పేసర్ మహ్మద్ షమీ తిరిగి జట్టులోకి రావాలని గట్టిగానే ప్రయత్నిస్తున్నాడు. కానీ అతడికి అవకాశం ఇవ్వరని తెలుస్తోంది. వైట్ బాల్ ఫార్మాట్‌లో రవీంద్ర జడేజా బ్యాటింగ్ గతంలోలా లేదు. అందుకే అతడి స్థానంలో వన్డేలకు అక్షర్ పటేల్ కు ఛాన్స్ దక్కవచ్చని పలువురు అంటున్నారు. ఇంకా ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో వికెట్ కీపర్ స్థానం కోసం కేఎల్ రాహుల్, పంత్‌ల మధ్య తీవ్ర పోటీ ఉంటుందని తెలిసింది. వీరిలో ఒకరికే అవకాశం దక్కుతుంది.

కాగా, జనవరి 12 లోపు ఛాంపియన్స్ ట్రోఫీ కోసం బీసీసీఐ జట్టును ప్రకటించే అవకాశం ఉంది. ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ మొదలు కానుంది. అంతకుముందు ఇంగ్లాండ తో టీమ్ఇండియా జనవరి 22 నుంచి ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్ లో తలపడనుంది.

## 'కోహ్లీ నా దేవుడు'

### విరాట్ తో గొడవపై స్పందించిన కొన్‌స్టాస్



రీసెంట్ గా ముగిసిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో స్టార్ ప్లేయర్లతో గొడవపడి, దూకుడు ఆట కనబరిచిన ఆస్ట్రేలియా యువ ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్.. తాజాగా టీమిండియా స్టార్ బ్యాటర్ కోహ్లీపై ప్రశంసల వర్షం కురిపించాడు . తన కుటుంబం మొత్తం విరాట్ ను ఎంతో ఇష్టపడుతుందని అన్నాడు. కోహ్లీ గొప్ప వ్యక్తి అని కొనియాడాడు. ఇంకా ఏమన్నాడంటే?

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా మెల్‌బోర్న్ వేదికగా జరిగిన నాలుగో టెస్ట్‌తో సామ్ కొన్‌స్టాస్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. అయితే తానాడిన తొలి టెస్టులోనే కోహ్లీ, బుమ్రాతో దూకుడుగా వ్యవహరించి క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాడు కొన్ స్టాస్. ఆ తర్వాత సిడ్నీ టెస్టులోనూ అదే తీరును ప్రదర్శించి బుమ్రాతో మళ్లీ గొడవ పెట్టుకున్నాడు.

అయితే ఇప్పుడు గావస్కర్ ట్రోఫీ ముగిశాక తాను చేసిన తప్పిదాలపై మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలోనే కోహ్లీతో జరిగిన వివాదంపై కూడా స్పందించాడు. విరాట్ పై ప్రశంసల వర్షం కురిపించాడు. 'కోహ్లీనే నా దేవుడు. అతడే నాకు స్ఫూర్తి. నేను అతడిని నా యుక్త వయసు నుంచే ఆరాధిస్తాను. నా కుటుంబం మొత్తం అతడిని అభిమానిస్తుంది. క్రికెట్ లో అతడు లెజెండ నేను తన పేరును జపించడాన్ని ఇష్టపడతాను. అతడితో కలిసి ఆడటం నాకు దక్కిన గొప్ప గౌరవం. విరాట్ కోహ్లీ అంత పెద్ద స్టార్ అయినా ఎంతో ఒదిగి ఉంటాడు. లవ్లీ పర్సన్. ఆట పూర్తయ్యాక నేను కాసేపు తనతో మాట్లాడాను.' అని పేర్కొన్నాడు.

## కెప్టెన్‌గా బుమ్రా పనికిరాడు: మహమ్మద్ కైఫ్



టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కెప్టెన్‌గా పనికిరాడని మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ అన్నాడు. అది అతనిపై అనవసర ఒత్తిడిని పెంచుతుందని అభిప్రాయపడ్డాడు. రిషభ్ పంత్, కేఎల్ రాహుల్‌లో ఒకరికి టీమిండియా టెస్ట్ సారథ్య బాధ్యతలు అప్పగించాలని సూచించాడు. ఇటీవల ముగిసిన ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో జస్‌ప్రీత్ బుమ్రా అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. 9 ఇన్నింగ్స్‌ల్లో 39 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్నాడు. రోహిత్ శర్మ గైర్హాజరీలో కెప్టెన్‌గానూ ఆకట్టుకున్నాడు. మరోవైపు ఈ పర్యటనలో రోహిత్ శర్మ దారుణంగా విఫలమయ్యాడు. 5 ఇన్నింగ్స్‌ల్లో 31 పరుగులే చేశాడు. ఆఖరి టెస్ట్‌కు తానంతట తానే తుది జట్టు నుంచి తప్పుకున్నాడు.

రీల్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన లేటెస్ట్ మూవీ 'పుష్ప 2' ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసి చరిత్ర సృష్టించింది. దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ వసూళ్ల వర్షం కురిపిస్తూ సరికొత్త రికార్డులను క్రియేట్ చేసింది. ఈ సినిమా రిలీజ్ అయ్యి నెల రోజులు దాటినా బాక్సాఫీస్ దగ్గర ఇంకా సాలిడ్ వసూళ్లు రాబడుతూ దూసుకెళ్తోంది. అయితే, సంక్రాంతి కాను కగా అభిమానులకు 'పుష్ప 2' మేక ర్స్ ఓ ట్రీట్ ఇవ్వాలని సిద్ధమ య్యారు. ఈ సినిమా కు మరో 20 నిమిషాల అదన పు సీన్స్ యాడ్ చేసి రీలో డెడ్ వెర్ష న్‌ను థియేటర్ల లో ప్రదర్శించాలని మేకర్స్ నిర్ణయించారు. జనవరి 11 నుంచి ఈ రీలో డెడ్ వెర్షన్ ప్రదర్శనకు వస్తుందని ముందుగా ప్రకటించారు. అయితే, తాజాగా ఈ నిర్ణయాన్ని వా యిదా వేసి నట్లు ప్రకటిం చారు. కొన్ని టెక్నికల్ కారణాల వల్ల రీలోడెడ్ వెర్షన్‌ను జనవరి 17 నుంచి థియేటర్లలో స్క్రీన్ చేయను న్న ట్లు తాజాగా వెల్లడించారు.






## టాక్సిక్‌తో యష్ బర్త్ డే ట్రీట్!?

ఇప్పుడు పాన్ ఇండియా లెవెల్లో మంచి ఫేమ్ ఉన్న హీరోస్ లో కన్నడ రాకింగ్ స్టార్ యష్ కూడా ఒకరు. తన సెన్సేషనల్ హిట్ చిత్రాలు కేజీయఫ్ సిరీస్ తో అదరగొట్టగా ఆ సినిమాలు ఇచ్చిన ఫేమ్ తర్వాత తాను ఎలాంటి సినిమా చేస్తాడు అనేది పెద్ద ప్రశ్నగా మారింది. కేజీయఫ్ తో వచ్చిన స్టార్డంని నిలబెట్టుకోగలడా లేదా అనేది ఆసక్తిగా మారిన సమయంలో మళయాళ దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తో అనౌన్స్ చేసిన సినిమానే టాక్సిక్. మరి అనౌన్సమెంట్ తోనే మంచి హైప్ ని అందుకున్న ఈ చిత్రం నుంచి నేడు యష్ పుట్టినరోజు కానుకగా చిన్న గ్లింప్స్ ని మేకర్స్ వదిలారు. మరి ఈ గ్లింప్స్ లో యష్ నుంచి కొత్త వెర్షన్ కన్పిస్తుండగా తనలోని కంప్లీట్ రొమాన్స్ యాంగిల్ కనిపిస్తుంది. అలాగే మ్యూజిక్ కూడా బాగానే ఉంది కానీ మేకర్స్ ఇచ్చిన హైప్ ని అభిమానులు ఏదో ఊహించుకుంటే వీరు ఇంకేదో వదిలారు అనే కామెంట్స్ ఎక్కువ వినిపిస్తున్నాయి. దీనితో యష్ బర్త్ డే ట్రీట్ మాత్రం మిక్స్ రెస్పాన్స్ నే అందుకుంది అని చెప్పాలి.

## డాకు మహారాజ్ ప్రీరిలీజ్ కు గెస్ట్‌గా నారా లోకేష్




నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా ప్రగ్యా జైస్వాల్ అలాగే శ్రద్దా శ్రీనాథ్ ఇంకా తెలుగు యువ హీరోయిన్ చాందిని చౌదరిలు ముఖ్య పాత్రల్లో దర్శకుడు కొల్లి బాబీ తెరకెక్కించిన సాలిడ యాక్షన్ చిత్రం డాకు మహారాజ్ కోసం తెలిసిందే. బాలయ్య కెరీర్ లో 109వ సినిమాగా తెరకెక్కించిన ఈ సినిమాపై హైప్ ఓ రేంజ్ లో ఉంది. ఇక ఈ సినిమా కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తుండగా ఇపుడు ఫైనల్ గా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ పై క్లారిటీ ఇచ్చేసారు మేకర్స్.దీనితో డాకు మహారాజ్ సినిమా ప్రీ రిలీజ్ ని ఈ జనవరి 9న సాయంత్రం 6 గంటల నుంచి అనంతపురంలో శ్రీనగర్ కాలనీ దగ్గర చేస్తున్నట్టుగా వేదికని క్లారిటీ ఇచ్చేసారు. అలాగే ఈ ఈవెంట్ కి బాలయ్య అల్లుడు, ఏపీ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిదిగా వస్తున్నట్టుగా మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. మరో ఈ ఈవెంట్ లో ఎలాంటి హైలైట్స్ ఉంటాయో చూడాల్సిందే. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా సితార ఎంటర్టైన్మెంట్స్ అలాగే ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ వారు నిర్మాణం వహించారు.

## నోటిఫికేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

అందజేస్తే, ఏప్రిల్‌లో భర్తీపై కసరత్తు పూర్తి చేసి,కొత్త నోటిఫికేషన్లు ఇస్తామని, దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామన్నారు. హైదరాబా ద్‌లోని టిజిపిఎస్‌సిలో బుధవారం బుర్ర వెంకటేశం కొంత మంది జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఇంటర్వ్యూ లు లేని పోస్టులను 6 నుంచి 8 నెలల్లో భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. ఈ నెల 11,12న బెంగుళూర్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ల కాన్ఫరెన్స్ జరగనుందని, ఇందులో అన్ని రాష్ట్రాల సర్వీస్ కమిషన్ పనితీరును తెలుసుకుంటామని బుర్రా వెంకటేశం తెలిపారు. ఇంటర్వ్యూ విధానంపై యుపిపిఎస్‌సి మరింత లోతుగా అధ్యయనం చేసే పనిలో ఉన్నదని, యుపిపిఎస్‌సిలో ఇంటర్వ్యూ కీలకమని, ఎపిలో కూడా ఇంటర్వ్యూ విధానం తీసుకురావాలని ఆలోచన చేస్తున్నారని, టిజిపిఎస్‌సిలో మాత్రం గ్రూప్ 1,2లో ఇంటర్వ్యూ లేదన్నారు. నిరుద్యోగులకు టిజిపిఎస్‌సి పట్ల విశ్వాసం పెరిగేలా చూస్తామని, ఈఒ పరీక్షా ఫలితాలను కూడా వెల్లడించ బోతున్నామని, జాప్యానికి అవకాశమే లేదన్నారు. టిజిపిఎస్‌సిలో రాజకీయ పార్టీల జోక్యం కారణంగానే నిరుద్యోగులలో ఆందోళన వ్యక్తం అవుతున్నాయని ఆయన తెలిపారు. టిజిపిఎస్‌సిలో కూడా ప్రక్షాళన చేయబోతున్నామని, ఇక్కడ ఒక్కొక్క ఫ్లోర్‌కు ఒక్కొక్క ఫ్లోర్ సంబంధంలేదని, సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ 4వ ఫ్లోర్ లో ఉన్నదని, పేపర్ ప్రిపరేషన్ కూడా అక్కడే ఉన్నదని వివరించారు.

## కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలు

### సమీక్ష సమావేశంలో మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణితో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు, వసతులు, మెడికల్ కళాశాల స్థితిగతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖరీదైన అన్ని వైద్యసేవలు పేదలకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వసతులు, అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సకల సదుపాయాలు అందుబాటులో ఉంచేలా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో 500 పడకల సేవలు అందుబాటులో ఉండేవని, కరోనా సమయంలో దానిని 420 పడకలకు తగ్గించారని, మళ్లీ 575 పడకలకు పెంచాలని ప్రతిపాదనలు చేశామని, వాటిని తక్షణమే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని కల్లూరు, సత్తుపల్లి, ఖమ్మం, ఇతర ఆసుపత్రుల్లో అన్ని వసతులు ఉండేలా చూడాలన్నారు. మందులు సైతం అందుబాటులో ఉం చాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో తక్షణమే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నతాధికారులను ఆదేశించారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు వివిధ విభాగాల్లో సిబ్బంది కొరత లేకుండా ఉండేలా చూడాలన్నారు. ఆపదలో ఉన్న ప్రజలకు అత్యవసర సేవలను అందించేందుకు అంబులెన్స్‌లు 104, 108 వాహనాలు కాలం చెల్లిన వాటి స్థానంలో కొత్త వాటిని అందుబాటులోకి తీసుకు రావాలన్నారు.

## లైంగిక వేధింపే అవుతుంది

(మొదటి పేజీ తరువాయి)

ఆశ్రయించాడు. 2013 నుంచి ఆ ఉద్యోగి చాలా అసభ్యకరమైన భాషను వాడారని, 2017లో అభ్యంతరకరమైన మెసేజ్‌లు, వాయిస్ కాల్స్ చేసేవాడని ఆమె ఆరోపించింది. విద్యుత్తు శాఖకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. మహిళా ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 354 ఎ (లైంగిక వేధింపులు), 509(మహిళను కించపరచడం), సెక్షన్120 (ఒ) కింద కేసు బుక్ చేశారు. కేరళ పోలీసు చట్టంలోని సెక్షన్ 120(ఒ) కింద కూడా ఆ ఉద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కోర్టు పేర్కొన్నది. అయితే కేవలం శరీర శౌష్టవం బాగుందని కామెంట్ చేసినంత మాత్రానా.. తనపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారని, ఆకేసును కొట్టివేయాలని విద్యుత్తు శాఖ ఉద్యోగి కోర్టును ఆశ్రయించారు. కాల్స్, మెసేజ్‌లతో నిందిత వ్యక్తి లైంగిక వేధింపుల కామెంట్స్ చేసినట్లు మహిళా ఉద్యోగి ఆరోపించింది. అయితే సెక్షన్ 354 ఎ, 509తో పాటు సెక్షన్ 120 కేరళ పోలీసు చట్టం ప్రకారం నిందితుడిపై తగిన ఆధారాలు ఉన్నట్లు హైకోర్టు తెలిపింది.

## వారు మూడు తరాలకు స్ఫూర్తిదాయకం

### ఇప్టా 90 వసంతాల వేడుకల్లో వక్తలు
### నల్లూరి వెంకటేశ్వర్లు, కందిమళ్ల ప్రతాపరెడ్డి, డాక్టర్ ఏటుకూరి ప్రసాద్‌లకు సన్మానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమసమాజమే లక్ష్యంగా తమ జీవితాంతం ఎర్రజెండా నీడలో అనేక త్యాగాలు చేసి మూడు తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు, కందిమళ్ల ప్రతాపరెడ్డి, డాక్టర్ ఏటుకూరి ప్రసాద్‌లని సన్మానించడం సగౌరవంగా ఉందని పలువురు ప్రముఖులు అన్నారు. వీరంతా 90 ఏళ్ల నవ యువకులని అన్నారు. హైదరాబాద్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో బుధవారం ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా), ప్రజానాట్యమండలి తెలుగు చలనచిత్ర శాఖ, ప్రజానాట్యమండలి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 90 వసంతాల వేడుక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యుదయ సాంస్కృతికోద్యమ కృషీవలుడు నల్లూరి వెంకటేశ్వర్లు, కె.ప్రతాపరెడ్డి, డాక్టర్ ఏటుకూరి ప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. విశాలాంధ్ర సంపాదకులు ఆర్‌వి.రామారావు అధ్యక్షతన జరిగిన ఈ అభినందన సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, స్టేజీ డైరెక్టర్ శాంతారావు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ప్రముఖ సినీనటులు మాదాల రవి, దవళా సత్యం, వందేమాతరం శ్రీనివాస్, అరసం జాతీయ నాయకులు ఎస్‌వి.సత్యనారాయణ, అరుణోదయ సాంస్కృతిక సంస్థ నాయకురాలు విమలక్క, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ నల్లూరి వెంకటేశ్వర్లు అందరికీ అన్న అని, కందిమళ్ల ప్రతాపరెడ్డి ఎప్పటికీ విప్లవ వీరుడేనని, ఏటూకూరి ప్రసాద్ తన కలంతో సమాజానికి దిక్సూచి చూపిన మార్గదర్శి అని ప్రశంసించారు. ఎర్ర సిరాతో రాసిన విప్లవ త్రిమూర్తుల చరిత్ర ఎర్రజెండా ఉన్నంతకాలం ఉంటుందని తెలిపారు. ఈ ముగ్గురిలో కవులు, గాయకులు, కళాకారులు ఉన్నారని, వీరి పెన్ను ఓ తుపాకి అని, ఆ తూపాకిలో నుంచి వచ్చే మాట తూటాలని, ఆ తూటాల్లో నుంచి కురిసే రవ్వలు వెలుగు దివ్వెలని, ఆ నిప్పు రవ్వలు.. కాంతి వెలుగులు ఈ సమాజాన్ని కాంతిపథం వైపు నడిపిస్తున్నాయని చెప్పారు. ఆర్.వి.రామారావు అధ్యక్షోపన్యాసం చేస్తూ సత్కారం అందుకున్న ఈ ముగ్గురి ప్రభావం తనపై ఉందని, ఈ స్థాయిలో ఉండడానికి వారిచ్చిన ప్రేరణే కారణమని అన్నారు. ఎస్‌వి.సత్యనారాయణ మాట్లాడుతూ అభినందన సత్కారం అందుకున్న నల్లూరి వెంకటేశ్వర్లు, కందిమళ్ల ప్రతాపరెడ్డి, ఏటుకూరి ప్రసాద్ ముగ్గురూ కింగ్ మేకర్లేనని, వారి తరాన్ని, ఆ తర్వాత తరాన్ని ఈ తరాన్ని ఈ మూడు తరాలను ప్రభావితం చేశారన్నారు. యువజన సాహిత్యం, సంస్కృతిక రంగాల్లో తమ నాయకత్వ ప్రతిభతో ఈ మూడు రంగాలను అద్భుతంగా ముందుకు నడిపిన మహావ్యక్తులని ప్రశంసించారు. దవళా సత్యం మాట్లాడుతూ తన చేయి పట్టి ముందుకు నడిపి నన్ను ఇంత వాణ్ణి చేసింది నల్లూరి వెంకటేశ్వర్లేనని తెలిపారు. శాంతారావు మాట్లాడుతూ మనిషిని మనిషిగా నిలబెట్టడం అంటే సమాజం ఎలా ఉందో తెలుపడం కాదని, సమాజం ఎట్లా ఉండాలో కూడా తన కలం ద్వారా శ్రామిక వర్గానికి చూపాల్సి ఉందన్నారు. ప్రజా కళ అనేది జాగృతి స్వప్నం. సోషలిస్టు వాస్తవికత, సమభావం, సమిష్టిభావం ప్రజల్లో కలిగించాల్సి ఉందన్నారు. ఇందుకు మళ్లీ శిక్షణా తరగతులను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. వందేమాతరం శ్రీనివాస్, మాదాల రవి తదితరులు మాట్లాడుతూ సత్కారం అందుకున్న ఈ ముగ్గురూ సమాజానికి ఎప్పటికీ మార్గదర్శకులేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, అరసం రాష్ట్ర నాయకులు కెవిఎల్, నవచేతన విజ్ఞాన సమితి కార్యదర్శి బిఎస్‌ఆర్.మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎం. అనిల్ కుమార్ | కె. ఏసురత్న | ఎస్. శ్రీనివాస్ | బి. అశోక్ | ఎ. రాజ్‌కుమార్ | కె. సహదేవ్ | పి. లావణ్య

## షా రాజీనామా చేయాల్సిందే..

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్మల్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు హైదరాబాద్‌లో ఎఐడిఆర్‌ఎం జాతీయ 2వ మహాసభలు విజయవంతంగా జరిగాయని, ఈ మహాసభలో దేశ వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు, విద్యా, నిరుద్యోగం, ఉద్యోగాల్లో భర్తీలో రిజర్వేషన్లు పాటించకపోవడం, మహిళలపై అత్యాచారాలు, హత్యలు తదితర ప్రధాన సమస్యలపైచర్చించి ఉద్యమ కార్యచరణను రూపొందించుకోవడం జరిగిందని చెప్పారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నరసింహ మాట్లాడుతూ హైదరాబాద్‌తో దళిత ఉద్యమానికి వీడతీయరాని చరిత్ర ఉందన్నారు. స్వాతంత్రానికి పూర్వమే హైదరాబాద్‌లో దళితుల సాధికారితకు ఆది హిందూ మహాసభ పేరుతో భాగ్యరెడ్డి వర్మ సామాజిక ఉద్యమాలను చేపట్టారని తెలిపారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత దళితుల అభివృద్ధి, సంక్షేమం, అంబేద్కర్ యొక్క ఉనికే ప్రమాదకరం ఏర్పడుతున్న ఒక సంక్లిష్టమైన సమయంలో హైదరాబాద్‌లో ఎఐడిఆర్‌ఎం జాతీయ మహాసభలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మహాసభలో దేశవ్యాప్తంగా జరుగుతున్న దాడులను ప్రతిఘటిస్తూ ఉద్యమాలను చేపట్టేందుకు కార్యచరణను సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. ఏసురత్నం మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న ఆఘాత్యాలకు వ్యతిరేఖంగా రాష్ట్రాల వారిగా ఎక్కడికక్కడ ఉద్యమాలను చేపట్టడంతో పాటు దళితులకు రాజ్యాంగం హ క్కులను పరిరక్షించుకునేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మహాసభల్లో జాతీయ కౌన్సిల్‌తో పాటు నూతన న్యాయకత్వాన్ని ఎన్నకోవడం జరిగిందని చెప్పారు.

**తెలంగాణ నుంచి 7 మంది జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నిక**

తెలంగాణ రాష్ట్రం నుంచి ఎఐడిఆర్‌ఎంజాతీయ కౌన్సిల్ సభ్యులుగా 7 మంది ఎన్నికైయ్యారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న మారపాక అనిల్ కుమార్ ఎఐడిఆర్‌ఎం జాతీయ కార్యదర్శిగా ఎన్నికగా, రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసురత్నం, ఉపాధ్యక్షులు కె.సహాదేవ్, కోశాధికారి ఆరుట్ల రాజ్ కుమార్‌లు జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైయ్యారు. అదేవిధంగా బోయిని అశోక్, సలిగంటి శ్రీనివాస్,పొనగంటి లావణ్యలు ఎన్నికైయ్యారు.

## సిద్దిపేటలో కేంద్ర వైద్య బృందం పర్యటన

* ప్రభుత్వ మెడికల్‌కళాశాల, ఆసుపత్రుల సందర్శన
* వైద్య సేవలపై ఆరా .. కేంద్ర బృందానికి వైద్య సేవలను వివరించిన కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి:** కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాలో పర్యటించి అసంక్రమిత వ్యాధులపై అందుతున్న సేవలపై ఆరా తీశారు. జాతీయ సెమినార్ ఫీల్డు విజిట్‌లో భాగంగా ఉత్తరప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రటరీ పార్థసారధిసెన్ శర్మ, తెలంగాణ వైద్యకమిషనర్ ఆర్‌వి కన్నన్, ఆరాధన పట్నాయక్ ఎండి మినిస్టర్ ఆఫ్ హెల్త్, విజయదయరామ్ ఎండి నేషనల్ హెల్త్, చత్తీస్‌ఘడ్,భారతీ దీక్షిత్ ఎండి నేషనల్ హెల్త్ రాజస్థాన్, ఇంద్రాని కౌశిల్ నాగలాండ్ వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సిడి కార్యక్రమ అధికారులు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి ఎన్‌సిడి సెంటర్, తెలంగాణ దయాగ్నిస్టిక్ హాబ్, దయాలసిస్ సెంటర్, ములుగు,మర్కూక్, కుకునూర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. అలాగే మామిడాల, నేంటూర్, ఎర్రవల్లి, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, బస్తిదవఖాన. కాళ్లకుంట కాలనీ, పట్టణ ఆరోగ్య కేంద్రం నాసర్‌పురాను సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. అక్కడ జరుగుతున్న అసంక్రమిత వ్యాధుల సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వారి అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు.ఈకార్యక్రమంలో సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆరోగ్య శాఖ అధికారుల బృందానికి జిల్లా కలెక్టర్ మనుచౌదరి జిల్లాలో అసంక్రమిక వ్యాధుల వైద్య సేవలు కొరకు ప్రభుత్వం కల్పించిన వైద్య సేవలు, సౌకర్యాలను వివరించారు. సిద్దిపేట జిల్లాలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై కేంద్రం వైద్యం బృందం సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పల్వాన్, ప్రభుత్వ కళాశాల డైరెక్టర్ విమలతామస్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com